

www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
గుంటూరు సిటీ
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 23
సంచిక (Issue) : 290

శుక్రవారం | 26-12-2025 | పేజీలు: 12

శ్రీ విశ్వావసునామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, పుష్యమాసం, శుక్లపక్షం, తిథి: షష్ఠి మ.0:44 తదుపరి సప్తమి, నక్షత్రం: శతభిషం ఉ.9:00 తదుపరి పూర్వాభాద్ర, వర్జ్యం: మ.3:26-5:03, దుర్ముహూర్తం: ఉ.8:58-9:42, మ.12:37-1:21, అమృతఘడియలు: రా.1:06-2:43, రాహుకాలం: ఉ.10:30-12:00, సూర్యోదయం: 6:46, సూర్యాస్తమయం: 5:44

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కాంగ్రెస్ ప్రభుత్వాలన్నీ ఒక్క కుటుంబాన్నే కీర్తించాయి

ఘనతలన్నీ ఒక్క(నెహ్రూ) కుటుంబానికే ఆపాదించాయి.. ప్రధాని మోదీ విమర్శలు

2

అమెరికాలో సాగు భళా!

వ్యవసాయంలో ప్రవాసాంధ్రుల జోష్.. పంట భూముల కొనుగోళ్లలో దూకుడు



తమ పొలంలో పండిన పీకాన్ పప్పు చూపిస్తున్న సమీర్, రాజేశ్, కాంతి

2022లో ఏపీకి చెందిన సమీర్, రాజేశ్, కాంతి కలిసి డాలస్‌కు 2 గంటల దూరంలోని డిలియోన్‌లో ఎకరం రూ.11 లక్షల చొప్పున 333 ఎకరాలు కొనుగోలు చేసి పీకాన్ పప్పు పండిస్తున్నారు. టెక్సాస్ పీకాన్ గ్రోయర్స్ అసోసియేషన్ నుంచి 2025కు గాను 'బెస్ట్ న్యూ గ్రోయర్' అవార్డును అందుకున్నారు.

- పప్పులు, కూరగాయలు, పండ్ల సాగులో సాంకేతికత వినియోగంతో లాభాల పంట
- భవిష్యత్తులో రియల్ బూమ్‌పైనా ఆశలు
- రాంచ్ యజమానులకు పన్ను రాయితీ
- వందలాది ఎకరాల్లో గోశాలల నిర్వహణ

(డాలస్ నుంచి కిలారు గోకుల్ కృష్ణ)

అమెరికా వెళ్లినా.. అంతరిక్షంలోకి వెళ్లినా ప్రవాసాంధ్రులు మాత్రం మట్టితో చుట్టరికాన్ని మర్చిపోరు. పాడి పంటలపై ప్రేమాభిమానాలను అంత తేలిగ్గా వదులుకోరు. ఏళ్ల క్రితం అగ్రరాజ్యానికి వలస పోయినవారు ఇప్పుడు అక్కడ వ్యవసాయాన్ని కొత్త పుంతలు తొక్కిస్తున్నారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని రకరకాల పండ్లు, కూరగాయలు పండిస్తూ 'ఔరా' అనిపిస్తున్నారు. మరోవైపు పాడి రంగంలోనూ ముద్ర వేస్తున్నారు. ఐటీ, వైద్యం, వ్యాపార రంగాల్లో స్థిరపడిన తర్వాత దీర్ఘకాలిక ఆర్థిక భద్రత కోసం వ్యవసాయ భూములు కొనుగోలు చేస్తున్నారు. గత కొంతకాలంగా అమెరికా వ్యవసాయ రంగంలో తెలుగు ప్రవాసుల పెట్టుబడులు ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్నాయి. కోవిడ్ అనంతరం ఈ ధోరణి స్పష్టంగా

మిగతా 12వ పేజీలో...



తమ పొలంలోని జామచెట్ల వద్ద సుధీర్, చందు

ఒకప్పుడు నాయకులు ఎంతో హుందాగా ఉండేవారు. మహోన్నత విలువలతో రాజకీయాలు నడిపిన వాజపేయి లాంటి గొప్పవారితో కలిసి పనిచేసిన నేను.. ఇప్పుడు చిల్లర వ్యక్తులతో మాటలు పడాల్సి రావడం బాధగా ఉంది.

వాజపేయి ప్రజల కోసం పరితపించేవారు. తెలుగు జాతి కోసం ఎన్టీఆర్ పోరాటం చేశారు. వాజపేయి మార్గంలోనే ప్రధాని మోదీ ప్రపంచంలో భారత్‌కు అగ్రస్థానం కోసం శ్రమిస్తున్నారు. తెలుగుజాతిని నంబర్ వన్ స్థానంలో చూడడమే నా లక్ష్యం.

\- సీఎం చంద్రబాబు

పీపీపీతో ప్రగతి!



దేశమే ప్రథమం అంటూ చివరి దాకా అదే సిద్ధాంతానికి వాజపేయి కట్టుబడి ఉన్నారు. అమెరికా లాంటి అగ్రదేశాల ఒత్తిళ్లనూ లెక్క చేయకుండా అణు పరీక్షలు నిర్వహించి దేశాన్ని బలమైన రాజ్యంగా తీర్చిదిద్దిన మహనీయుడు.

\- కేంద్ర మంత్రి శివరాజ్ చౌహాన్

అమరావతిలో మాజీ ప్రధాని వాజపేయి విగ్రహాన్ని ఆవిష్కరించిన కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, కేంద్ర మంత్రి పెమ్మసాని, రాష్ట్ర మంత్రి నారాయణ

వాజపేయి ఇదే నమ్మారు | మౌలిక వసతులు, ప్రాజెక్టులతో సంపద సృష్టికి నాంది పలికారు: సీఎం

- జనం గుండెల్లో శాశ్వతంగా నిలిచారు
- ఇప్పుడు పీపీపీలో కాలేజీలు కడితే జైల్లో పెడతామంటున్నారు
- ఈ హెచ్చరికలపై ప్రజలు ఆలోచించాలి
- దేశ భవిష్యత్‌కు బాటలు వేసిన మహనీయుడు వాజపేయి
- అణు పరీక్షలతో బలమైన శక్తిగా మార్చారు
- సుపరిపాలన, విలువలతో కూడిన రాజకీయం ఆయన సొంతం
- ఆర్థిక సంస్కరణలను పీవీ ప్రారంభిస్తే వాజపేయి వాటిని కొనసాగించారు
- మాజీ ప్రధాని, కలాంతో కలిసి పనిచేయడం నా అదృష్టం: చంద్రబాబు
- అమరావతిలో వాజపేయి విగ్రహావిష్కరణ
- హాజరైన కేంద్ర మంత్రి చౌహాన్

అమరావతి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): విధ్వంస పాలనతో రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టిన వాళ్లు.. మళ్లీ తాము అధికారంలోకి వస్తే కాలేజీలు కట్టే వారిని జైల్లో పెడతానని హెచ్చరిస్తుండడం దేనికి సంకేతమో ప్రజలు ఆలోచించాలని సీఎం చంద్రబాబు కోరారు. పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంతో దేశ ప్రగతి సాధ్యమని మాజీ ప్రధాని వాజపేయి నమ్మారని తెలిపారు. నాడు మౌలిక వసతులు, ప్రాజెక్టుల నిర్మాణంతో సంపద సృష్టికి నాంది పలికారని గుర్తు చేశారు. 'పీపీపీ విధానంలో రాష్ట్రంలో మెడికల్ కాలేజీలు నిర్మించి.. కొన్నేళ్ల తర్వాత ప్రభుత్వానికి అప్పగించే వారిని జైల్లో పెడతానంటారా..? అభివృద్ధి పనులు చేసే వారిని జైల్లో పెట్టడం సరైన పద్ధతేనా..' అని మాజీ సీఎం జగన్‌పై

మిగతా 11వ పేజీలో...

పీపీపీ విధానం భేష్!

- వైద్య కళాశాలల నిర్మాణానికి కేంద్రం నుంచి 60% సాయం.. సమన్వయానికి సెల్ ఏర్పాటు చేయండి
- మంత్రి సత్యకుమార్‌కు కేంద్ర మంత్రి నడ్డా లేఖ
- కేంద్ర సహకారం కోరుతూ మంత్రి తిరుగు లేఖ

11

వ్యవసాయాభివృద్ధికి సహకరించండి

- సూక్ష్మనీటి సాగు విస్తరణకు అదనంగా 695 కోట్లు ఇవ్వండి
- కేంద్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని ఇక్కడ ఏర్పాటు చేయండి
- ఆక్వా ల్యాబ్, కొబ్బరి పార్క్, మామిడి బోర్డులూ పెట్టండి
- జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డును అమరావతికి తరలించండి
- పీఎంఎంఎస్‌వై పథకం కింద సబ్సిడీని 60 శాతానికి పెంచండి
- కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్‌కు సీఎం చంద్రబాబు విజ్ఞప్తి


'మన మిత్ర' మాకు తెలియదు

ప్రభుత్వ సర్వేలో 68 శాతం మంది వెల్లడి

- వాట్సాప్ గవర్నెన్స్ వాడితే డబ్బు పోతుందేమో
- 32 శాతం మందిలో కనిపించిన భయం
- స్మార్ట్‌ఫోన్లు లేవన్న వారు 30 శాతం
- వినియోగించింది 20 శాతం మాత్రమే
- కృష్ణా, గుంటూరులోనూ కనిపించని స్పందన
- అవగాహన కల్పించడంలో వైఫల్యం



అమరావతి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన వాట్సాప్ గవర్నెన్స్ (మన మిత్ర) ఒకటుందని ప్రజల్లో చాలా మందికి ఇప్పటికీ తెలియదు. దాదాపు 200 రకాల సేవలు చిటికెలో అందుబాటులోకి తెచ్చామని ప్రభుత్వం ఎంత ప్రచారం చేసుకున్నా, ఆ సేవల సమాచారం ప్రజలకు లేదని ప్రభుత్వం చేసిన సర్వేలోనే వెల్లడైంది. 'మన మిత్ర' అనేది ఒకటి ఉందని కూడా తమకు తెలియదని 68 శాతం మంది తెలిపారు. 80 శాతం మంది 'మేం దానిని వాడలేదని చెప్పారు. వాట్సాప్ గవర్నెన్స్‌పై ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా ఈ సర్వే నిర్వహించారు. ఈ సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో అధికారులు విఫలమవుతున్నారని ఈ సర్వే గణాంకాలతో స్పష్టమవుతోంది. ప్రజలు కేవలం వాట్సాప్ ద్వారానే అన్ని రకాల సేవలు పొందేందుకు వీలుగా ప్రభుత్వం 'మన మిత్ర' తీసుకొచ్చింది. ప్రత్యేక నంబరు ద్వారా వాట్సాప్‌లో ఫిర్యాదులు, వినతులు, విద్యుత్ బిల్లులు, హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవడం, మార్కుల మెమోలు పొందడం లాంటి అనేక సేవలు అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ఏడాది జనవరిలో ఈ పథకం ప్రారంభించగా టెన్త్, ఇంటర్మీడియట్ ఫలితాల సమయంలో



వాట్సాప్ గవర్నెన్స్ గురించి తెలుసా?

మిగతా 12వ పేజీలో...

భీమవరం డీఎస్పీ జయసూర్యపై బదిలీ వేటు

- హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని డీజీపీ ఆదేశం
- సివిల్ తగాదాలు, పేకాట, సెటిల్‌మెంట్లలో భాగస్వామ్యం
- పవన్‌కు బాధితుల ఫిర్యాదులు
- మొదట్లో జయసూర్యకు మద్దతిచ్చిన రఘురామ
- ఆకస్మికంగా బదిలీ వేటు

11



మంటల్లో కాలిపోతున్న బస్సు, కంటెయినర్ లారీ

డివైడర్ దాటి బస్సును ఢీకొట్టిన లారీ

2 వాహనాలూ బుగ్గి.. ఆరుగురు సజీవ దహనం

- మరో 28 మందికి గాయాలు.. పలువురి పరిస్థితి విషమం
- కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లాలో ఘోర ప్రమాదం
- బస్సు డీజిల్ ట్యాంకు పేలి మంటలు.. తెరుచుకోని డోర్లు
- అద్దాలు పగలగొట్టి బయటపడిన పలువురు
- లోపలున్న మరికొందరినీ కాపాడిన వైనం

2

మరో మావోయిస్టు అగ్రనేత ఎన్‌కౌంటర్

12

- ఒడిశాలో కేంద్ర కమిటీ సభ్యుడు పాకా హనుమంతు మృతి
- మరో ఐదుగురు మావోయిస్టులు కూడా.. వీరిలో ఇద్దరు మహిళలు
- హనుమంతు స్వస్థలం నల్లగొండ జిల్లా చండూరు మండలం పుల్లెంల
- 1981లో అజ్ఞాతంలోకి వెళ్లిన పాకా హనుమంతు



పాకా హనుమంతు (ఫైల్ ఫొటో)

ప్రతి దరఖాస్తుకూ జవాబుదారీ

- అన్ని కలెక్టరేట్లలోనూ రెవెన్యూ డెస్క్
- డిప్యూటీ కలెక్టర్లకు బాధ్యత
- విన్నపాలకు ఆధార్ అనుసంధానం
- దరఖాస్తుదారుడికి సర్టిఫైడ్ కాపీ
- స్వీకరణ, పరిష్కారానికి ఓ సాఫ్ట్‌వేర్
- రెవెన్యూ శాఖ నిర్ణయం



అమరావతి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదులకు జవాబుదారీ ఉండాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలపై రెవెన్యూ శాఖ కదిలింది. రెవెన్యూశాఖ సేవలు కోరుతూ ప్రజలు ఇచ్చే దరఖాస్తుల స్వీకరణ, పరిష్కారానికి సంబంధించి కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తోంది. ప్రతి జిల్లా కలెక్టరేట్ పరిధిలో రెవెన్యూ డెస్క్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీన్ని స్పెషల్ రెవెన్యూ డెస్క్‌గా పరిగణిస్తారు. మన్యం జిల్లాలో కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి రెవెన్యూ క్లినిక్ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అదే తరహాలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతి కలెక్టరేట్ పరిధిలోనూ పూర్తిస్థాయిలో పనిచేసేలా స్పెషల్ రెవెన్యూ డెస్క్‌ను ఏర్పాటు చేయాలని రెవెన్యూశాఖ నిర్ణయించింది. బుధవారం రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ అధ్యక్షతన జరిగిన కీలక భేటీలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ప్రజలు రెవెన్యూ సేవలు కోరుతూ ఇచ్చే ప్రతి విన్నపానికీ జవాబుదారీతనం తీసుకువచ్చేందుకు ఈ ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఈ డెస్క్‌కు డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారిని

మిగతా 11వ పేజీలో...



రమణక్కపేటలో దారిలేకపోవడంతో రెండేళ్లుగా నిరుపయోగంగా ఉన్న సబ్‌స్టేషన్

పది గజాల దారి లేక..

నూజివీడు వద్ద రెండేళ్లుగా నిరుపయోగంగా సబ్‌స్టేషన్

- కాసుల కక్కుర్తితో ట్రాన్స్‌కో నిర్వాకం.. సబ్‌స్టేషన్ల నిర్మాణంలో దోపిడీ
- దారిలేని ఆరు ఎకరాలు 2 కోట్లకు కొనుగోలు.. రూ.34 కోట్లతో సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తి.. ఇన్ని కోట్లు పోసినా ఆపరేషన్‌లోకి తేలేని స్థితి
- నెల్లూరులో లెస్ టెండరు తిరస్కరణ.. మళ్లీ టెండరుతో 6 కోట్లకు ఎసరు
- రాజధానిలో తాళ్లాయపాలెం అప్‌గ్రేడేషన్‌కు అవకాశం
- కానీ, 300 కోట్లతో దానికి దగ్గర్లోనే మరో సబ్‌స్టేషన్

3

ఖండాంతర కె-4 క్షిపణి ప్రయోగం సక్సెస్

- ఐఎన్ఎస్ అరిఘాత్ నుంచి ప్రయోగం
- సముద్ర గర్భం నుంచి 3,500 కి.మీ. పరిధిలో లక్ష్యాలు ఛేదించే సామర్థ్యం
- 2.5 టన్నుల వార్‌హెడ్ మోసుకెళ్లే క్షిపణి.. 'అణు త్రయం'లో ముందడుగు

2

బంగ్లాలో మరో మూక దాడి

- హిందూ యువకుడు అమృత్ మండల్ హత్య.. వారంలో రెండో ఘటన
- ఇటీవలే దీపు చంద్రదాస్ దారుణ హత్య
- ఉద్రిక్త పరిస్థితులు.. పోలీసుల మోహరింపు
- ఎన్నికల్లో 'అవామీ లీగ్' పోటీపై నిషేధం
- 17 ఏళ్ల తర్వాత బంగ్లాకు తిరిగొచ్చిన ఖలీదా జియా కుమారుడు తారిఖ్ రెహ్మాన్



అమృత్ మండల్

2



ఒక్కసారిగా దివ్యదర్శనం టోకెన్ల క్యూలోకి దూసుకొచ్చిన భక్తులు

3

దర్శన టోకెన్ల క్యూలో తోపులాట!

- లాఠీతో తట్టి ముందుకు పంపిన భద్రతా సిబ్బంది
- తప్పుడు సమాచారం ప్రచారం చేస్తే చర్యలు: ఎస్పీ
- శ్రీవాణి టికెట్ల కోసం తిరుమలలో భక్తుల నిరసన
- అన్నమయ్య భవనం ముందు రోడ్డుపై బైఠాయింపు



బెత్లెహాంలోని సెయింట్ క్యాథరిన్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు

ప్రపంచవ్యాప్తంగా ఘనంగా క్రిస్మస్ వేడుకలు

▸ రెండేళ్ల తర్వాత బెత్లెహామ్‌లో పండుగశోభ

బెత్లెహామ్, ఢిల్లీ, డిసెంబరు 25: ప్రపంచవ్యాప్తంగా క్రైస్తవులు క్రిస్మస్‌ను గురువారం భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. జీసస్ జన్మించిన పవిత్ర స్థలంగా భావించే వెస్ట్‌బ్యాంక్‌లోని బెత్లెహామ్ నగరానికి వేలాదిమంది తరలివచ్చారు. గాజాలోని పాలస్తీనీయుల మీద ఇజ్రాయెల్ దాడుల కారణంగా గత రెండేళ్లలో ఈ ప్రాంతంలో క్రిస్మస్ ఉత్సవాలు జరగలేదు. హమాస్-ఇజ్రాయెల్ శాంతి చర్చలతో యుద్ధం ముగిసిన నేపథ్యంలో.. ఈసారి బెత్లెహామ్‌కు క్రైస్తవులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. పోప్ లియో.. వాటికన్ నుంచి ఇచ్చిన తన మొదటి క్రిస్మస్ సందేశంలో పాలస్తీనీయుల కడగండ్లను ప్రస్తావించటం విశేషం. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తన క్రిస్మస్ సందేశంలో.. పుతిన్ చావాలని ఉక్రెయిన్లందరూ కోరుకుంటున్నారంటూ పరోక్ష వ్యాఖ్యలు చేశారు. క్రిస్మస్ సందర్భంగా గురువారం ఢిల్లీలో ఓ చర్చిలో జరిగిన ప్రార్థనా సమావేశానికి, వేడుకలకు ప్రధాని మోదీ హాజరయ్యారు. విపక్ష నేత రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

గల్ఫ్‌లో తెలుగు ప్రవాసీయుల క్రిస్మస్ సంబరాలు

ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి, డిసెంబరు 25: గల్ఫ్ దేశాల్లో క్రిస్మస్ సందడి నెలకొంది. తెలుగు ప్రవాసీయులు పెద్ద ఎత్తున సంబరాల్లో పాల్గొన్నారు. కువైట్‌లోని తెలుగు చర్చి(టి.సి.సి) ప్రాంగణంతో పాటు సాల్మీయాలోని రోడ్లు భక్తులతో కిక్కిరిసోయాయి. దుబాయిలో తెలుగు భాషలో సేవలందించే హోలీ ట్రినిటీ, సెంట్ పాల్ చర్చిలలో సందడి నెలకొంది. హైదరాబాద్ నుంచి వచ్చిన పాస్టర్ రాజా హేబెల్ ప్రసంగం వినేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. కరమా ప్రాంతంలో ప్రవాసాంధ్ర క్రైస్తవ ప్రముఖుడు సామ్యూల్ రత్నం అధ్వర్యంలో కెరం కసరత్తు నిర్వహించారు. దుబాయిలోని తెలుగు చర్చిల్లో క్రిస్మస్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లోని భారతీయ ఎంబసీ సౌజన్యంతో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలలో తెలుగు ప్రవాసీ ప్రముఖుడు రేవల్ అంథోని సమన్వయకర్తగా వ్యవహరించారు. బహ్రెయిన్‌లో తెలుగు కళా సమితి అధ్వర్యంలో జరిగిన క్రిస్మస్ వేడుకలలో వివిధ తెలుగు చర్చిల ప్రతినిధులు పాల్గొన్నారు. ఖతర్, ఒమన్‌లలో తెలుగు క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ పండుగను జరుపుకోవడం జరిగింది.

సైనికులూ ఇన్‌స్టా వాడొచ్చు..షరతులు వర్తిస్తాయి

న్యూఢిల్లీ, డిసెంబరు 25: సైనికులు సామాజిక మాధ్యమాలను వాడడంపై మొన్నటి వరకూ ఉన్న పూర్తి నిషేధం తొలగింది. సామాజిక మాధ్యమాల నియంత్రిత వాడకానికి అనుమతి ఇస్తూ సైన్యం నిర్ణయం తీసుకుంది. ఫేస్ బుక్, యూట్యూబ్, లింక్డెన్, ఎక్స్, కోరా, టెలిగ్రామ్, వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాలను చూడడానికి మాత్రమే అనుమతి ఇచ్చింది. నిబంధనలను కచ్చితంగా పాటించాలి. ఆమేరకు ఆయా మాధ్యమాల వాడకంపై పూర్తి నిఘా ఉంటుంది. తాజాగా ఈ జాబితాలో ఇన్‌స్టాగ్రామ్ కూడా చేరింది. అయితే పై సామాజిక మాధ్యమాల్లో ఎలాంటి చిత్రాలను, సందేశాలను పోస్ట్ చేయకూడదు. కేవలం సమాచారం కోసం, విషయ పరిజ్ఞానం కోసం చూడడానికి మాత్రమే అనుమతి ఉంది. భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది మొబైల్, సామాజిక మాధ్యమాల వాడకంపై మాట్లాడుతూ, 'స్మార్ట్ ఫోన్ అవసరమే. కుటుంబ సభ్యులతో సంబంధాల్లో ఉండడానికి ఫోన్ నేడు ఓ తప్పనిసరి సాధనం. అయితే వివిధ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న విషయాలపై రియాక్ట్ కాకూడదు. మీ అభిప్రాయాలను వ్యక్తీకరించాలని అనుకుంటే సైన్యం నుంచి విరమణ చేసిన తరువాత స్పందించండి' అని పేర్కొన్నారు.

అలీగఢ్ వర్సిటీ స్కూల్ టీచర్ కాల్చివేత

అలీగఢ్, డిసెంబరు 25 : ఉత్తర్‌ప్రదేశ్‌లోని అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ క్యాంపస్‌లో ఒక స్కూల్ టీచర్‌ని బుధవారం రాత్రి కాల్చి చంపిన ఘటన సంచలనం సృష్టించింది. ఆ యూనివర్సిటీ పూర్వ విద్యార్థి అయిన రావ్ డానిష్ హిలాల్ క్యాంపస్‌లోని ఏబీకే హైస్కూల్‌లో గత 11 ఏళ్లుగా టీచర్‌గా పనిచేస్తున్నారు. ఆయన బుధవారం రాత్రి మరో ఇద్దరు తోటి ఉద్యోగులతో కలిసి వాకింగ్‌కు బయలుదేరగా సరిగ్గా 8.50 గంటలకు స్కూటర్‌పై వచ్చిన ఇద్దరు ముసుగు ధరించిన వ్యక్తులు వారిని ఆపి తుపాకీతో బెదిరించారు. అనంతరం డానిష్‌పై మూడుసార్లు కాల్పులు జరిపి పరారయ్యారు. దీంతో ఆయన్ను వెంటనే జవహర్‌లాల్ నెహ్రూ మెడికల్ కాలేజీకి తరలించగా వైద్యులు అప్పటికే మరణించినట్లు తెలిపారు. రాత్రి కూడా జనసంచారం ఉండే ఆ యూనివర్సిటీ సెంట్రల్ లైబ్రరీ దగ్గర ఈ ఘటన జరిగింది.

విజన్ ఐఏఎస్ సెంటర్‌కు11 లక్షల జరిమానా

న్యూఢిల్లీ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కోచింగ్ సెంటర్ల తప్పుడు ప్రకటనలపై కేంద్ర వినియోగదారుల పరిరక్షణ అథారిటీ (సీసీపీఏ) ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రజలను తప్పుదోవ పట్టించేలా, మభ్యపెట్టేలా తప్పుడు ప్రకటనలు చేస్తే భారీ మూల్యం తప్పని హెచ్చరించింది. ప్రముఖ కోచింగ్ సెంటర్ విజన్ ఐఏఎస్‌కు రూ.11 లక్షల భారీ జరిమానా విధించింది. విజన్ ఐఏఎస్ తన వెబ్‌సైట్‌లో 'యూపీఎస్సీ-2023లో టాప్ -10లో ఏడుగురు, టాప్-100లో 79 మంది మా విద్యార్థులే' అని ప్రకటించింది. '2022లో టాప్-50లో 39 మంది మా వారే' అని ప్రకటనలు ఇచ్చింది. తన ప్రకటనల్లో ర్యాంకర్ల పేర్లు, ఫొటోలను స్పష్టంగా ప్రదర్శించింది. విద్యార్థులు ఏ రకమైన కోర్సు తీసుకున్నారనే విషయంలో మాత్రం స్పష్టత కొరవడేలా ఆ ప్రకటన ఉంది. ఉదాహరణకు.. 2020 టాపర్ శుభమ్ కుమార్ 'ఫౌండేషన్ కోర్స్' తీసుకున్నారని చెప్పిన సంస్థ, మిగిలిన ర్యాంకర్ల విషయంలో ఆ వివరాలను దాచిపెట్టింది. దీనిపై సీసీపీఏ విచారణ జరపగా.. విజన్ ఐఏఎస్ సంస్థ క్లెయిమ్ చేసిన 119మంది విజేతల్లో ముగ్గురే లక్షల రూపాయల ఫీజు ఉండే 'ఫౌండేషన్ కోర్సు'లో చదివారు. దీంతో, ఆ సంస్థ ప్రకటన వినియోగదారుల పరిరక్షణ చట్టం-2019లోని 2(28) సెక్షన్‌ను ఉల్లంఘించినట్టు అవుతుందని సీసీపీఏ తెలిపింది. ఏకంగా రూ.11 లక్షల జరిమానా విధించింది. ఇటువంటి తప్పుడు ప్రకటనలకు సంబంధించి ఇప్పటివరకు 57 కోచింగ్ సెంటర్లకు నోటీసులు జారీ చేశామని తెలిపింది. 28 సంస్థలకు మొత్తం రూ.1.09కోట్ల మేర ఫైన్ విధించినట్టు పేర్కొంది.

కార్యకర్తగా చెత్త ఊడ్చా...పార్టీ జెండా కట్టా

▸ నేను జీవితకాలం పార్టీ కార్యకర్తను: శివకుమార్



బెంగళూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తాను వేదిక లెక్క ప్రసంగాలు చేయలేదని, కాంగ్రెస్ కార్యకర్తగా చెత్త ఊడ్చానని, పార్టీ జెండా కట్టానని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వ్యాఖ్యానించారు. బెంగళూరు సదాశివనగర్‌లో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేను గురువారం కలిసిన తర్వాత శివకుమార్ మీడియాతో మాట్లాడుతూ...తాను పార్టీ కార్యకర్తగా ఉండేందుకు ఆసక్తి చూపుతున్నానన్నారు. డీసీఎం పదవితో సంతృప్తిగా ఉన్నానని ఢిల్లీలో చేసిన వ్యాఖ్యలపై మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానంగా 'అవును నేను జీవితకాలం పార్టీ కార్యకర్తను' అంటూ కాంగ్రెస్ పార్టీకి ఏం కావాలో అన్నీ చేశానని స్పష్టం చేశారు. ఏఐసీసీ అధ్యక్షుడితో నాయకత్వ మార్పు అంశమై మాట్లాడారా అనే ప్రశ్నకు...ఎటువంటి విషయాలపైనా చర్చించలేదని, అటువంటి అవసరం కూడా లేదని తెలిపారు. 'మీ శ్రమకు ఫలితం లభిస్తుందా' అనే ప్రశ్నకు మీడియా అడిగిన అన్నింటికీ సమాధానాలు చెప్పలేమంటూ దాటవేశారు.

ఖండాంతర కె-4 క్షిపణి
ప్రయోగం సక్సెస్



సముద్ర గర్భం నుంచి 3,500 కి.మీ. పరిధిలో లక్ష్యాలు ఛేదించే సామర్థ్యం

▸ ఐఎన్ఎస్ అరిఘాత్ నుంచి ప్రయోగం

▸ 2.5 టన్నుల వార్‌హెడ్ మోసుకెళ్లే క్షిపణి

▸ 'అణు త్రయం'లో మరో ముందడుగు

న్యూఢిల్లీ, డిసెంబరు 25: వ్యూహాత్మక రక్షణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా మన దేశం కీలక క్షిపణి పరీక్షను నిర్వహించింది. అణు సామర్థ్య జలాంతర్గామి నుంచి బంగాళాఖాతంలో మధ్యస్థ స్థాయి ఖండాంతర క్షిపణిని పరీక్షించి మన అణు శక్తిని ప్రపంచానికి చాటింది. మంగళవారం విశాఖపట్నం తీరంలో ఐఎన్ఎస్ అరిఘాత్ జలాంతర్గామి నుంచి కె-4 క్షిపణి ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించారు. 3,500 కి.మీ. పరిధిలోని లక్ష్యాలను ఛేదించడానికి రూపొందించిన ఈ క్షిపణితో భారత్ సముద్ర ఆధార అణు శక్తికి మరింత బలం చేకూరనుంది. కె-4 జలాంతర్గామి నుంచి ప్రయోగించే ఖంతాంతర క్షిపణి (ఎస్ఎల్‌బీఎం)తో భూ ఉపరితలం, గగనతలం, సముద్రగర్భం నుంచి అణు దాడుల సామర్థ్యం ఉన్న దేశాల సరసన భారత్ చేరింది. మూడు రకాలుగా రహస్య దాడులు చేసే మన దేశ అణ్వాయుధ త్రయంలో కె-4 క్షిపణులు కీలక పాత్ర పోషిస్తాయి. అణు దాడుల నిరోధక గస్తీ కోసం సముద్రంలో రహస్యంగా, నిశ్శబ్దంగా సుదీర్ఘకాలం పాటు సంచరించే అరిహంత్ తరగతి జలాంతర్గాముల కోసం వీటిని రూపొందించారు. భూ ఉపరితం నుంచి దాడులు చేసే అగ్ని-3 క్షిపణి నుంచి దేశంలోనే అత్యధిక దూరంలోని లక్ష్యాలను ఛేదించే సముద్ర ఆధార కె-4 క్షిపణిని అభివృద్ధి చేశారు. ఈ క్షిపణి 2.5 టన్నుల అణు వార్‌హెడ్‌లను మోసుకెళ్లగలదు.

కె-4 అంటే ఇది..

మధ్యస్థ స్థాయి, ఘన ఇంధన జలాంతర్గామి నుంచి ప్రయోగించే ఖండాంతర క్షిపణి కె-4. ఈ క్షిపణుల సిరీస్‌లో 'కె' అనే అక్షరాన్ని ఏపీజే అబ్దుల్ కలామ్ స్మృత్యర్థం పెట్టారు. దీనిని డీఆర్‌డీవో అభివృద్ధి చేయగా, క్షిపణులను భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) తయారు చేస్తోంది. ఈ క్షిపణిని అరిహంత్ తరగతి ఐఎన్ఎస్ అరిహంత్, ఐఎన్ఎస్ అరిఘాత్ వంటి జలాంతర్గాముల కోసం ప్రత్యేకంగా అభివృద్ధి చేశారు. ఈ క్షిపణితో సముద్రంలో మన యుద్ధ సామర్థ్యం గణనీయంగా పెరుగుతుంది. అంతకుముందు 700 కి.మీ పరిధి మాత్రమేగల కె-15 (సాగరిక)పైనే ఆధార పడేవారు. 10 నుంచి 12 మీటర్లు పొడవుండే కె-4 క్షిపణి 17 నుంచి 20 టన్నుల వరకు బరువు ఉంటుంది. రెండు దశల స్థిర రాకెట్ మోటార్‌తో పనిచేస్తుంది. ఈ క్షిపణి నావిగేషన్ కోసం జీఎన్ఎస్ఎస్‌తో పాటు నావిక్‌పై ఆధారపడుతుంది.

వ్యూహాత్మకంగా చాలా కీలకం

తాజా కె-4 పరీక్ష మన దేశానికి వ్యూహాత్మకంగా చాలా కీలకమైనది. త్వరలోనే జలాంతర్గాముల అమ్ములపొదిలో చేరే ఈ క్షిపణితో అణుదాడుల నిరోధక సామర్థ్యం మరింత పెరుగుతుంది. తొలిగా అణుదాడుల చేయబోమన్న దానికి కట్టుబడి, శత్రు దేశాలు చేసే దాడులను సమర్థంగా తిప్పికొట్టగలిగే రెండో దాడికి ఈ క్షిపణులు ఎంతో ఉపయోగపడతాయి. దీని సుదీర్ఘ రేంజ్‌తో హిందూ మహాసముద్రంలో వ్యూహాత్మక స్థిరత్వం, దాడుల నిరోధ శక్తి పెరుగుతుంది. హిందూ మహాసముద్రంలో చైనా తన శక్తిని పెంచుకోవడం, ఫసిఫిక్ జలాల్లో అమెరికా ప్రభావం నేపథ్యంలో కె-4 వంటి క్షిపణులు శత్రు దాడులను తిప్పికొట్టడమే కాకుండా, ప్రాంతీయ భయాలు పెరగకుండా అదుపులో ఉంచగలుగుతాయని రక్షణ సిబ్బంది చెప్పారు.

డివైడర్ దాటి బస్సును
ఢీకొట్టిన లారీ



మంటల్లో కాలిపోతున్న బస్సు, కంటెయినర్ లారీ

▸ రెండు వాహనాలూ బుగ్గి.. ఆరుగురు సజీవ దహనం

▸ 28 మందికి గాయాలు.. పలువురి పరిస్థితి విషమం

▸ కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లాలో ఘోర ప్రమాదం

బళ్లారి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): అదుపుతప్పిన కంటెయినర్ లారీ డివైడర్‌ను దాటి ఎదురుగా వస్తున్న ట్రావెల్స్ బస్సును బలంగా ఢీకొనడంతో ఆరుగురు సజీవ దహనమయ్యారు. మరో 28 మంది గాయాలపాలయ్యారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లా హిరియూరు పట్టణ సమీపాన 48వ జాతీయ రహదారిపై జవర్గండనహళ్లి క్రాస్ వద్ద గురువారం తెల్లవారుజామున జరిగిందీ ఘోర ప్రమాదం. హిరియూరు వైపు నుంచి బెంగళూరు వైపు వెళ్తున్న కంటెయినర్ లారీ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని అవతలి వైపు రోడ్డులోకి దూసుకెళ్లింది. అనంతరం ఎదురుగా వస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సును ఢీకొంది. బస్సు డీజిల్ ట్యాంకును కంటెయినర్ బలంగా ఢీకొట్టడంతో అది పేలి, క్షణాల్లో మంటలు వ్యాపించాయి. బస్సులోని ఐదుగురు ప్రయాణికులు, కంటెయినర్ డ్రైవర్ సజీవ దహనమయ్యారు. బెంగళూరు నుంచి గోకర్ణకు బుధవారం రాత్రి ప్రైవేటు ట్రావెల్స్ బస్సు 28 మంది ప్రయాణికులు, ఇద్దరు డ్రైవర్లు, ఒక క్లీనర్‌తో బయల్దేరింది. మధ్యలో మరో ఇద్దరు బస్సు ఎక్కారు. ప్రమాద సమయంలో బస్సులో 30 మంది ఉన్నారు. బస్సు డోర్లు తెరుచుకోకపోవడంతో అద్దాలను పగలగొట్టి పలువురు ప్రయాణికులు బయటపడ్డారు. వారే మరికొందరిని కాపాడారు. కాగా, డివైడర్ దాటి వచ్చిన లారీని చూసి బస్సును పక్కకు తప్పించేందుకు ప్రయత్నించానని, ఈలోపే వచ్చి ఢీకొట్టిందని బస్సు డ్రైవర్ రఫీక్ తెలిపారు. లారీ ఢీకొనడం వరకే తనకు గుర్తుందని, తర్వాత ఏం జరిగిందో, ఆస్పత్రిలోకి ఎలా వచ్చానో తెలియదని రఫీక్ చెప్పారు. ప్రమాదంపై రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ, సీఎం సిద్దరామయ్య దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులకు సంతాపం ప్రకటించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతుల కుటుంబాలకు కేంద్రం రూ.2 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాయి. మృతుల్లో బిందు అనే మహిళ, ఆమె ఐదేళ్ల కుమార్తె గ్రేయ కూడా ఉన్నారు. వీరితోపాటు మానస, నవ్య, రష్మి, కంటెయినర్ డ్రైవర్(పేరు తెలియరాలేదు) కూడా సజీవ దహనమయ్యారు. ప్రమాదానికి గురైన ట్రావెల్స్ బస్సు వెనుక ఉన్న స్కూల్ బస్సుకు తృటిలో ముప్పు తప్పింది. స్కూల్ బస్సులో 42 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రమాదానికి గురైన ట్రావెల్స్ బస్సును వెనుక నుంచి ఢీకొట్టిన స్కూల్ బస్సు వెంటనే పక్కకు తిరిగిపోయి రోడ్డు పక్కకు జారిపోయింది. బస్సులో ఎవరికీ ఏమీ కాలేదు.

లోకం తీరు



సెంగార్‌కు బెయిల్‌పై సుప్రీంకోర్టులో సవాలు

▸ జైలు శిక్షను సస్పెండ్ చేయడాన్ని ప్రశ్నిస్తూ ఇద్దరు లాయర్ల పిటిషన్

న్యూఢిల్లీ, డిసెంబరు 25: ఉన్నావ్ రేప్ కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న బీజేపీ బహిష్కృత నేత కులదీప్ సింగ్ సెంగార్‌కు ఢిల్లీ హైకోర్టు బెయిల్ ఇవ్వడాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలయింది. ఇద్దరు న్యాయవాదులు ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. మరో వైపు ఇదే విషయమై సీబీఐ కూడా సుప్రీంకోర్టును ఆశ్రయించనుంది. 2017లో జరిగిన రేప్ కేసులో సెంగార్‌కు ట్రయల్ కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. దీనిపై ఆయన హైకోర్టులో అప్పీలు చేశారు. ఆ అప్పీలు ఇంకా పెండింగ్‌లో ఉండడం, ఇప్పటికే ఏడేళ్ల అయిదు నెలల పాటు జైలులో ఉండడంతో ఢిల్లీ హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఆ శిక్షను మంగళవారం సస్పెండ్ చేసింది. పలు షరతులతో బెయిల్ మంజూరు చేసింది. హైకోర్టు ఆదేశాలపై స్టే ఇవ్వాలని కోరుతూ న్యాయవాదులు అంజలే పటేల్, పూజా శిల్పాకర్‌లు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సహజసిద్ధ మరణం సంభవించే వరకు జైలులోనే ఉండాలంటూ ట్రయల్ కోర్టు స్పష్టంగా చెప్పినప్పటికీ దాన్ని గుర్తించడంలో హైకోర్టు విఫలమయిందని తెలిపారు. తీవ్రమైన నేరపూరిత చరిత్ర, కూరమైన నేరాలకు పాల్పడ్డ ఉదంతాలు ఉన్నప్పటికీ శిక్షను సస్పెండ్ చేసి, బెయిల్ ఇవ్వడం తగదని పేర్కొన్నారు. ధన, కండ బలంతో పాటు నేరపూరిత స్వభావం కలిగి ఉన్నారనేందుకు ఆధారాలు ఉన్నాయని, కేసు దర్యాప్తు సమయంలోనే బాధితురాలి తండ్రి జ్యుడీషియల్ కస్టడీలో మరణించడం ఇందుకు నిదర్శనమని వివరించారు. బాధిత కుటుంబాన్ని భయపెట్టి, న్యాయ ప్రక్రియను అడ్డుకోవడానికే ఇలాంటి చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ కారణాల దృష్ట్యా బెయిల్ ఇవ్వకూడదని కోరారు. మరోవైపు హైకోర్టు ఆదేశాలపై వెంటనే సుప్రీంకోర్టులో సవాలు చేస్తామని సీబీఐ ప్రధాన అధికార ప్రతినిధి తెలిపారు.

విమాన ప్రయాణికుడి నుంచి 272 డ్రోన్లు స్వాధీనం

చెన్నై, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ విమానాశ్రయంలో రూ.1.15 కోట్ల విలువైన 272 డ్రోన్లను కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అందిన సమాచారం మేరకు బుధవారం దుబాయ్, సింగపూర్ నుంచి వచ్చిన ప్రయాణికులను కోయంబత్తూరు విమానాశ్రయ కస్టమ్స్ అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓ ప్రయాణికుడి నుంచి 272 డ్రోన్లు స్వాధీనం చేసుకున్నారు. .

బంగ్లాదేశ్ దౌత్యకార్యాలయానికి బాంబు బెదిరింపు

చెన్నై, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): చెన్నై తేనాంపేటలోని బంగ్లాదేశ్ దౌత్య కార్యాలయానికి ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు వచ్చింది. స్థానిక పోలీసు కంట్రోల్ రూమ్ కార్యాలయానికి బుధవారం రాత్రి వచ్చిన ఈ-మెయిల్‌లో...బంగ్లాదేశ్ దౌత్య కార్యాలయంలో బాంబు పేలబోతోందని ఆగంతకులు హెచ్చరించారు. దీంతో బాంబ్ స్క్వాడ్ నిపుణులు, జాగిలాలతో కలిసి వెళ్లిన పోలీసులు.. దౌత్య కార్యాలయం అణువణువునా తనిఖీ చేశారు. ఎలాంటి పేలుడు పదార్థాలు దొరకలేదు.

67 ఇండిగో విమాన సర్వీసుల రద్దు

ముంబై, డిసెంబరు 25: దేశీయ విమానయాన సంస్థ ఇండిగో గురువారం 67 విమాన సర్వీసులను రద్దు చేసింది. అగర్తలా, చండీగఢ్, డెహ్రాడూన్, వారాణసీ, బెంగళూరు తదితర విమానాశ్రయాల్లో వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉండడం, నిర్వహణ కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తన వెబ్‌సైట్‌లో వెల్లడించింది. డిసెంబరు 10 నుంచి ఫిబ్రవరి 10 వరకు 'ఫాగ్ సీజన్'గా డీజీసీఏ ఇటీవల ప్రకటించింది.

బంగ్లాదేశ్‌లో మరో మూక దాడి

▸ హిందూ యువకుడు అమృత్ మండల్ హత్య.. వారంలో రెండో ఘటన

▸ ఎన్నికల్లో 'అవామీ లీగ్' పోటీపై నిషేధం

▸ 17 ఏళ్ల తర్వాత బంగ్లాకు తిరిగొచ్చిన ఖలేదా జియా కుమారుడు తారిఖ్ రెహ్మాన్



తారిఖ్‌కు స్వాగతం పలికేందుకు ఢాకా ఎయిర్‌పోర్టుకు తరలివచ్చిన బంగ్లాదేశ్ ప్రజలు



ఢాకా, డిసెంబరు 25: దీపు చంద్ర దాస్ హత్య తర్వాత బంగ్లాదేశ్‌లో మరో హిందువుపై మూకదాడి జరిగింది. రాజ్‌బరి జిల్లాలో ఓ వ్యక్తిపై కొంత మంది దాడి చేశారని, బాధితుడు మృతిచెందాడని పోలీసులు పేర్కొన్నారు. హోసైన్‌దంగా పాత మార్కెట్ వద్ద బుధవారం రాత్రి 11 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. బాధితుడిని 29 ఏళ్ల అమృత్ మండల్ అలియాస్ సామ్రాట్‌గా గుర్తించారు. పంగ్షా మోడల్ పోలీసుస్టేషన్ ఆఫీసర్ మొయినుల్ మాట్లాడుతూ.. పరిస్థితి మూక హింసకు దారితీసే ముందు, అమృత్ మండల్‌పై స్థానికులు దోపిడీ ఆరోపణలు చేశారని చెప్పారు. మండల్ 'సామ్రాట్ బాహిని' అనే ఓ స్థానిక గ్రూపు నాయకుడని వెల్లడించారు. హత్యకు దారితీసిన కారణాలు, మూకదాడిలో పాల్గొన్న వారిని గుర్తించేందుకు దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. అమృత్ మండల్ హత్యతో స్థానికంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పెద్దఎత్తున అదనపు పోలీసు బలగాలను మోహరించారు. వారం రోజుల వ్యవధిలో జరిగిన రెండో మూక హత్య ఇది. ఈనెల 18న ఇస్లాంకు వ్యతిరేకంగా మాట్లాడాడనే ఆరోపణలతో మైమన్ సింగ్ డివిజన్ పరిధిలోని భలూకాలో దీప్ చంద్రదాస్ అనే కార్మికుడిని కొంత మంది హత్య చేశారు. ఆ తర్వాత మృత దేహాన్ని ఓ చెట్టుకు కట్టేసి నిప్పుపెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఎన్నికల్లో పోటీకి 'అవామీ లీగ్'కు నో చాన్స్

వచ్చే ఫిబ్రవరిలో జరిగే జాతీయ పార్లమెంటరీ ఎన్నికల్లో మాజీ ప్రధాని షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ పార్టీ పోటీ చేసేందుకు అవకాశం లేదని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు తాత్కాలిక ప్రభుత్వ సలహాదారు మీడియా కార్యదర్శి షఫికుల్ ఆలం ప్రకటన చేశారు. బుధవారం తాత్కాలిక ప్రభుత్వ అడ్వైజరీ కౌన్సిల్ సమావేశం తర్వాత మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం అవామీ లీగ్ పార్టీ గుర్తింపును ఇప్పటికే రద్దు చేసిందని పేర్కొన్నారు. విద్యార్థి నాయకుడు ఉస్మాన్ హదీ హత్య తర్వాత దేశంలో నెలకొన్న అశాంతియుత పరిస్థితుల నేపథ్యంలో హోంశాఖ కార్యకలాపాలపై తాత్కాలిక ప్రభుత్వ చీఫ్ అడ్వైజర్‌కు ప్రత్యేక అసిస్టెంట్‌గా ఉన్న ఖుదా బక్ష్ చౌదురి రాజీనామా చేశారు.

నా వద్ద ఓ ప్లాన్ ఉంది: తారిఖ్

బంగ్లాదేశ్‌లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ ప్రధాని ఖలేదా జియా, మాజీ అధ్యక్షుడు జియావుర్ రెహమాన్‌ల కుమారుడు తారిఖ్ గురువారం దేశానికి తిరిగొచ్చారు. 17 ఏళ్ల స్వీయ బహిష్కరణ తర్వాత ఢాకాలో అడుగుపెట్టారు. తారిఖ్ బీఎన్‌పీ తాత్కాలిక చైర్మన్‌గా ఉన్నారు. అభిమానులను ఉద్దేశించి తారిఖ్ కీలక ప్రసంగం చేశారు. మెరుగైన బంగ్లాదేశ్‌ను నిర్మించేందుకు తన వద్ద ఒక ప్లాన్ ఉందన్నారు. తనకు మద్దతు ఇవ్వాలని, దేశాన్ని నిర్మించడంలో భాగస్వామ్యం కావాలని కోరారు. బంగ్లాదేశ్‌లో అన్ని మతాలకు చోటు ఉందని, సహనంగా ఉండాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. ఉస్మాన్ హదీ హత్యకు న్యాయం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. పలు అవినీతి కేసులో దోషిగా తేలిన తారిఖ్ రెహ్మాన్ 2008 నుంచి ప్రవాసంలో ఉంటున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వాలన్నీ ఒక్క కుటుంబాన్ని మాత్రమే
కీర్తించాయి

ఒక్క కుటుంబానికే ఘనతలన్నీ ఆపాదించాయి

ప్రధాని మోదీ విమర్శలు

లక్నో, డిసెంబరు 25: స్వాతంత్ర్యం వచ్చాక కాంగ్రెస్ ప్రభుత్వాలన్నీ ఒక్క(నెహ్రూ) కుటుంబాన్ని మాత్రమే కీర్తిస్తూ మిగతా జాతీయ నాయకులను విస్మరించాయని ప్రధాని మోదీ విమర్శించారు. ఘనతలన్నీ ఒక్క కుటుంబానికే ఆపాదించారనే విషయం ఎవరూ మరచిపోవద్దని ఆయన నెహ్రూ కుటుంబాన్ని ఉద్దేశించి విమర్శలు గుప్పించారు. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలోని రాష్ట్ర ప్రేరణా స్థల్‌లో మాజీ ప్రధాని వాజ్‌పేయి 101వ జయంతి సందర్భంగా 65 అడుగుల కాంస్య విగ్రహాన్ని మోదీ ఆవిష్కరించారు. ఇదే చోట శ్యామా ప్రసాద్ ముఖర్జీ, పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ విగ్రహాలను కూడా ప్రధాని ఆవిష్కరించారు. 98 వేల అడుగుల విస్తీర్ణంలో కమలం ఆకారంలో నిర్మించిన మ్యూజియాన్ని కూడా ప్రారంభించారు. వాజ్‌పేయి ప్రాతినిధ్యం వహించిన ఉత్తరప్రదేశ్ ప్రస్తుతం రక్షణ ఉత్పత్తుల తయారీలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచబోతుందన్నారు. గత ఎన్డీయే ప్రభుత్వాల సుపరిపాలనను మరింత ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, గవర్నర్ ఆనందిబెన్ పటేల్, సీఎం యోగి ఆదిత్యనాథ్ తదితరులు పాల్గొన్నారు.



వాజ్‌పేయీ విగ్రహం వద్ద రాజ్‌నాథ్, మోదీ

పాకిస్థాన్‌ను కట్నంగా ఇస్తే
నిన్ను పెళ్లాడేస్తా!

▸ ఆ దేశ మహిళతో వాజ్‌పేయీ హాస్యం

న్యూఢిల్లీ, డిసెంబరు 26: సునిశిత ప్రసంగాలకు, సున్నిత హాస్యానికి దివంగత ప్రధాని వాజ్‌పేయీ పెట్టింది పేరు. ఆయన చతురతను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గురువారం గుర్తు చేశారు. వాజ్‌పేయీ 101 జయంతి సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ.. 1999 ఫిబ్రవరిలో వాజ్‌పేయీ పాకిస్థాన్‌లోని లాహోర్‌కు వెళ్లినప్పుడు జరిగిన సంఘటన గురించి చెప్పారు. అక్కడ ఒక మహిళ వాజ్‌పేయీని ఉద్దేశించి 'నన్ను పెళ్లాడుతారా? అయితే కశ్మీర్‌ను బహుమతిగా ఇవ్వండి' అని అడిగింది. అందుకు ఆయన ఏ మాత్రం తడుముకోకుండా 'మొత్తం పాకిస్థాన్‌ను కట్నంగా ఇస్తే పెళ్లాడేస్తా' అని సమాధానం ఇచ్చారు. మరో సంఘటనను కూడా రాజ్‌నాథ్ సింగ్ ఉదహరించారు. ఇవి కేవలం హాస్యంగా అన్న మాటలు కావని, కశ్మీర్ పట్ల ఆయన దృక్పథానికి నిదర్శనాలని రాజ్‌నాథ్ వ్యాఖ్యానించారు.

వాజ్‌పేయికి ప్రముఖుల నివాళి

న్యూఢిల్లీ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వాజ్‌పేయి శత జయంతి సందర్భంగా గురువారం ఆయనకు ప్రముఖులు నివాళులర్పించారు. ఢిల్లీలోని వాజ్‌పేయి స్మృతి స్థలం 'సదైవ్ అటల్' వద్ద రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాని మోదీ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్‌నారాయణ్, కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, నిర్మలా సీతారామన్, బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నితిన్ నబీన్, ఢిల్లీ సీఎం రేఖాగుప్తా తదితరులు పుష్పాంజలి ఘటించి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ మాట్లాడుతూ తన దూరదృష్టితో దేశ గమనాన్ని తీర్చిదిద్దిన గొప్ప రాజనీతిజ్ఞుడు వాజ్‌పేయి అని పేర్కొన్నారు. ప్రజాసేవ, దేశసేవకు అంకితమైన వాజ్‌పేయి జీవితం ఎల్లప్పుడూ దేశ ప్రజలకు స్ఫూర్తినిస్తుందని ప్రధాని మోదీ అన్నారు.



టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి అన్నప్రసాదం స్వీకరిస్తున్న మోహన్ భాగవత్

తిరుమల చేరుకున్న ఆర్ఎస్ఎస్ చీఫ్

తిరుమల, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ శ్రీవారి దర్శనార్థం గురువారం సాయంత్రం తిరుమల చేరుకున్నారు. గాయత్రి అతిథి గృహం వద్ద ఆయనకు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి స్వాగతం పలికారు. అనంతరం మోహన్ భాగవత్ క్షేత్ర సంప్రదాయాన్ని అనుసరిస్తూ ముందుగా వరాహ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం వెంగమాంబ అన్నప్రసాద భవనానికి చేరుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకుని ఆయన తిరుపతిలో జరిగే భారతీయ విజ్ఞాన సమ్మేళనంలో పాల్గొంటారు.

నాలుగు దశాబ్దాల సేవకు గుర్తింపు

- కనకమేడలను సత్కరించిన ఏపీ ఎన్జీవో నేతలు



కనకమేడలను సత్కరిస్తున్న ఎన్జీవో నేతలు విద్యాసాగర్ తదితరులు

విజయవాడ (గాంధీనగర్) డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ మాజీ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్‌ను అదనపు సొలిసిటర్ జనరల్‌గా నియమించడంపై ఏపీ ఎన్జీవో సంఘం హర్షం వ్యక్తం చేసింది. నాలుగు దశాబ్దాల పాటు న్యాయవాదిగా అంకితభావంతో అయన చేసిన సేవకు గుర్తింపుగా ఈ పదవి లభించిందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ తెలిపారు. కనకమేడలను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించి, అభినందించారు. ఆయనకు పదవి లభించడం దక్షిణ భారతదేశానికి వన్నె తెచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ నియామకం దేశ ప్రతిష్ఠను మరింత ఇనుమడింప చేస్తుందని తెలిపారు. ఢిల్లీలో ఆయన సేవలు న్యాయవ్యవస్థకు ఎంతో ఉపయోగకరమని, రాష్ట్రానికి మరింత ఖ్యాతి తెచ్చేలా ఉంటుందనే భావన రాష్ట్రంలోని ఉద్యోగ సంఘాల, నాయకులు, ఉద్యోగుల్లో ఉందన్నారు.

శ్రీశైలంలో 200 కిలోల మాంసం పట్టివేత

- భారీగా మద్యం బాటిళ్లు స్వాధీనం
- టోల్‌గేట్ వద్ద అర్ధరాత్రి తనిఖీల్లో గుర్తింపు

శ్రీశైలం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): శక్తిపీఠం, జ్యోతిర్లింగ క్షేత్రంగా పేరొందిన ప్రముఖ శైవక్షేత్రం శ్రీశైలం సమీపంలో 200 కిలోల మాంసం, భారీగా మద్యం పట్టుబడింది. క్రిస్మస్ వేడుకల కోసం తరలిస్తుండగా బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత శ్రీశైలం టోల్‌గేట్ వద్ద భారీ మొత్తంలో మాం సం, మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ రామాంజినాయక్ వెల్లడించారు. శ్రీశైలానికి చెందిన రవి, విలియం, రాజు, సుబ్బయ్య కలిసి సున్నిపెంట నుంచి మూడు స్కూటీలు, ఒక బైక్‌పై క్షేత్రానికి 200 కిలోల కోడి మాంసంతో పాటు మద్యం బాటిళ్లను తీసుకుని శ్రీశైలానికి అతి సమీపంలోని టోల్‌గేట్ వద్దకు వచ్చారు. అక్కడ సెక్యూరిటీ సిబ్బంది కళ్లుగప్పి తప్పించుకుని వెళ్లేందుకు యత్నించారు. అనుమానం వచ్చిన సిబ్బంది వారిని అడ్డుకుని క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. మద్యం, మాంసాన్ని స్వాధీనం చేసుకున్న సీఎస్ఓ శ్రీనివాసరావు, నలుగురినీ పోలీసులకు అప్పగించారు. వన్యమృగాలు వచ్చే అవకాశం ఉండటంతో పోలీసుల సమక్షంలో సెక్యూరిటీ సిబ్బంది టోల్‌గేట్‌కు దూరంగా మాంసాన్ని పూడ్చిపెట్టారు. అదే విధంగా మద్యం బాటిళ్లను ధ్వంసం చేశారు. క్షేత్ర వైభవానికి, భక్తుల మనోభావాలకు భంగం కలిగించేలా ఎవరూ పాల్పడవద్దని డీఎస్పీ రామాంజినాయక్, సీఎస్ఓ శ్రీనివాసరావు కోరారు.

పది గజాల దారి లేక..

రెండేళ్లుగా నిరుపయోగంగా 'నూజివీడు' సబ్‌స్టేషన్

- కాసుల కక్కుర్తితో ట్రాన్స్‌కో నిర్వాకం
- సబ్‌స్టేషన్ల నిర్మాణంలో దోపిడీపర్వం
- దారిలేని ఆరు ఎకరాలు 2 కోట్లకు కొనుగోలు
- రూ. 34 కోట్లతో సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తి
- ఇన్ని రూ.కోట్లు పోసినా ఆపరేషన్‌లోకి తేలేని స్థితి
- నెల్లూరులో లెస్ టెండరు తిరస్కరణ
- మళ్లీ టెండరు పిలిచి రూ.6కోట్లకు ఎసరు
- రాజధానిలో తాళ్లాయపాలెం అప్‌గ్రేడేషన్‌కు వీలు
- కానీ, 300 కోట్లతో దానికి దగ్గర్లోనే మరో సబ్‌స్టేషన్

(అమరావతి, ఆంధ్రజ్యోతి)



దారి లేకపోవడంతో రెండేళ్లుగా నిరుపయోగంగా ఉన్న నూజివీడు వద్ద సబ్‌స్టేషన్

రాష్ట్రంలో ట్రాన్స్‌కో అధికారులు సబ్‌స్టేషన్ల నిర్మాణాన్ని కాసుల పంటగా మార్చుకుంటున్నారు. కమీషన్ల కోసం దారీతెన్నూ లేని సబ్ స్టేషన్లను నిర్మించడం.. తక్కువ ధరకు కోట్ చేసిన కాంట్రాక్టును రద్దు చేసి, కమీషన్లు ఇచ్చే కాంట్రాక్టర్ అధిక ధరకు కోట్ చేసినా టెండరు కట్టబెట్టడం వంటివి చేస్తున్నారు. వీరి నిర్వాకం వల్ల రూ.కోట్ల ప్రజాధనం నిరుపయోగంగా మారి, విద్యుత్తు ధరల రూపంలో తిరిగి ప్రజలకే భారంగా మారుతోంది. ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గం పరిధిలోని నూజివీడు మండలం దిగవల్లి గ్రామ సమీపంలోని రమణక్కపేటలో 132/33కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి 2020లో సుమారు ఆరు ఎకరాలను రూ.రెండు కోట్లు వెచ్చించి సేకరించారు. ఇక్కడ సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.37.94 కోట్లు కేటాయించారు. 2023 చివరికి సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని కూడా పూర్తి చేశారు. అయితే సబ్‌స్టేషన్‌కు వెళ్లేందుకు 10 గజాల స్థలాన్ని సేకరించడంలో అధికారుల ఉదాసీనత కారణంగా రెండేళ్లుగా అది నిరుపయోగంగా ఉండిపోయింది. సబ్‌స్టేషన్‌కు స్థలాన్ని సేకరించే సమయంలోనే దారి ఉందా లేదా అని చూసుకోవాల్సిన అధికారులు కమీషన్ల కక్కుర్తిలో పడి ఆ విషయమే వదిలేశారు. అప్పట్లో అధికార వైసీపీ నాయకుడు ఒత్తిడి వల్లే తక్కువ ధర పలికే పొలాన్ని అధిక ధర వెచ్చించి కొనుగోలు చేశారని, ఇప్పుడు దారి లేకపోవడంతో, ఆ పది గజాల కోసం భారీ మొత్తం ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని సమాచారం.

రూ.6 కోట్లకు 'టెండరు'

నెల్లూరు టౌన్‌లో రాజేంద్రనగర్ వద్ద 132/33కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ట్రాన్స్‌కో అధికారులు రూ.34.27 కోట్లతో 2023-24లో టెండరు పిలిచారు. ఈ టెండరును 4.7 శాతం తక్కువకు అంటే రూ.32.66 కోట్లకు ఓ సంస్థ దక్కించుకుంది. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత వివిధ కారణాలతో టెండరు రద్దు చేశారు. కొత్త ఎస్ఎస్ఆర్‌తో టెండరు అంచనా ధరలను ఆరు శాతం పెంచి, తిరిగి ఈ ఏడాది ప్రారంభంలో టెండరు పిలిచారు. అంటే, టెండరు ధర రూ.36.32 కోట్లకు పెరిగింది. దీన్ని మరో కాంట్రాక్టర్ 6.7 శాతం అధికానికి కోట్ చేశారు. దీంతో టెండరు ధర రూ.38.75 కోట్లకు చేరుతుంది. లెస్‌కు ఇచ్చిన దానికన్నా అధికంగా సుమారు రూ.ఆరు కోట్లకు టెండరు ధర పెరిగింది. అయితే చిత్రంగా ఈ టెండరును రూ.32.98 కోట్లకే అగ్రిమెంట్ చేసుకున్నారు. కొత్త ఎస్ఎస్ఆర్ ప్రకారం ధరలు పెరిగినా.. కాంట్రాక్టరు 6.7 శాతం అధికానికి కోట్ చేసినా ధర ఎందుకు తగ్గిందనేది ప్రశ్న..? ఇక్కడే ట్రాన్స్‌కో అధికారులు తమ తెలివితేటలు చూపారు. కొత్త ఎస్ఎస్ఆర్ ప్రకారం అంచనాలను పెంచినా, మెటీరియల్ క్వాంటిటీస్‌ను తగ్గించి చూపారు. పని జరుగుతూ ఉండగా, డీవియేషన్ స్టేట్‌మెంట్ పేరుతో మళ్లీ క్వాంటిటీస్ పెంచి యథాతథంగా పెంచిన ధరల ప్రకారం కాంట్రాక్టరుకు లబ్ధి చేకూరుస్తారు.

అప్‌గ్రేడ్ చేస్తే సరిపోయేదానికి రూ.300 కోట్లు వృథా

రాజధాని అమరావతిలోని తాళ్లాయపాలెం వద్ద 400/220కేవీ జీఐఎస్ సబ్‌స్టేషన్‌ను సుమారు 20 ఎకరాల్లో నిర్మించారు. ఈ సబ్‌స్టేషన్‌ను 33 కేవీకి అప్‌గ్రేడ్ చేసుకునే వెసులుబాటు ఉంది. కానీ అలా చేయకుండా లింగాయపాలెం వద్ద సుమారు రూ.300 కోట్లతో స్థల సేకరణ, సబ్‌స్టేషన్ నిర్మాణం చేపడుతున్నారు. చిత్రమేమిటంటే.. తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లాలో రాయదుర్గం 400కేవీ జీఐఎస్ సబ్‌స్టేషన్ కేవలం ఐదు ఎకరాల్లో ఉంది. ఇక్కడే 33 కేవీ అప్‌గ్రేడేషన్ చేశారు. అలాగే లింగాయపాలేనికి సమీపంలోనే ఉన్న తాడేపల్లి, ఉండవల్లి సబ్‌స్టేషన్లను అప్‌గ్రేడ్ చేసేందుకు టెండర్లు పిలిచారు. తాళ్లాయపాలేన్ని మాత్రం అప్‌గ్రేడ్ చేసుకునే వెసులుబాటు ఉ న్నా, దాని చెంతనే ఉన్న లింగాయపాలెంలో కోట్లాది రూపాయలతో మరో సబ్‌స్టేషన్ నిర్మాణం చేపడుతున్నారు.

నేటి నుంచి తిరుపతిలో భారతీయ విజ్ఞాన సమ్మేళనం

- ప్రారంభోత్సవ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ఏడో భారతీయ విజ్ఞాన సమ్మేళనం శుక్రవారం ప్రా రంభం కానుంది. నాలుగు రోజులపాటు జరిగే ఈ సమ్మేళనంలో దేశవ్యాప్తంగా 1500 మంది ప్రతినిధులు, 60 మంది వీసీలు, విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా 80 స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం పూర్తి చేసింది. శాస్త్ర, సాంకేతిక అధ్యయనానికి ఇంగ్లీషు మాత్రమే కాదు, భారతీయ భాషలు కూడా ఉపయోగపడగలవని ఈ సమ్మేళనం చాటి చెప్పనుంది. మన దేశ వారసత్వ సంపద ఘనతని చాటి చెప్పే లక్ష్యంతో ఈ సమ్మేళనం నిర్వహించనున్నారు. తొలిరోజు సమావేశంలో పాల్గొనేందుకు ఇప్పటికే ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ తిరుపతికి చేరుకున్నారు. ప్రారంభ సభకు అతిథిగా సీఎం చంద్రబాబు నాయుడు హాజరు కానున్నారు. ఉండవల్లి నివాసం నుం చి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరి తిరుపతిలోని ఎస్వీ వ్యవసాయ కళాశాలలోని హెలిప్యాడ్‌కు ముఖ్య మంత్రి చేరుకుంటారు. 10.05 గంటలకు భారతీయ విజ్ఞాన సమ్మేళనాన్ని ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 1.10 గంటలకు జిల్లా పోలీసు కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు.

తిరుమలకు 12,600 వాహనాలు!

- 24న రికార్డు స్థాయిలో కొండపైకి రాక



గురువారం అలిపిరి చెక్‌పాయింట్ వద్ద బారులు తీరిన ఆర్టీసీ బస్సులు, వాహనాలు

తిరుమల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): టీటీడీ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా బుధవారం రికార్డు స్థాయిలో వాహనాలు తిరుమల కొండెక్కాయి. వేకువజాము 3 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు 12,600 వాహనాలు కొండపైకి చేరుకున్నాయి. టీటీడీ చరిత్రలోనే ఈ సంఖ్య రికార్డు కావడం గమనార్హం. వీటిలో ఫోర్ వీలర్స్ 10,272, ద్విచక్ర వాహనాలు 995, ఆర్టీసీ బస్సులు వెయ్యి, టీటీడీ వాహనాలు 93, సిక్స్ వీలర్స్ 84, ప్రభుత్వ వాహనాలు 152 ఉన్నాయి. ఇక, గురువారం కూడా ఉదయం 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల సమయానికే 9వేల వాహనాలు తిరుమల చేరుకున్నాయి. ఉదయం 5 గంటల నుంచే అలిపిరి చెక్‌పాయింట్ వద్ద వాహనాలు భారీగా నిలిచిపోయాయి. వేగవంతంగా తనిఖీలు నిర్వహించి తిరుమలకు అనుమతించడంతో మధ్యాహ్నం 1గంట తర్వాత సాధారణ పరిస్థితి నెలకొంది. కొవిడ్ తర్వాత తిరుమలకు సొంత వాహనాలు, స్వగ్రామాల నుంచే ట్యాక్సీల ద్వారా వచ్చే భక్తుల సంఖ్య పెరిగింది. దీంతో రెండు మూడేళ్లుగా తిరుమలలోను.. అలిపిరి తనిఖీ కేంద్రం నిత్యం వాహనాల రద్దీ ఉంటోంది. అలిపిరి చెక్‌పాయింట్ నుంచి గరుడ సర్కిల్ వరకు అర కిలోమీటరుపైగానే వాహనాలు నిలిచిపోతున్నాయి. కాగా, తిరుమలలో గురువారం కూడా రద్దీ కొనసాగింది. సర్వదర్శనానికి 16 గంటల సమయం పడుతోంది.

శ్రీవాణి టికెట్ల కోసం తిరుమలలో భక్తుల నిరసన

అన్నమయ్య భవనం ముందు రోడ్డుపై బైఠాయింపు

- ముందుగానే టోకెన్లు ఎలా ఇస్తారంటూ నిలదీత
- రేపటి నుంచి మూడ్రోజుల పాటు ఆఫ్‌లైన్ కోటా రద్దు



అన్నమయ్య భవనం ముందు రోడ్డుపై బైఠాయించిన భక్తులు

తిరుమల, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శ్రీవాణి టికెట్ల కోసం గురువారం కొంతమంది భక్తులు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ప్రకటించిన సమయానికంటే ముందుగానే టికెట్లు ఎలా ఇస్తారంటూ అధికారులు, సిబ్బందిని నిలదీశారు. ప్రస్తుతం శ్రీవాణి ట్రస్టుకు విరాళమిచ్చే దాతలకు ఆన్‌లైన్ ద్వారా 500 టికెట్లు కేటాయిస్తున్నారు. ఇక కరెంట్ బుకింగ్ కోటాలో ఎయిర్ పోర్టులో 200, తిరుమలలోని అన్నమయ్య భవనం ముందున్న కౌంటర్ ద్వారా 800 టికెట్లు జారీ చేస్తున్నారు. వీరిని సాయంత్రం 4.30 గంటలకు దర్శనానికి అనుమతిస్తున్నారు. సాధారణంగా తిరుమలలోని కౌంటర్‌లో ఉదయం 6 గంటల నుంచి టికెట్లు జారీ చేస్తారు. రద్దీ పెరిగిన సమయంలో టైంతో పనిలేకుండా ముందస్తుగానే జారీ చేసి ఆ తర్వాత కౌంటర్‌ను మూసివేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి 9 గంటల నుంచే క్యూలైన్ వద్దకు భక్తులు చేరుకున్నారు. రద్దీ పెరుగుతుండటంతో, గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని గురువారం వేకువజామున 2 గంటలకు 800 మంది భక్తులను క్యూలోకి అనుమతించి 4 గంటల్లోపు టికెట్లు జారీ చేశారు. తెల్లవారుజామున 2 నుంచి 4 గంటల మధ్య టికెట్ల కోసం వచ్చిన భక్తులకు కోటా పూర్తయిందని చెప్పడంతో వారిలో కొందరు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి సమాచారం లేకుండా ముందస్తుగానే టికెట్లు ఎలా కేటాయిస్తారు, ఇప్పుడు తమ పరిస్థితి ఏంటంటూ అన్నమయ్య భవనం ముందున్న రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు, విజిలెన్స్ అధికారులు ఘటనా ప్రాంతానికి చేరుకుని భక్తులను నచ్చజెప్పి పంపారు. ఇక, రద్దీ అధికంగా ఉన్న క్రమంలో ఈ నెల 27, 28, 29వ తేదీలకు సంబంధించిన శ్రీవాణి టికెట్ల కరెంట్ బుకింగ్‌ను టీటీడీ రద్దు చేసింది.

త్వరలో ఐదు లక్షల మందితో బహిరంగ సభ: ఆర్.కృష్ణయ్య

విజయవాడ (గాంధీనగర్), డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా ఐదు లక్షల మంది బీసీలతో త్వరలో రాష్ట్రంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని బీజేపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్.మారేష్ అధ్యక్షతన బీసీ కుల సంఘాల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ దేశంలో అనేక సంస్కరణలు చేపట్టినా బీసీలకు న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మాది ఆకలి పోరాటం కాదని, ఆత్మగౌరవ పోరాటమన్నారు. చట్ట సభల్లో రిజర్వేషన్లు సాధించే ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా ఉధృతం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రధాని మోదీతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. సీఎం చంద్రబాబు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు. మారేష్ మాట్లాడుతూ బీసీల హక్కులపై కూటమిలోని బీసీ ప్రజాప్రతినిధులు స్పందించాలన్నారు. 139కి పైగా కుల సంఘాలు ఎదురుచూస్తున్న కులగణన తేదీని ప్రకటించాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు.



ఒక్కసారిగా దివ్యదర్శనం టోకెన్ల జారీ క్యూలోకి దూసుకొచ్చిన భక్తులు

దర్శన టోకెన్ల క్యూలో స్వల్ప తోపులాట!

లాఠీతో తట్టి ముందుకు పంపిన భద్రతా సిబ్బంది

- భక్తులపై లాఠీచార్జి జరగలేదు.. వదంతులు నమ్మొద్దు
- తప్పుడు సమాచారం ప్రచారం చేస్తే చర్యలు: ఎస్పీ

తిరుమల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి టైంస్లాట్ టోకెన్ల కోసం అలిపిరిలో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణునివాసంతో పాటు అలిపిరిలోని భూదేవి కాంప్లెక్స్‌లో స్లాటెడ్ సర్వదర్శనం (ఎస్ఎస్‌డీ) టోకెన్లను జారీ చేస్తారు. రద్దీని బట్టి 10 వేల నుంచి 20వేల టోకెన్లను మరుసటి రోజు దర్శనానికి జారీ చేస్తారు. క్రిస్మస్‌తో పాటు ఏడాది చివరి వారం కావడంతో బుధవారం నుంచి తిరుమలలో రద్దీ పెరిగింది. దీనిని దృష్టిలో పెట్టుకుని తిరుపతిలోని మూడు కౌంటర్లలో ఉద యం 10.50 నుంచి ఒంటి గంటలోపు 10వేల టోకెన్లు జారీ చేసి కౌంటర్లు మూసివేశారు. అప్పటికే భూదేవి కాంప్లెక్స్‌లోని క్యూలైన్ వద్దకు చేరుకున్న భక్తులు ఆందోళనకు గురయ్యారు. అదే సమయంలో పక్కనే శ్రీవారిమెట్టు మార్గంలో కాలినకడన వచ్చే భక్తులకు దివ్యదర్శనం(డీడీ) టోకెన్ల జారీ చేస్తున్న క్రమంలో అందరూ ఆ క్యూలోకి పరుగులు తీశారు. ఈ క్రమంలో స్వల్ప తోపులాట జరిగింది. కొంతమంది భక్తులు క్యూలైన్‌లోకి వెళుతూ కింద పడ్డారు. రద్దీని క్రమబద్ధీకరిస్తున్న కొంతమంది భద్రతా సిబ్బంది క్యూలైన్‌లోకి ప్రవేశించి భక్తుల మధ్య తోపులాటను అరికట్టేందుకు ప్రయత్నించారు. ఓ విజిలెన్స్ హోంగార్డు లాఠీతో ఫెన్సింగ్‌ను కొట్టడం, భక్తులను తట్టి ముందుకు పంపడం తీవ్ర విమర్శలకు దారి తీసింది.

భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నాం: టీటీడీ

భక్తులపై భద్రతా సిబ్బంది లాఠీచార్జి చేశారంటూ మీడియాలో ప్రచారం కావడంతో ఎస్పీ సుబ్బరాయుడు, టీటీడీ సీవీఎస్వో మురళీకృష్ణ ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. రోడ్లపై ఉన్న భక్తులకు నచ్చజెప్పి సర్వదర్శన క్యూలైన్ ద్వారా దర్శనం చేసుకోవచ్చని తిరుమలకు పంపారు. లాఠీచార్జి ప్రచారంపై టీటీడీ స్పందించింది. మరోవైపు లాఠీతో భక్తులను గట్టిగా తడుతూ ముందుకు పంపేందుకు ప్రయత్నించడంపై సిబ్బందిని ఉన్నతాధికారులు మందలించినట్టు తెలిసింది.

లాఠీచార్జి జరగలేదు: ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): తిరుపతి భూదేవి కాంప్లెక్సులో భక్తులపై పోలీసులు లాఠీచార్జి చేశారని సోషల్ మీడియాల్లో వైరల్ కావడం అవాస్తవమని ఎస్పీ సుబ్బరాయుడు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులను భయాందోళనకు గురి చేసే ఉద్దేశంతో కొందరు తప్పుడు వీడియోలు, తప్పుడు కథనాలు ప్రసారం చేయడం బాధ్యతారాహిత్యమని తెలిపారు. ఎటువంటి తోపులాట కానీ, లాఠీచార్జి కానీ జరగలేదని స్పష్టం చేశారు. లాఠీచార్జి అంటూ తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నవారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఇదేమి న్యాయం?

కుల్దీప్‌సింగ్ సెంగార్ అనే 'ఉన్నావ్' ఉన్మాదిని ఢిల్లీ హైకోర్టు వదిలేసినందుకు దేశం ఆగ్రహిస్తోంది. ఉత్తర్‌ప్రదేశ్‌లో ఎనిమిదేళ్ళ క్రితం జరిగిన అత్యాచార ఘటనలో శిక్షపడిన ఈ బీజేపీ మాజీ ఎమ్మెల్యే–ఏవో కొన్ని నిర్వచనాలు, సాంకేతిక కారణాలు అడ్డుపెట్టుకొని–శిక్ష నుంచి సులువుగా తప్పించుకోవడం సమాజానికి ఆశ్చర్యం కలిగిస్తోంది. సమస్త వ్యవస్థల సమర్థతనీ, మానవత్వాన్నీ, న్యాయాన్నీ పరీక్షించిన కేసు ఇది. సర్వోన్నత న్యాయస్థానం రంగంలోకి దిగితే తప్ప దర్యాప్తులు, విచారణలు వేగం పుంజుకోని, కొలిక్కిరాని కేసు ఇప్పుడు ఏకంగా కొట్టుకుపోవడం విషాదం. ఢిల్లీ హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో కొందరు న్యాయవాదులు కేసు వేయడంతోపాటు, సీబీఐ కూడా ఆ దిశగా అడుగులు వేస్తూండటం ఉపశమనం కలిగించే పరిణామాలు.

బాధితురాలు మళ్ళీ న్యాయం కోసం పోరాడవలసి వస్తోంది. తనపై అత్యాచారం చేసిన వ్యక్తిని కోర్టు అర్థంతరంగా వదిలేసినందుకు నిరసనకు దిగిన బాధితురాలిని, ఆమె తల్లిని పారామిలటరీ బలగాలు ఈడ్చిపారేశాయి. న్యాయం కోరుతున్నవారిపట్ల అన్యాయంగా, అమానవీయంగా వ్యవహరించాయి. ఉన్నావ్‌లో ఉండాల్సిన ఆమెకు దేశరాజధానిలో ఏమి పని అంటూ, ఆమె మళ్ళీ రాజకీయం చేస్తున్నదన్న అర్థంలో బీజేపీ నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు. సోనియా, రాహుల్‌ని కలిసినంత మాత్రాన ఇన్ని దీర్ఘాలు తీయనక్కరలేదు. ప్రధానినీ, హోంమంత్రినీ కలుసుకొని తన గోడుచెప్పుకోవాలన్న ఆమె అభీష్టం నెరవేర్చడానికి బీజేపీ నాయకులు సహకరిస్తే ప్రజలు మరీ సంతోషిస్తారు. కుల్దీప్‌సింగ్ సెంగార్ జైలు నుంచి బయటకు వస్తే తన చావు ఖాయమన్న ఆమె భయం సరైనది. అప్పట్లో బీజేపీ ఎమ్మెల్యేగా ఉన్న కుల్దీప్‌సింగ్ అప్పటికి మైనర్ అయిన ఈ బాధితురాలిని ఎత్తుకుపోయి, నిర్బంధించి అనేక రోజులు పాటు అత్యాచారానికి పాల్పడటమే కాదు, ఆమెను అమ్మే ప్రయత్నమూ చేశాడు. సెంగార్, ఆయన మనుషుల చేతికి చిక్కుతూ, తప్పించుకుంటూ, మరోపక్క పోలీసు రక్షణ కోసం చేసిన ప్రయత్నాలు ఫలించక ఆమె నిత్యం నరకం అనుభవించింది. స్థానిక పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదుకు నిరాకరించి, మహాశక్తిమంతుడైన సెంగార్‌తో రాజీపడమనేవారు. ఒక బలమైన నాయకుడిపై అలుపెరగని పోరాటం చేస్తున్నందుకు ఈ బలహీనురాలు కన్నతండ్రినీ కోల్పోయింది. రెండు దశాబ్దాల నాటి అక్రమ ఆయుధాల కేసును తవ్వితీసి పోలీసులు అతడిని స్టేషన్‌కు తెచ్చి, సెంగార్ ముఠాతో కలసి చావగొట్టారు. తండ్రిని రక్షించుకోవడం కోసం ఈమె ముఖ్యమంత్రి కార్యాలయం ముందు ఆత్మాహుతికి సిద్ధపడిన మర్నాడే అతను పోలీసు దెబ్బలతో మరణించాడు. దేశం యావత్తూ అట్టుడికిపోవడంతో బీజేపీ ఎట్టకేలకు అతడిని సస్పెండ్‌చేసింది. వేలాదిమంది మద్దతుదారులు, ఠాకూర్ నేతల సమక్షంలో సెంగార్ అరెస్టు సైతం ఎంతో ఆర్భాటంగా గౌరవంగా జరిగింది. జైల్లో పడ్డాక కూడా అతడు తన వేట ఆపలేదు. 2019 జూలైలో ఆమె ప్రయాణిస్తున్న కారును లారీ ఢీకొట్టింది. కేసులో ప్రధానసాక్షి అయిన ఆమె అత్తతో పాటు మరో సమీప బంధువు మరణించారు. న్యాయవాదికి తీవ్రగాయాలైనాయి. చావుబతుకుల మధ్య ఉన్న బాధితురాలు ఢిల్లీ ఎయిమ్స్‌లో అనేక నెలలు చికిత్స తీసుకుంది. ఈ ఘటనకు ముందే సెంగార్ మనుషుల నుంచి తన ప్రాణాలకు ముప్పు ఉన్నదని ఆమె లేఖ రాసినా, అది తనకు చేరనందుకు అప్పటి సుప్రీంకోర్టు చీఫ్‌జస్టిస్ రంజన్‌గొగోయ్ తెగ ఆశ్చర్యపోయారు. సెంగార్‌పై నమోదైన అత్యాచారం, హత్యాయత్నం ఇత్యాది కేసులన్నీ సుప్రీంకోర్టు చొరవతో ఆ తరువాత ఢిల్లీకి తరలినప్పటికీ, సీబీఐ అనంతరకాలంలో వెనకడుగువేసి హత్యారోపణను ఉపసంహరించుకుంది. పోలీసులు, సీబీఐ సక్రమంగా వ్యవహరించనందుకు తప్పుబడుతూనే ట్రయల్ కోర్టు సెంగార్‌కు జీవితఖైదు విధించింది. చావును జయించి బాధితురాలు అతికష్టంమీద సాధించిన ఆ న్యాయాన్ని ఇప్పుడు ఢిల్లీ హైకోర్టు లాగేసుకుంది. ఎమ్మెల్యే ప్రభుత్వాధికారి కాదు, కనుక పోక్సో చట్టంలో సెక్షన్ 5 వర్తించదన్న కారణంతో అతడి జీవిత ఖైదును సస్పెండ్ చేసింది. సమస్త వ్యవస్థలూ కలసికట్టుగా తొక్కిపెట్టినా, ఎదురొడ్డి పోరాడిన ఆమెను బలహీనపడకుండా కాపాడాల్సిన బాధ్యత సుప్రీంకోర్టు మీద ఉంది.


ఇది సకాలపు సబబేనా!?



■ రాహుల్ కుమార్

జిలుగువెలుగుల భారత్ గురించి మనం వినని రోజంటూ ఉండదు. ఉరుకులు పరుగులు తీస్తున్న మన ఆర్థిక వ్యవస్థ గురించీ, క్రమం తప్పకుండా ఐదేళ్లకొకసారి శాంతియుతంగా ప్రభుత్వాలను మార్చుకుంటున్న మన ప్రజాస్వామ్యం ఘనత గురించీ ఇంటా బయటా చాలా ప్రశంసలూ వినపడతాయి. ప్రశంసలన్నిటినీ వొట్టి ప్రచారాలుగా, అతిశయోక్తులుగా కొట్టేయటం తేలిక! విశ్లేషించటమే కష్టం! వాస్తవాలనూ ప్రశంసలనూ తక్కెడలో పెట్టి ఒకదానికొకటి సరిగ్గా తూగుతున్నాయా? లేదా? అని బేరీజు వేసుకుంటే దిద్దుబాట్ల అవసరాలు కనపడతాయి. వాటికి సంసిద్ధతను వ్యక్తంచేయటమే ఇప్పుడున్న పరిస్థితుల్లో చాలా సాహసంతో కూడిన పని! ఆరోగ్యకరమైన, నిర్మాణాత్మక విమర్శలు చేయటానికి ప్రజాస్వామ్యాల్లో కూడా ఏటికి ఎదురీదాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. భావప్రకటనా స్వేచ్ఛకు తిరుగులేదన్న దేశంగా పేరొందిన అమెరికాలో కూడా దానికి వ్యతిరేక వాతావరణం విజృంభిస్తోంది. వ్యక్తుల సామాజిక మాధ్యమాల ఖాతాలను జల్లెడపట్టి ప్రభుత్వ వ్యతిరేక, అనుకూల భావాల వారీగా చిట్టాలను రూపొందిస్తున్నారు. అమెరికా విధానాలను ఎప్పుడో ఒకప్పుడు విమర్శించినవారూ, ఇప్పటికీ వాటితో ఏకీభావం లేనివారూ సైతం తగిన జాగ్రత్తలు తీసుకోవటంలో తలకిందులై పోతున్నారు!

అక్కడ సంగతి సరే.. మరిక్కడ సంగతేంటని ప్రశ్నించుకుంటే సంతృప్తికరమైన జవాబు లభించదు. రాజకీయాలనూ, ఆర్థిక విషయాలనూ నిర్మొహమాటంగా చర్చించటం అరుదైపోతోంది. రాజకీయంగా మావైపో, ఆవలివైపో అన్న ధోరణే ప్రబలిపోతోంది. దీనికి భిన్నంగా సమస్యలను సామాజిక, ఆర్థిక, న్యాయ దృష్టితో అంచనా వేయటం, మెరుగైన ముందడుగులు సూచించటం ఎవరైనా చేస్తే సకాలపు సబబుగా భావించాల్సి వస్తోంది. రాజకీయ, ఆర్థిక విశ్లేషణలో ఇప్పటికే గణనీయంగా కృషిచేసిన ఇద్దరు అధ్యాపకులు అతుల్ కోహ్లీ, కాంతా మురళి 'డెమొక్రసీ అండ్ ఇనీక్వాలిటీ ఇన్ ఇండియా' అన్న తమ తాజా రచనతో ఆ పనిని సమర్థంగా చేశారు. స్వాతంత్ర్యం సాధించిన నాటి నుంచి ఇప్పటివరకూ భారత్ చాలా కష్టతరమైన ప్రయాణాన్నే చేసింది. సాధించిన గణనీయ విజయాలూ ఉన్నాయి. గట్టిగా ఆశించినా చేరుకోలేని గమ్యాలూ ఉన్నాయి. మతతత్వంతో మొదటికే మోసంవస్తోన్న ప్రమాదాలూ నెలకొంటున్నాయి. వీటి వెనకున్న రాజకీయాలనూ, వాటితో ప్రభావితమవుతోన్న ఆర్థికరంగాన్నీ మనం లోతుగా అర్థం చేసుకోవటమే అసలు సమస్య.



మన అభివృద్ధి నమూనా ఎక్కువ పెట్టుబడులను కోరుతుంది. తక్కువ శ్రామికులను ఇముడ్చుకుంటుంది. 1000 కోట్ల పెట్టుబడితో 1000 ప్రత్యక్ష ఉద్యోగాలు కల్పించలేని ఉదాహరణలను ఎన్నైనా చెప్పుకోవచ్చు. రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ కంపెనీలతో కుదుర్చుకునే అవగాహనా ఒప్పందాలను పరిశీలిస్తే దీన్ని తేలికగానే గ్రహించొచ్చు.

దేన్నైనా ఏ దృక్పథంతో అర్థంచేసుకోవాలన్నది ఎప్పుడూ చిక్కుసమస్యగానే ఉంటుంది. మతదృక్పథంతో ప్రపంచాన్ని చూడటం ఒకరకంగా తేలికైన పని! కష్టాలకూ, నష్టాలకూ, అర్థాలకూ, అనర్థాలకూ, అసమానతలకూ, అదృష్టాలకూ, దురదృష్టాలకూ, అధోగతులకూ, పురోగతులకూ.. ఒక సకలాతీతశక్తినే కారణంగా భావిస్తే, అన్నిటిలోనూ యథాతథస్థితిని ఆమోదిస్తూ కాలాన్ని వెళ్లదీయొచ్చు. కానీ కాలమే మనిషిని ఆ తరహా ఆలోచనల్లో నిలువనీయటం లేదు. పాలనలో ప్రజలకు భాగస్వామ్యం కల్పించే ప్రజాస్వామ్య రాజకీయాలు, ఆర్థిక అసమానతలను ఒక పరిమితిలో ఉంచాలనే ఆధునిక దృక్పథాలు బలపడుతోన్న ప్రపంచంలో.. ఎక్కడి పరిస్థితులనైనా వాటికి అనుగుణంగానే విశ్లేషించాలన్న వివేచనే పదునుతేలుతోంది.

ప్రజల ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచటానికి తోడ్పడాల్సిన రాజకీయాల్లో కుల, మత అస్తిత్వాల ప్రాధాన్యం పెరగటం, ఆర్థిక అసమానతలు ఏ దేశంలో లేనంతగా పెట్రేగటం భారత్‌కు పెనుసవాళ్లుగా మారాయి. ఆర్థిక ప్రగతికి ప్రభుత్వ విధానాలు దోహదం చేసి.. పరిశ్రమలు, సంస్థల ఏర్పాటులో ప్రభుత్వం క్రియాశీలకపాత్ర పోషించి.. అవసరమైన చోట స్వయంగా స్థాపించి.. అభివృద్ధిఫలాలు అన్ని వర్గాలకూ హేతుబద్ధంగా అందేలా కృషిచేయాలన్న లక్ష్యం 1980ల వరకూ దేశంలో ఎంతోకొంత ఉండేది. ఆ తర్వాత నుంచీ ప్రభుత్వాలు క్రమేపీ ఆ పాత్ర నుంచి తప్పుకొని ఆర్థికాభివృద్ధిని సాధించే లక్ష్యం ప్రైవేటు పరిశ్రమాధిపతులదిగా, వ్యాపారవేత్తలదిగా మాత్రమే భావించటంతో కీలకమార్పులు రావటం మొదలయ్యాయి. పరిశ్రమలకు కావాల్సిన సౌకర్యాలను కల్పించటం, వాటికి వనరులను కేటాయించటం, పన్నురాయితీలు ఇవ్వటం, వాటిల్లో పెట్టుబడులకు ఆహ్వానాలు పలకటం.. ప్రభుత్వాలకు ఏకైక ప్రాధాన్యంగా మారింది. దాని ఫలితంగా ఆర్థికాభివృద్ధి పెరిగింది. అందులో సందేహం లేదు. పెరిగిన సంపదకు అనుగుణంగా ఆదాయ పంపిణీలో న్యాయమూ జరిగి ఉంటే మన రాజకీయాలు కుల, మతతత్వాలకు దూరంగా ఉండేవి. ఆర్థికాభివృద్ధి సాధనను ప్రధానంగా పరిశ్రమాధిపతులకూ, వ్యాపారవేత్తలకూ వదిలివేస్తూ వారికి అన్ని విధాలుగా అండదండలు అందించటంతో పాటు వారు సమకూర్చే నిధులతో.. విరాళాలతో మాత్రమే పార్టీలను నడిపే పరిస్థితి రావటంతో రాజకీయ రంగంలో ప్రజలను సమీకరించే పద్ధతులే మారిపోయాయి. ఆర్థిక అంశాల ఆధారంగా ప్రజలను ఆకర్షించలేని నిస్సహాయస్థితిలోకి పార్టీలు పడిపోయాయి. అన్నింటా పైవర్గాలపై ఆధారపడిన పార్టీలకు కింది, మధ్యతరగతి వర్గాల ఓట్లను వదులుకునే పరిస్థితి మాత్రం లేదు. సోషలిజం, సంక్షేమరాజ్య భావనలను 1980ల నుంచి అన్ని పార్టీలూ వదులుకున్నాయి. నినాదప్రాయంగా అప్పుడప్పుడూ వాడినా విధానాల్లో, ఆచరణలో వాటిని పూర్తిగా పక్కనపెట్టారు. 1980లో ఇందిరాగాంధీ రెండోసారి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మొదలైన సంపూర్ణ వ్యాపారానుకూల విధానాలను 1991లో విపరీతంగా సరళీకృతం చేశారు. వీటి అమల్లో పార్టీల పరంగా తేడాలు లేకపోయినా ఎన్నికల ద్వారానే అధికారంలోకి రావాలి కాబట్టి జనసమీకరణకు కొన్ని పార్టీలు కులంవైపు మొగ్గితే, బీజేపీ పూర్తిగా మతంవైపు మొగ్గింది. మండల్–మసీదు రాజకీయాలకు పూర్వరంగం అట్లా ఏర్పడిందే! కాంగ్రెస్ మాత్రం ఎటువైపూ నిర్దిష్టంగా దూకలేని అశక్తతతో అవకాశవాదంతో వ్యవహరించింది. ఇందిరాగాంధీ నాయకత్వంలో వ్యక్తిపూజ పెరిగి, వ్యవస్థాపరంగా కాంగ్రెస్ క్షీణించటంతో సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యాన్ని కోల్పోయింది. కుల అస్తిత్వాల ఆధారంగా వచ్చిన పార్టీలు కొన్నిచోట్ల అధికారాన్ని సాధించినా స్థిరత్వంతో కూడిన రాజకీయాలను నడపటంలో విఫలమయ్యాయి. ప్రాంతీయ అస్తిత్వాలపై ఆధారపడిన పార్టీలు మాత్రమే కొంత ఉనికిని కాపాడుకుంటున్నాయి. ఇక హిందూ ఆధిక్యత, ముస్లిం వ్యతిరేకత రాజకీయాల్లో ప్రధానంగా మారిపోయాయి. ఈ ధోరణికి వ్యతిరేకమైన గళాలన్నీ తీవ్రమైన అస్తిత్వ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. రాజకీయ రంగాన వ్యక్తిపూజను సహజంగా పరిగణించటం మామూలైపోతోంది. అధికార కేంద్రీకరణ పెరిగి, రాజ్యాంగ వ్యవస్థల మధ్య సమతుల్యత బలహీనపడుతోంది. పౌరసమాజం, న్యాయవ్యవస్థ, ప్రసారమాధ్యమాలు కూడా ఒడిదుడుకులకూ, ఒత్తిళ్లకూ లోనవుతున్నాయి. గతంలో కొనసాగిన సుల్తానుల, పాదుషాల పాలనంతా బానిసత్వానికి చిహ్నంగానూ, క్రూరత్వానికి ప్రతీకగానూ పరిగణించే ప్రచారం ఊపందుకుని అదే నిజమైన చరిత్ర అన్నట్లుగా ప్రజలు నమ్మేపరిస్థితి వచ్చేసింది.

> **పెరిగిన సంపదకు అనుగుణంగా ఆదాయ పంపిణీలో న్యాయమూ జరిగి ఉంటే మన రాజకీయాలు కుల, మతతత్వాలకు దూరంగా ఉండేవి. ఆర్థికాభివృద్ధి సాధనను ప్రధానంగా పరిశ్రమాధిపతులకూ, వ్యాపారవేత్తలకూ వదిలివేస్తూ వారికి అన్నివిధాలుగా అండదండలు అందించటంతో పాటు వారు సమకూర్చే నిధులతో.. విరాళాలతో మాత్రమే పార్టీలను నడిపే పరిస్థితి రావటంతో రాజకీయ రంగంలో ప్రజలను సమీకరించే పద్ధతులే మారిపోయాయి.**

సంపద, ఆదాయ అసమానతలు విపరీతంగా పెరిగిపోతున్న నేపథ్యంలో అసంతృప్తులు, అభద్రతలు ఎక్కువగానే ఉంటాయి. స్థూలంగా చూస్తే ఆర్థికాభివృద్ధి బాగానే కనపడుతుంది. స్థూలదేశీయోత్పత్తి (జీడీపీ) అంకెలు కూడా ఆశాజనకంగానే ఉంటాయి. బిలియనీర్ల సంఖ్యలోనూ ఏటేటా మంచి ఎదుగుదలే నమోదవుతోంది. కానీ మన ఆర్థికాభివృద్ధికి ఎక్కువ ఉద్యోగకల్పనకు దారితీయని తత్వమే ఎక్కువ. అధిక జనాభా ఉన్న దేశంలో ఇదెన్నో సమస్యలకు కారణమవుతుంది. మన అభివృద్ధి నమూనా ఎక్కువ పెట్టుబడులను కోరుతుంది. తక్కువ శ్రామికులను ఇముడ్చుకుంటుంది. 1000 కోట్ల పెట్టుబడితో 1000 ప్రత్యక్ష ఉద్యోగాలు కల్పించలేని ఉదాహరణలను ఎన్నైనా చెప్పుకోవచ్చు. రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ కంపెనీలతో కుదుర్చుకునే అవగాహనా ఒప్పందాలను పరిశీలిస్తే దీన్ని తేలికగానే గ్రహించొచ్చు. చైనా, దక్షిణకొరియా, తైవాన్, హాంగ్‌కాంగ్, సింగపూర్‌ల్లో ఒకప్పుడు సాధించిన అభివృద్ధి దీనికి భిన్నం. అవన్నీ అభివృద్ధి పథంలో దూసుకుపోయే క్రమంలో ఎక్కువ మందికి ఉపాధిని కల్పించే అభివృద్ధి నమూనాను ఎంచుకున్నాయి. ఉద్యోగాలను ఎక్కువగా కల్పించలేని అభివృద్ధే ఒక తీవ్ర సమస్య అయితే.. దానికి తోడు ఆదాయ, సంపదల్లో నెలకొంటున్న అసాధారణ అసమానతలు.. విద్వేష భావజాలాలకు ప్రజలను తేలికగా ఆకర్షితులయ్యేలా చేస్తున్నాయి. నిజానికి విద్వేష భావజాలాలు వ్యాపారాభివృద్ధికి విఘాతంగా ఉంటాయి. కానీ వాటిని వ్యతిరేకించలేని స్థితిలోనే వ్యాపార, పారిశ్రామిక వర్గం ఉందనీ, పన్నుల్లో రాయితీలు, వనరుల కేటాయింపు పరంగా ప్రభుత్వాలు అందిస్తోన్న అండదండల వల్ల.. తమ ఆస్తుల పరిరక్షణ, లాభాలు సజావుగా కొనసాగుతూ ఉండటం వల్ల.. ఆ భావజాలాలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నట్లుగా వ్యవహరిస్తోందన్న వ్యాఖ్యలే ఎక్కువ వినపడుతున్నాయి.

ఆర్థికాభివృద్ధి పుంజుకుంటున్న దశలో అసమానతలు సహజమన్న వాదనను ప్రభుత్వం కూడా బలంగా విశ్వసించటం వల్ల దాన్ని ఒక సమస్యగా పరిగణించటం లేదు. అందుకే అధికారిక నివేదికల్లో వాటికి స్థానం దక్కటంలేదు. గణాంకాలను పైపైన చూసినా పరిస్థితిలో తీవ్రత అర్థమవుతుంది. ఆదాయ, సంపదల్లో ఎగువ 1శాతం జనాభా వాటా ఇటీవల 42.5శాతానికి పెరిగింది. 10శాతం ఎగువ జనాభా వాటాని లెక్కవేస్తే అది 74.3శాతానికి ఎదిగింది. ఇక 40శాతం మధ్యతరగతి వాటా సంపదలో 22.9శాతానికి దిగజారింది. కిందనున్న 50శాతానికి దక్కింది 2.8శాతమే. ఆదాయంలో కూడా ఈ వర్గాలను వరుసగా (21.7శాతం, 56.1శాతం, 29.7శాతం, 14.7శాతం) చూస్తే కనపడేది అదే చిత్రం. దీనికి తోడు ఆర్థికాభివృద్ధిలో కూడా అనుకున్నంత వేగం కనపడటం లేదు. 2014–2023 మధ్య అది 5.8శాతానికే పరిమితమైంది. 1991–2013 కాలం (6.6శాతం)తో పోల్చితే అది తక్కువ. మరి దారిద్ర్యం తగ్గలేదా? అంటే గణనీయంగా తగ్గింది. రోజుకు 1.90 డాలర్లతో జీవితాన్ని గడిపే ప్రజలు 1980లో 60శాతం ఉంటే 2011 నాటికి అది 20శాతానికి తగ్గింది. కానీ నెలకు 100 డాలర్ల ఆదాయం (దాదాపు రూ.9000) ఉన్న వారందరూ దారిద్ర్యరేఖకు దిగువనున్నారని భావిస్తే వారి సంఖ్య 2011లో సైతం 60శాతం ఉంటుంది.

నిశిత సామాజిక పరిశీలనలో కొన్ని కఠోర వాస్తవాలు కనపడతాయి. దేశ బహుళత్వ సాంస్కృతిక వారసత్వాన్ని బలహీనంగా భావించటం.. మైనారిటీల్లో అభద్రత నెలకొనటం.. కుల, మతభావాల ఆధారంగా ప్రజలను సమీకరించటం.. విపరీత అధికార కేంద్రీకరణ, రాజ్యాంగ వ్యవస్థల మధ్య సమతుల్యత లోపించటం.. విజృంభిస్తున్న అసమానతలు.. తక్షణం ఎదుర్కోవాల్సిన సవాళ్లుగా ఆ వాస్తవాలు మనముందు నిలుస్తున్నాయి. రాజకీయాల్లో మార్పులతో తలెత్తిన ఈ సవాళ్లకు పరిష్కారాలు కూడా రాజకీయాల రాపిడి నుంచే రావాలి!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

ఇన్సూరెన్స్ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను 74శాతం నుంచి 100శాతానికి పెంచడాన్ని దేశీయ కంపెనీలు గానీ, ప్రజానీకం గానీ కోరుకోలేదు. కేవలం విదేశీ పెట్టుబడికి తలొగ్గి కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నది.

ఏమైంది ఆ స్వదేశీ నినాదం?

పంద్రాగస్టు సాక్షిగా ప్రధానమంత్రి ఇచ్చిన స్వదేశీ నినాదాన్ని బేఖాతరు చేస్తూ, భారత ఆర్థిక వ్యవస్థపై ఆధిపత్యం చెలాయించుకొమ్మంటూ విదేశాలకు పార్లమెంట్ ఆహ్వానాన్ని పలికింది. అందుకేనేమో విదేశీ కంపెనీలు భారత్‌లో ఇన్సూరెన్స్ వ్యాపారం చేసుకోవచ్చనే చట్టం తయారవుతున్న సందర్భంలో ప్రధానమంత్రి విదేశీ యాత్రలో ఉన్నారు.

ఇన్సూరెన్స్ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను 74శాతం నుంచి 100శాతానికి పెంచడం వల్ల విదేశీ కంపెనీలకు పెద్ద మొత్తంలో అవకాశం (యాక్సెస్) లభిస్తుంది తప్ప, దేశీయ ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఎలాంటి లాభమూ ఉండదు. ఇప్పుడున్న 74శాతం ఎఫ్‌డీఐ పరిమితిని ఏ ఒక్క ప్రైవేట్ కంపెనీ పూర్తిగా వినియోగించుకోలేదు. విదేశీ భాగస్వాములు కూడా తమకు లభించిన అనుమతి ప్రకారం ఇండియా భాగస్వామితో ప్రారంభించిన కంపెనీలో 74శాతం విదేశీ పెట్టుబడిని తీసుకురాలేదు. 25 ప్రైవేట్ కంపెనీలలో కలిపి ఇప్పటి వరకు సగటున కేవలం 32.6శాతం మాత్రమే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఉన్నాయి. ఇప్పుడు ఈ ఎఫ్‌డీఐల పరిమితి 100శాతానికి పెంచడం ద్వారా మూడు ప్రమాదాలు పొంచి ఉన్నాయి: 1) విదేశీ కంపెనీలకు స్వదేశీ కంపెనీలు తమ వాటా మొత్తాన్ని అమ్ముకొని దూరమైపోవచ్చు. 2) సంపూర్ణంగా విదేశీ పెట్టుబడితో ఏర్పడబోయే కొత్త ప్రైవేట్ కంపెనీలతో భారత ఇన్సూరెన్స్ మార్కెట్‌లో విదేశీ కంపెనీల ప్రాబల్యం పెరుగుతుంది. 3) భారతదేశ ప్రజల పొదుపుపై విదేశీ కంపెనీల ఆధిపత్యం మరింత పెరుగుతుంది.



దేశీయ కంపెనీలు గానీ, లేదా ప్రజానీకం గానీ ఈ పెంపును కోరుకోలేదు. కేవలం విదేశీ పెట్టుబడికి తలొగ్గి కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నది. అంతర్జాతీయ పెట్టుబడి అజమాయిషీ మన దేశంపై ప్రబలంగా ఉందనడానికి ఇది ఇదర్శనం. ఈ ఎఫ్‌డీఐ పెంపు ద్వారా 'సబ్ కా బీమా' సాధించడమనే నినాదం అర్థరహితం. అందరికీ బీమా సౌకర్యాన్ని అందివ్వాలంటే ప్రజల చేతిలో కొనుగోలు శక్తి పెరగాలి తప్ప, విదేశీ కంపెనీలొచ్చి పాలసీలను అమ్మడానికి ప్రయత్నిస్తే జరగదు. పైగా పట్టణ వ్యాపారమంతా విదేశీ కంపెనీలకు ధారాదత్తమయ్యే ప్రమాదముంది. భారతదేశంలో ప్రారంభం కానున్న విదేశీ ఇన్సూరెన్స్ కంపెనీలను పూర్తిగా గ్రామీణ ప్రాంతాలలోనే పనిచేయవలసిందిగా ఆదేశిస్తే తప్ప గ్రామీణ ప్రాంతాల్లో ఇన్సూరెన్స్ విస్తరించే అవకాశమే లేదు.

ఇక పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెడుతున్నప్పుడు, విదేశీ కంపెనీలు తమ లాభాలను తమ దేశాలకు తరలించుకుపోకుండా చూస్తామని నిర్మలా సీతారామన్ అన్నారు. దీనిని రిపాట్రియేషన్ క్లాజ్ అంటారు. నిజానికి 2021 కన్నా ముందు, అనగా ఎఫ్‌డీఐల పరిమితి 49శాతం వరకే ఉన్నప్పటి వరకు, ఈ రీపాట్రియేషన్ క్లాజ్ వర్తించేది. 2021 తర్వాత దీనికి చరమగీతం పాడారు. ఇప్పుడున్న నిబంధనల ప్రకారం విదేశీ కంపెనీలు తాము తీసుకొచ్చిన పెట్టుబడి తరలించడానికి వీలు లేదు కానీ, ఆర్జించిన లాభాలను ఎప్పుడైనా తరలించుకుని పోయే వెసులుబాటు ఉన్నది. 'ప్రజలు దేన్నైనా నమ్ముతారు, వెరిఫై చేసుకోరు' అనే ఒక అంచనాతో పాలకులు ఇలాంటి ప్రకటనలు చేస్తుంటారు.

2000 సంవత్సరంలో... ప్రైవేట్ కంపెనీలకు భారత ఇన్సూరెన్స్ మార్కెట్‌లో అవకాశం కల్పిస్తూ నిర్ణయం తీసుకున్న సందర్భంలో, ఆ నిర్ణయాన్ని సమర్థిస్తూ పలు వాదనలు ముందుకువచ్చాయి. భారతదేశంలో ఇన్సూరెన్స్ విస్తరణ చాలా తక్కువగా ఉన్నదనీ, అందుచేత ప్రైవేట్ కంపెనీల ఆగమనంతో దానిని పెంచవచ్చుననీ కొందరు అన్నారు. కొత్త కంపెనీల ఆవిర్భావంతో ఎంతోమందికి ఉపాధి కల్పించవచ్చు అని కూడా అన్నారు. పోటీతత్వం పెరిగి పాలసీ ప్రీమియంల రేట్లు తగ్గి, అవి మరింతగా సామాన్యులకు అందుబాటులోకి వస్తాయన్నారు. కానీ పాతికేళ్ళ క్రితం 3.1శాతం ఉన్న ఇన్సూరెన్స్ విస్తరణ ఈనాటికీ అదేస్థాయిలో 3.5శాతం దగ్గర తచ్చాడుతున్నది. ఉపాధి కల్పన, పోటీతత్వం ద్వారా రేట్లు తగ్గడం అన్న వాదనలు ఏవీ నిజరూపం దాల్చలేదు. ఎందుకంటే ప్రైవేట్ కంపెనీలు ఏవీ పెద్ద ఎత్తున ఉపాధి కల్పించడానికి ముందుకు రాలేదు. మహా అయితే ఏజెంట్ల సంఖ్యలో కొంత పెరుగుదల ఉన్నది. కానీ ఎల్ఐసీ ఏకస్వామ్యమే కొనసాగినా ఇదే స్థాయిలో ఏజెంట్ల రిక్రూట్‌మెంట్ జరిగి ఉండేది. ప్రైవేట్ కంపెనీల్లో విదేశీ కంపెనీలు భాగస్వాములుగా 25 సంవత్సరాల నుంచి పని చేస్తున్నాయి. దఫదఫాలుగా 26శాతం నుంచి 2015లో 49శాతానికి, 2021లో 74శాతానికి ఎఫ్‌డీఐల పరిమితిని పెంచినప్పటికీ ఫలితాలు ఆశించినంతగా రాలేదు. ఏదేమైనా ఆగమేఘాల మీద దేశ ఆర్థిక వ్యవస్థకు పట్టుగొమ్మగా నిలిచే ఇన్సూరెన్స్ చట్ట సవరణను పూర్తిచేశారు. దీనివల్ల ప్రజల పొదుపులపై విదేశీ సంస్థల ప్రభావం ఎక్కువగా పడుతుంది. ప్రతి ఏటా రూ.10,00,000కోట్లకు పైబడి కొత్త ఇన్సూరెన్స్ వ్యాపారం జరుగుతున్నది. ఇది దాదాపు పది రాష్ట్రాల సంవత్సర బడ్జెట్‌తో సమానం! దేశీయ ఇన్సూరెన్స్ మార్కెట్‌ను పూర్తిగా విదేశీ కంపెనీలకు ధారాదత్తం చేసే ఈ చర్యతో తిరోగమన ఫలితాలకు నాంది పలికినట్లే.

● జి. తిరుపతయ్య

ఫీల్డ్‌మార్షల్ కరియప్ప చేసిన 'ముస్తాబు'

ఆంధ్రప్రదేశ్‌లోని పాఠశాలల్లో ప్రతి తరగతి గదిలోనూ ఒక 'ముస్తాబు కార్నర్' ఏర్పాటు చేయాలని, అక్కడ సబ్బు, దువ్వెన, తువ్వాలు వంటివన్నీ ఉంచాలని నిర్ణయించారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు– సంతోషం. ఈ వార్త చూడగానే నాకు ఆరు దశాబ్దాల నాటి స్మృతులు గుర్తుకొచ్చాయి.

మినూమసానీ ప్రజాస్వామ్య శిక్షణ సంస్థను స్థాపించారు. జేఆర్‌డీ టాటా, నానీ పాల్కీవాలా, మెహతా వంటివారు సభ్యులు. ఆ శిక్షణ శిబిరాలను గుంటూరులో కూడా నిర్వహించాం. ఒక శిబిరం ప్రారంభోత్సవం జనరల్ కరియప్ప చేతుల మీదుగా జరిగింది. విజయవాడ విమానాశ్రయంలో వారిని స్వాగతించి, గుంటూరు తీసుకొచ్చే పనిని నాకు పురమాయించారు. స్వతంత్ర భారత సైనికదళాల ప్రప్రథమ భారతీయ ప్రధానాధికారిగా 1949 జనవరి 15న ఆయన పగ్గాలు చేపట్టిన రోజును ప్రతి ఏటా 'ఆర్మీడే'గా నిర్వహిస్తున్నారు. రిటైరయినాక ఆయన ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లలో భారత రాయబారిగా విధులు నిర్వహించారు. పెక్కు దేశాలకు సైనిక దళాల పునర్వ్యవస్థీకరణలో సలహాలిచ్చారు. అమెరికా అధ్యక్షుడు ట్రూమన్ చేతుల మీదుగా 'Legion of Merit' అవార్డు అందుకున్నారు. 1965లో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో కరియప్ప కుమారుడు కాల్పులకు గురై పాకిస్థాన్ సైనికులకు చిక్కాడు. ఈ వార్త పాక్ రేడియో ప్రసారం చేసింది. ఇది విన్న పాకిస్థాన్ అధ్యక్షుడు అయూబ్ ఖాన్, విశ్రాంత జీవనం గడుపుతున్న జనరల్ కరియప్పకు ఫోన్ చేసి జూనియర్ కరియప్పను విడుదల చేస్తానని చెబుతాడు. "అతడు నా బిడ్డ కాదు, భరతమాత ముద్దుబిడ్డ. మాతృభూమి పరిరక్షణకు పోరాడుతున్న దేశభక్తుడు. నీవు చూపిన ఔదార్యానికి నా కృతజ్ఞతలు. విడుదల చేస్తే యుద్ధ ఖైదీలుగా ఉన్న వారందరినీ విడుదల చెయ్యి. అంతేగానీ నా పిల్లవాడని ఒక్కడినే విడుదల చెయ్యవద్దు" అని వారించాడు. ఆ విధంగా, దేశ విభజన జరగక ముందు తనవద్ద జూనియర్ అధికారిగా పనిచేసిన అయూబ్‌ఖాన్ చూపిన చొరవను కరియప్ప తిరస్కరించారు.



విజయవాడ విమానాశ్రయంలో నేను కరియప్పకు స్వాగతం పలికి, కారులో గుంటూరు బయలుదేరాం. ఆజానుబాహువు–సూట్‌లో ఉన్న ఆయన డ్రైవర్ పక్కన ముందుసీటులో కూర్చున్నారు. ప్రయాణం సాగుతూండగా, మార్గంమధ్యలో అర్థంతరంగా కారు ఆపమన్నారు కరియప్ప. గభాలున కారు దిగి, రోడ్డు పక్కనున్న ఓ ఐదేళ్ళ చిన్నపిల్లను సమీపించారు. తైల సంస్కారం లేక, చికిరిబికిరిగా జుట్టుతో ఉన్న ఆ పిల్లకు జేబులో నుంచి అద్దం తీసి చూపించి– "చూడు ఎంత వికారంగా ఉన్నావో?" అంటూ మరో జేబులో నుంచి ఒక రుమాలు తీసి ఆమె ముఖం తుడిచారు. ఇంకో జేబులో నుంచి మరో జేబుగుడ్డ తీసి, దానిలో ఫేస్ పౌడర్ వేసి ఆమెకు పూశారు. దువ్వెన తీసి తల దువ్వారు. మళ్లీ అద్దం చూపించి "See how beautiful you are?" (ఎంత అందంగా ఉన్నావో చూడు) Do you promiss me to follow the same everyday? (ఇకపై, ప్రతిరోజూ ఇలాగే చేస్తావా?) అని అడిగాడు. ఆ పిల్లకు ఇదేమీ అర్థంగాక వింతగా చూస్తోంది. ఈయన 'జై హింద్' అని పిడికిలి బిగించి, పద వెడదాం అన్నారు నాతో.

ఇది అరవై మూడేళ్లనాటి ముచ్చట. ఇప్పటికీ నా మదిలో మెదులుతూనే ఉంది.

● డాక్టర్ యలమంచిలి శివాజీ

అలుపెరుగని కార్మిక యోధుడు!

ఉద్యోగాన్నీ, ఉద్యమాన్నీ సమాంతరంగా, సమానస్థాయి శ్రద్ధాసక్తులతో, అంకితభావంతో నిర్వహించేవారు అరుదు. ఆ తరహా పోరాటయోధుడు వెల్లలచెరువు సాంబశివరావు. CITU–CPMలలో పనిచేస్తూనే, ఇటు పోస్టల్–టెలికాం సంఘాలలో చురుకైన నాయకునిగా వ్యవహరించారు కామ్రేడ్ సాంబశివరావు. ముఖ్యంగా 80, 90 దశకాలలో ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలలో సాంబశివరావు ముఖ్య భూమిక పోషిస్తూ, ఉద్యోగులు, కార్మికులకు తలలో నాలుకలా వ్యవహరించారు. సీపీఎం సభ్యునిగా సుదీర్ఘకాలం పార్టీలో పనిచేశారు.

సమాజాన్ని మార్చాలంటే నిర్దిష్టమైన రాజకీయ విధానాలతోనే సాధ్యమన్న ఆలోచన విద్యార్థి దశలోనే ఆయనకు ఉండేది. గుంటూరు జిల్లా పెదకూరపాడులో ఎస్ఎస్ఎల్సీ చదివే సమయంలో అలవడిన అభ్యుదయ భావాలు ఆయనను వామపక్ష ఉద్యమం వైపు నడిపించాయి. రాజమండ్రిలో జేఈగా తొలి అపాయింట్‌మెంట్ వచ్చింది. కానీ ఆ స్థానంలో ఉంటే ఉద్యోగ సంఘ నాయకులకు ఎదురయ్యే ఇబ్బందులు గ్రహించారు. కెరీర్‌లో నష్టపోతానని తెలిసి కూడా ఆ స్థానాన్ని వదులుకుని క్లరికల్ జాబ్‌లోకి వచ్చారు.


ఉద్యోగుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటాలు చేశారు. బీఎస్ఎన్ఎల్ ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో సాంబశివరావు పాత్ర చాలా ఉంది. పోస్టల్ అండ్ టెలికాం రంగం విడిపడిన సందర్భంలో ఆయన టెలికాం రంగంవైపు వచ్చినప్పటికీ, పోస్టల్ సంఘానికి, టెలికాం సంఘానికి వారధిగా ఉండేవారు. ఉద్యోగులు–కార్మికుల సమస్యల పరిష్కారానికి మేనేజ్‌మెంట్‌పై ఒత్తిడి తెచ్చి, ఫలితాలు సాధించడంలో సాంబశివరావుకు అసాధారణమైన నైపుణ్యం ఉంది. ఓర్పుతో కూడిన ఆయన పోరాట పటిమను బీఎస్ఎన్ఎల్, పోస్టల్ రంగంలోని ఉద్యోగ కార్మికులు రెండు దశాబ్దాల పాటు కళ్లారా చూశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల్లోనూ ఉద్యోగులతో ఆయనకు మంచి సంబంధాలు ఉండేవి. ఉద్యోగ సంఘాల తరఫున సెమినార్లు, క్లాసులు నిర్వహించేవారు. 1993 జనవరి 4న ఏలూరులో నిర్వహించిన మహాసభల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా సాంబశివరావు ఎన్నికై పదేళ్లపాటూ పనిచేశారు. చివరికి పదవీ విరమణ తర్వాత కూడా నాయకునిగానే పనిచేశారు. బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ సంఘానికి ఆయుష్షుపోశారు.



రాత్రి 12 గంటల వరకూ యూనియన్ కార్యకలాపాల్లోనే సాంబశివరావు గడిపేవారు. పార్టీపై, పార్టీకి అనుబంధంగా ఉండే ట్రేడ్ యూనియన్లపై నిర్బంధం ఉన్న రోజుల్లో కూడా ఆయన వెన్నుచూపలేదు. ఆంక్షల్ని లెక్కచేసేవారు కాదు. ఆ రోజుల్లో ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలు ముమ్మరంగా సాగేవి. చాలాసార్లు తెల్లవార్లూ చర్చలు జరుగుతుండేవి. వాటిలో సాంబశివరావు చురుగ్గా పాల్గొనేవారు. కార్పొరేట్ శక్తుల నుంచి ప్రభుత్వరంగ సంస్థల్ని కాపాడుకోవాలని పరితపించారు. వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేసి పోరాటమే లక్ష్యంగా రేయింబవళ్లూ ఉద్యమాల్లో తిరిగేవారు. కుటుంబం కంటే ఎక్కువ సమయం యూనియన్ కార్యకలాపాలకే వెచ్చించేవారు. తన పిల్లలతో గడపడానికి కూడా ఆయనకు తీరిక ఉండేది కాదు. వాళ్లను ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మీడియంలోనే చదివించారు. దివిసీమ ఉప్పెన సమయంలో కుటుంబాన్ని వదిలిపెట్టి తిరువనంతపురంలో మీటింగ్‌కు వెళ్లారు. అత్యంత నిరాడంబరమైన జీవనశైలి ఆయనది. ఎంతదూరమైనా సైకిల్ మీదే ప్రయాణం. రిక్షాలో తిరిగే ఆర్థిక వెసులుబాటు ఉన్నప్పటికీ సైకిల్‌పైనే వచ్చి, పార్టీ ఖర్చులు లెక్కలు రాసి వెళ్లేవారు. ఆదర్శవంతమైన ఉద్యమకారుడిగా జీవితాంతం పనిచేశారు.

'ప్రజా చైతన్య వేదిక' అనే సోషల్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేసి గుంటూరులో ఉద్యోగ సంఘాల నేతలు, మేధావులతో సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక చర్చా గోష్ఠులు, సదస్సులు నిర్వహించేవారు. ఎక్కడ ఏ సభలో మాట్లాడినా ఆయన ప్రసంగాలు ఉత్తేజపరిచేవి. కంచుకంఠంతో, ఛలోక్తులతో సాగే ఆయన ప్రసంగాలు ఆద్యంతం ఆసక్తిగా, సిద్ధాంతాల్ని జనంలోకి పంపించేలా ఉండేవి. జీవితసారం ఆ మాటల్లో దొర్లేది. తప్పును తప్పు అని కుండబద్దలు కొట్టేవారు. మంచి చేస్తుంటే భుజం తట్టేవారు. ఇంత గొప్ప వ్యక్తి నా తండ్రి అని చెప్పుకోవడం నాకెంతో గర్వంగా అనిపిస్తోంది. పుత్రుడు జన్మించినప్పుడే తండ్రికి పుత్రోత్సాహం పుట్టదని అంటాడు శతకకారుడు. ఇది నా తండ్రి మరణ సమయం. జనులాతండ్రిని పొగుడుతున్న ఈ క్షణం, పితోత్సాహంతో కన్నీళ్లతో రాస్తున్న అక్షర నివాళి ఇది!

■ వెల్లలచెరువు రజనీకాంత్
సీనియర్ జర్నలిస్ట్





అచ్చంపేట : తాళ్ళచెరువు దేవాలయంలో దివ్య పూజాబలి నిర్వహిస్తున్న బిషప్ భాగ్యయ్య

అపర దేశభక్తుడు.. వాజపేయి



- సుపరిపాలనా దినోత్సవ సభలో కేంద్రమంత్రి చౌహాన్, సీఎం చంద్రబాబు
- రాజధాని అమరావతిలో అట్టహాసంగా మాజీ ప్రధాని విగ్రహావిష్కరణ

తుళ్లూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): 'జీవిస్తే దేశం కోసం జీవించాలి.. మరణించినా దేశం కోసమే జరగాలి.. నా చితాభస్మం దగ్గర చెవి పెడితే జై భారత్ అనే శబ్దం వస్తుంది.. అని ప్రకటించుకున్న అపరదేశ భక్తుడు.. యుగపురుషుడు.. విపత్కర పరిస్థితులను ఎదిరించి సుపరిపాలన అందించిన ధీరుడు.. వాజపేయి.' అని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, సీఎం చంద్రబాబునాయుడు కీర్తించారు. రాజధాని అమరావతిలోని వెంకటపాలెం పరిధిలో గురు వారం మాజీ ప్రధాని భారతరత్న స్వర్గీయ అటల్ బిహారీవాజపేయి కాంస్య విగ్రహావిష్కరణ అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సుపరిపాలనా దినోత్సవ సభలో చౌహాన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి వాజపేయి విశేష కృషి చేశారని కొనియాడారు. ప్రధాని పదవి పోతుందన్నా పార్టీ పిరాయింపులను వ్యతిరేకించిన గొప్పవ్యక్తి వాజపేయి అ న్నారు. అమెరికాను సైతం ఎదిరించి అణు పరీక్షలు జరిపిన ధీరుడన్నారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నేతృత్వంలో దేశం, రాష్ట్రం శక్తివంతంగా తయారు కావడం ఖాయమన్నారు. సీఎం చంద్రబాబు అద్భుతమైన రాజధానిగా అమరావతి నిర్మాణం చేస్తున్నారని కొనియాడారు. అందుకు కేంద్ర ప్రభుత్వ సహకారం పూర్తిగా ఉంటుందని తెలిపారు. చంద్రబాబు మాట్లాడుతూ వాజపేయి సుపరిపాలన పరిచయం చేశారన్నారు. ఆయన గొప్ప మానవతావాది అని కొనియాడారు. ప్రజలకు సంపద, ఆరోగ్యం, ఆనందాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. దేశంలో ప్రథమ స్థానంలో తెలుగు జాతి ఉండాలనేది తన సంకల్పమన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర మంత్రులు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, శ్రీనివాసవర్మరాజు, సత్యకుమార్, నారాయణ, కందుల దుర్గేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, జడ్పీ ఛైర్‌పర్సన్ హెనీక్రిస్టీనా, మాదిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి, రాజధాని రైతులు మహిళలు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, సహాయ మంత్రి పెమ్మసాని



హాజరైన పార్టీ కార్యకర్తలు, ప్రజలు

సందడిగా క్రిస్మస్

- జిల్లా వ్యాప్తంగా ఘనంగా వేడుకలు
- చర్చిల్లో ప్రార్థనలకు పోటెత్తిన భక్తులు

(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

జిల్లా అంతటా గురువారం క్రిస్మస్ సందడి నెలకొంది. క్రిస్మస్ పండుగను క్రైస్తవులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపు కున్నారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చి కరుణామయుడ్ని సేవించారు. తేరు ఉత్సవాలు, దివ్యపూజాబలి, అన్నదానాలు తదితర కార్యక్రమాలు పెద్దఎత్తున నిర్వహించారు. చర్చిల సమీప ప్రాంతాల్లో అర్ధరాత్రి మొదలైన సందడి గురువారం మధ్యాహ్నం వరకు కొనసాగింది. క్రిస్మస్ కేక్ కటింగ్‌లతో పాటు మిఠాయిలు పంచి పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఏసు క్రీస్తు జన్మదిన వృత్తాంతాన్ని తెలిపే విధంగా బొమ్మలతో ప్రార్థనా మందిరాలను ప్రత్యేకంగా అలంకరించారు. చర్చిలు విద్యుత్ దీపాలతో కాంతులీనగా, భారీ నక్షత్ర కాంతులతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని వీధులు ప్రకాశించాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న చర్చిలు, ప్రార్థనా మందిరాల్లో జరిగిన ప్రత్యేక ప్రార్థనలకు ప్రజాప్రతినిధులు, అధికారులతో పాటు రాజకీయ పార్టీల నేతలు హాజరై క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు.





తెనాలిలో క్రిస్మస్ పార్థనలు చేస్తున్న ఫాస్టర్లు, పాల్గొన్న భక్తులు

ప్రేమను పంచండి : బిషప్ భాగ్యయ్య

అచ్చంపేట: సర్వలోకానికి ప్రేమను పంచుతూ.. అందరి ఎడల ప్రేమగా ఉండాలని.. సర్వమతాలను గౌరవించాలని క్రైస్తవులకు బిషప్ చిన్నాబత్తిన భాగ్యయ్య సూచించారు. తాళ్ళచెరువులో బాల ఏసు దేవాలయంలో గురువారం దివ్యపూజాబలి నిర్వహించారు. ఈ సందర్భంగా బిషప్ క్రిస్మస్ సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో రేపూడి రాయప్ప, కరుణాకర్, థోమాస్, తుమ్మా మర్రెడ్డి, పవన్ తదితరులతో పాటు కన్యా స్త్రీలు పాల్గొన్నారు.





ప్రార్థనల్లో పాల్గొన్న యువతులు






నార్త్ ప్యారిస్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న బిషప్ జోహాన్ బాబురావు బృందం, హాజరైన భక్తులు

31 సంస్థలు... 121.36 ఎకరాలు

- రాజధానిలో భూములు కేటాయించిన సీఆర్డీఏ
- చ.మీ.కు ఏడాదికి రూపాయి... 60 ఏళ్లకు లీజు
- ప్రైవేటు సంస్థలకు ఎకరం రూ.50 లక్షలకు



నమ్మించి ముంచిన స్వర్ణకారుడు

- రూ.3.84 కోట్లు వసూలు.. ఏడాదిగా అదృశ్యం
- పోలీసులను ఆశ్రయించిన 89 మంది బాధితులు

నేడు పెదనందిపాడుకు రానున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

సంక్రాంతికి మరిన్ని ప్రత్యేక రైళ్లు

రేపటి నుంచి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు

మాజీ మేయర్ కావటిపై కిడ్నాప్, దౌర్జన్యం కేసు

- బలవంతంగా ఆస్తుల రిజిస్ట్రేషన్‌పై రాజధాని రైతు ఫిర్యాదు
- తుళ్లూరులో ఈ నెల 8న నమోదు.. రహస్యంగా ఉంచిన పోలీసులు

6

3 నుంచి 15 వరకు.. సారస్

- ప్రదర్శనశాలకు మణిపురం బ్రిడ్జి వద్ద ఏర్పాట్లు
- నేడు కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని సమీక్ష

గుంటూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని కాకాని రోడ్డు మణిపురం బ్రిడ్జి దగ్గర వచ్చే నెల 3 నుంచి 15వ తేదీ వరకు సారస్(రూరల్ ఆర్టిసన్స్ సొసైటీ ఆర్టికల్స్ సేల్) ప్రదర్శనశాలకు ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ గుంటూరు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సౌజన్యంతో ఈ ప్రదర్శనశాలను నిర్వహిస్తుంది. గ్రీన్ లీఫ్ టుబాకో త్రెషోల్డ్ ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న ఈ ఎగ్జిబిషన్లో ఏపీతో పాటు అనేక రాష్ట్రాల నుంచి సుమారు 600 మంది స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొననున్నారు. మొత్తం 250 స్టాళ్లలో హ్యాండ్లూమ్స్, హ్యాండిక్రాఫ్ట్స్, చీరలు, షాల్స్, కార్పెట్లు, బెడ్ షీట్లు, వెదురు, లోహ, గాజు ఉత్పత్తులు, సంప్రదాయ, ఆర్గానిక్ ఆహార పదార్థాలు, ఆభరణాలు, గృహ అలంకరణ వస్తువులు, ఆహార పదార్థాలు వంటి ఉత్పత్తులు ప్రదర్శన, విక్రయం జరుగుతుంది. ఈ ఎగ్జిబిషన్‌ను విజయవంతంగా నిర్వహించేలా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ఎగ్జిబిషన్లో ప్రతిరోజు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు పర్యాటక శాఖ, విద్యాశాఖ, సాంస్కృతిక శాఖ సమన్వయంతో ఏర్పాట్లు చేయాలన్నారు. కాగా శుక్రవారం కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సారస్ ఎగ్జిబిషన్ ఏర్పాట్లపై సమీక్షించనున్నారు. కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటల నుంచి ఈ సమావేశం జరుగుతుంది.

31 సంస్థలు... 121.36 ఎకరాలు

● రాజధానిలో భూములు కేటాయించిన సీఆర్డీఏ ● చ.మీ.కు ఏడాదికి రూపాయి... 60 ఏళ్లకు లీజు ● ప్రైవేటు సంస్థలకు ఎకరం రూ.50 లక్షలకు

గుంటూరు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో పలు ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలకు ఏపీసీఆర్డీఏ భూములు కేటాయించింది. ఈ మేరకు రాష్ట్ర పురపాలక శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈనెల 4న జరిగిన సీఆర్డీఏ 55వ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు మొత్తం 31 సంస్థలకు 121.36 ఎకరాలు కేటాయించారు. విద్యాసంస్థలు, బ్యాంకులు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలు, సిబ్బంది నివాస స్థలాల కోసం ఈ భూములు కేటాయించినట్లు

కొత్తగా 11 సంస్థలకు భూములు

ఏపీసీఆర్డీఏకి తాజాగా ప్రతిపాదనలు అందిన 11 సంస్థలకు 49.5 ఎకరాలు కేటాయించారు. బేసిల్-ఉడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు ఎకరం రూ.50 లక్షలు చొప్పున మందడంలో 4 ఎకరాలు, సెయింట్ మేరిస్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు ఎకరా రూ.50 లక్షల చొప్పున తుళ్లూరులో 7.97 ఎకరాలు కేటాయించారు. సీఐఐ గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్‌కు ఎకరానికి రూ.4.1 కోట్ల చొప్పున ప్రీమియంతో చదరపు మీటరుకు ఒక రూపాయి లీజుతో 60 ఏళ్లపాటు నవులూరులో 15 ఎకరాలు లీజుకు ఇచ్చారు. కేంద్ర సంస్థ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్)కు ఐనవోలులో ఐదెకరాలు, ఎన్‌టీపీసీ థర్మల్ పవర్ కార్పొరేషన్‌కు రాయపూడిలో 1.50 ఎకరాలు, ఏపీ జ్యూడీషియల్ అకాడమీకి పిచుకలపాలెంలో 4.83 ఎకరాలు, కేంద్ర సంస్థ కాస్మోస్ 2- ప్లానిటోరియమ్‌కు అనంతవరంలో 5 ఎకరాలు, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఐడీబీఐ బ్యాంకులకు ఉద్దండరాయునిపాలెంలో 0.40 ఎకరాలు చొప్పున, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(ఎన్ఏసీ)కి తుళ్లూరులో 5 ఎకరాలు రూ.4.1కోట్ల ప్రీమియం, చ.మీ.కు ఒక రూపాయి లీజుతో 60ఏళ్ల పాటు భూములు కేటాయిచారు.

6 సంస్థలకు కేటాయింపుల్లో మార్పులు

అమరావతి పరిధిలో ఆరు సంస్థలకు గతంలో కేటాయించిన భూములను సవరించి తాజాగా 42.30 ఎకరాలు కేటాయించారు. హైదరాబాద్ ఎడ్యుకేషనల్ అకాడమీకి ఎకరాకు రూ.50 లక్షల చొప్పున తుళ్లూరులో 8 ఎకరాలు కేటాయించారు. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ బీపీసీఎల్ కార్యాలయానికి నిడమర్రులో 1.34 ఎకరాలు, ఐఆర్‌సీటీసీకి తుళ్లూరులో 2 ఎకరాలు, రాష్ట్ర ప్రభుత్వ సంస్థ ఏపీహెచ్ఆర్డీఐకి ఐనవోలులో 10 ఎకరాలు, చదరపు మీటరుకు ఏడాదికి ఒక రూపాయి లీజు కింద 60 ఏళ్ల పాటు లీజుకు ఇచ్చారు. కాగా ప్రైవేటు సంస్థ ఎక్స్ఎల్ఆర్ఐకి గతంలో ఇచ్చిన 50 ఎకరాలకు అదనంగా మరో 11.79 ఎకరాలు, ఎకరం రూ.50 లక్షల చొప్పున మందడం, ఐనవోలుల్లో కేటాయించారు. ప్రభుత్వరంగ సంస్థ హడ్కోకు గతంలో కేటాయించిన 9.17 ఎకరాలకు అదనంగా మరో 1.17 ఎకరాలు ఎకరానికి రూ. 4 కోట్ల చొప్పున ఐనవోలులో కేటాయించారు.

ఉద్యోగుల నివాసాలకు 12.66 ఎకరాలు

ఏపీ కోఆపరేటివ్ బ్యాంకు(ఆప్కాబ్) ఉద్యోగుల నివాసాలకు 2.20 ఎకరాలు, భారతీయ స్టేట్ బ్యాంకు(ఎస్‌బీఐ) ఉద్యోగులకు 2.05 ఎకరాలు, ఆర్బీఐ ఉద్యోగులకు 4.04 ఎకరాలు, బ్యాంక్ ఆఫ్ బరోడా ఉద్యోగులలకు 1.15 ఎకరాలు, కెనరా బ్యాంకు ఉద్యోగులకు 0.80 ఎకరాలు, ఎన్ఏఐసీఎల్ ఉద్యోగులకు 0.50 ఎకరాలు, బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగులకు 0.82 ఎకరాలు, బీపీసీఎల్ ఉద్యోగులకు 1.10 ఎకరాల భూమిని ఐనవోలులో ఎకరాకు రూ.4.1 కోట్ల ప్రీమియంతో, చదరపు మీటరుకు రూపాయి లీజుతో 60 ఏళ్లకు కేటాయించారు.

గత కేటాయింపులకు కొనసాగింపుగా..

2014- 19 మధ్య పలు సంస్థలకు కేటాయించిన కేటాయింపులను సమీక్షించి మరో ఆరు సంస్థలకు అదనంగా 16.19 ఎకరాలు కేటాయించారు. అమరావతి ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ అకాడమీ (దీన్ దయాళ్ ఆంగ్లో వేదిక్(డీఏవీ) స్కూల్)కు నెక్కల్లులో ఎకరానికి రూ.50 లక్షల చొప్పున 3 ఎకరాలు కేటాయించారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ)కు నేలపాడులో 0.5 ఎకరాలు, సిబ్బంది నివాసాలకు ఐనవోలులో 0.60 ఎకరాలు, ఎకరం రూ.4 కోట్ల లెక్కన కేటాయించారు. కాంధారి హోటల్‌కు తుళ్లూరులో ఎకరం రూ.1.50 కోట్ల చొప్పున ఒక ఎకరం, కినరా గ్రూప్ హోటల్స్‌కు మందడంలో ఒక ఎకరం రూ.1.50 కోట్లకు, ఏపీ గ్రంథాలయ శాఖకు చ.మీ.కు రూపాయి చొప్పున ఐనవోలులో 6.19 ఎకరాలు 60ఏళ్ల లీజుకు, గ్లోబల్ ఇండియన్ ఇంటర్నేషనల్ స్కూల్ కే-12కు ఎకరం రూ.50 లక్షలకు, శాఖమూరులో 4 ఎకరాలు కేటాయించారు.

మాజీ మేయర్ కావటిపై కిడ్నాప్, దౌర్జన్యం కేసు

● బలవంతంగా ఆస్తుల రిజిస్ట్రేషన్‌పై రాజధాని రైతు ఫిర్యాదు ● తుళ్లూరులో ఈ నెల 8న నమోదు.. రహస్యంగా ఉంచిన పోలీసులు

గుంటూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర మాజీ మేయర్, వైసీపీ నాయకుడు కావటి మనోహర్‌నాయుడిపై తుళ్లూరు పోలీస్ స్టేషన్‌లో కిడ్నాప్, దౌర్జన్యం, బెదిరింపు, ఆస్తుల రిజిస్ట్రేషన్ తదితర సెక్షన్ల కింద కేసు నమోదైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు ఈ నెల 8నే కేసు నమోదు చేసిన పోలీసులు ఈ విషయాన్ని గోప్యంగా ఉంచారు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజధాని తుళ్లూరు మండ లం అనంతవరం గ్రామానికి చెందిన నీరుకొండ శ్రీను 2018లో గుంటూరుకు చెందిన మద్దు రామకృష్ణయ్య నుంచి రూ.3.70 కోట్లు అప్పుగా తీసుకున్నాడు. ఇందుకు గాను శ్రీను 2018 - 2020 మధ్యలో రూ.96 లక్షలు వడ్డీగా చెల్లించారు. అయితే వ్యాపారంలో నష్టాల కారణంగా కొద్ది నెలలు వడ్డీ చెల్లించలేదు. 2020 నవంబరు 5న రామకృష్ణయ్య మరికొందరితో కలిసి అనంతవరంలోని శ్రీను ఇంటికి వెళ్లి కత్తితో బెదిరించి కిడ్నాప్ చేసి గుంటూరు తీసుకొచ్చి అప్పటి మేయర్ కావటి మనోహర్ నాయుడు ఎదుట హాజరు పరిచారు. ఆయన కూడా రూ.12 కోట్లు బాకీ ఉన్నావంటూ బెదిరించి శ్రీను నుంచి 3 ఖాళీ ప్రామిసరీ నోట్లు, 3 ఖాళీ చెక్కులు స్వాధీనం చేసుకున్నారు. రాజధానిలో తొమ్మిది కోట్లకుపైగా విలువైన సీఆర్డీఏ ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లలో నివాస ఇళ్ల స్థలాలు 3వేల 400 గజాలు, కమర్షియల్‌లోని 300 గజాలను శ్రీను నుంచి కొనుగోలు చేసినట్లు రాయించుకున్నారు. గుంటూరులో శ్రీనుకు చెందిన రూ.74 లక్షల ఖరీదైన ఇంటిని కూడా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అయితే అప్పులన్నీ తాను సెటిల్ చేశానంటూ కావటి మనోహర్‌నాయుడు శ్రీను నుంచి రూ.10 లక్షలు తీసుకున్నాడు. కిడ్నాప్, బెదిరింపు, నగదు తీసుకున్న విషయాలు ఎవరికైనా చెబితే ప్రభుత్వం తమదని, ఏమీ చేయలేరు, ఈ లోకంలో లేకుండా చేస్తామని వారు శ్రీనును బెదిరించారు. ప్రాణ భయంతో ఉన్న శ్రీను ప్రభుత్వం మారిన తర్వా త ఎస్పీ కార్యాలయంలోని పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు ఈ మేరకు ఈ నెల 8న తుళ్లూరు పోలీస్ స్టేషన్‌లో కూడా శ్రీను ఫిర్యా దు చేయడంతో సీఐ మాతంగి శ్రీనివాసరావు మద్దు రామకృష్ణయ్య, ఆయన కుమారుడు మద్దు శ్రీమన్నారాయణ, మద్దు రామకృష్ణయ్య భార్య, తోట సాయి, నామాల రమణ, మాజీ మేయర్ కావటి మనో హర్ నాయుడులపై కేసు నమోదు చేశారు. అయితే కేసు నమోదు విషయం తెలుసుకున్న మనోహర్ సహా మిగిలిన నిందితులంతా ప రారైనట్లు తెలుస్తోంది. కేసును రాజీ చేసేందుకు పోలీసులు ప్రయ త్నిస్తున్నారని అందువల్లే రహస్యంగా ఉంచినట్లు సమాచారం.

నమ్మించి ముంచిన స్వర్ణకారుడు

● రూ.3.84 కోట్లు వసూలు.. ఏడాదిగా అదృశ్యం ● పోలీసులను ఆశ్రయించిన 89 మంది బాధితులు



స్వర్ణకారుడిపై ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన బాధితులు

యడ్లపాడు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజల నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని యడ్లపాడు పాతూరు రచ్చబండ సెంటర్‌కు చెందిన వేలూరి కామేశ్వరరావు అనే స్వర్ణకారుడు 3.84 కోట్ల బంగారం, నగదు వసూలు ఏడాదిగా ఆచూకీ లేడు. 89 మంది బాధితులు గురువారం చిలకలూరిపేట పోలీసులను ఆశ్రయించారు. దీంతో స్వర్ణకారుడు భారీ మోసం వెలుగుచూసింది. ఇందుకు సం బంధించి బాధితులు తెలిపిన వివరాలు.. కామేశ్వర రావు వారసత్వంగా తండ్రి తదనంతరం రెండు దశాబ్దాలకు పైగా స్వర్ణకార వృత్తిలో ఉన్నాడు. గతంలో తండ్రికి మంచి పేరు ఉండడంతో కామేశ్వరరావు వద్దకు గ్రామస్థులతో పాటు సమీప గ్రామాలకు చెందిన వారు ఆభరణాలు తయారు చేయించుకునేవారు. ఈ క్రమంలో నగలు తయారీ కోసం పలువురు బంగారం అందజేశారు. వడ్డీ చెల్లిస్తానని పలువురి నుంచి రూ.లక్షలు తీసుకున్నాడు. కరోనాకు ముందు సక్రమంగానే ఆభరాణాలు చేయించి ఇవ్వడంతో పాటు వడ్డీలు చెల్లించే వాడు. ఆ తర్వాత ఏమైందో ఏమోగాని కొంతకాలంగా ఆభరణాలతో పాటు నగదు చెల్లింపులు సక్రమంగా చేయకుండా మభ్యపెడుతూ వస్తున్నాడు. కాలయాపన చేస్తున్న కామేశ్వరరావు ఏడాదిగా కనిపించకుండా తిరుగుతున్నాడు. ఫోన్ చేస్తే త్వరలో వస్తా అంటూ మాయ చేస్తుండటంతో మోసపోయామని గ్రహించి బాధితులు పోలీసులను ఆశ్రయించారు. 20 మంది ప్రామిసరీ నోట్లు, రసీదులను పోలీసులకు అందజేశారు. బాధితుల ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు.

సంక్రాంతికి మరిన్ని ప్రత్యేక రైళ్లు

గుంటూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సెలవుల్లో రైలు ప్రయాణిలకు రోజురోజుకు రద్దీ పెరుగుతోన్న దృష్ట్యా మరిన్ని ప్రత్యేక రైళ్లను నడిపేందుకు నిర్ణయించినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఏ శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబ రు. 07450 కాకినాడ టౌన్ - వికారాబాద్ స్పెషల్ జనవరి 19వ తేదీన సాయంత్రం 4.45కి బయలుదేరి గుంటూరు మీదగా మరుసటి రోజు ఉదయం 7 గంటలకు వికారబాద్ చేరుకొంటుంది. నంబరు. 07451 వికారాబాద్ - కాకినాడ టౌన్ ప్రత్యేక రైలు జన వరి 20న ఉదయం 9 గంటలకు బయలుదేరి గుంటూరు మీదగా రాత్రి 9.15కి కాకినాడ టౌన్‌కు చేరుకొంటుంది. నంబరు. 07452 నాందేడ్ - కాకినాడ టౌన్ స్పెషల్ జనవరి 12న మధ్యాహ్నం 1.30కి బయలుదేరి గుంటూరు మీదగా మరుసటి రోజు ఉదయం 9 గంటలకు కాకినాడ టౌన్‌కు చేరుకొంటుంది. నంబరు. 07453 కాకినాడ టౌన్ - నాందేడ్ ప్రత్యేక రైలు జనవరి 13న మధ్యాహ్నం 1 గంటకు బయలుదేరి గుంటూరు మీదగా మరుసటి రోజు ఉదయం 7 గంటలకు నాందేడ్ చేరుకొంటుంది.

సాఫ్టువేర్ ఇంజనీర్ల కుటుంబాల సౌకర్యార్థం...

సంక్రాంతి పండగ సెలవులకు జిల్లాకు వచ్చి తిరుగు ప్రయాణమయ్యే సాఫ్టువేర్ ఉద్యోగుల కుటుంబాల సౌకర్యార్థం హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ రైల్వేస్టేషన్‌లో నాలుగు రైళ్లకు నిలుపుదల సౌకర్యాన్ని తాత్కాలికంగా రైల్వే శాఖ కల్పించనుంది. నంబరు. 17255 నరసపూర్ - లింగంపల్లి, 17256 లింగంపల్లి - నరసపూర్, 12805 విశాఖపట్టణం - లింగంపల్లి, 12806 లింగంపల్లి - విశాఖపట్టణం జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు జనవరి 7వ తేదీ నుంచి 20వ తేదీ వరకు హైటెక్ సిటీ రైల్వేస్టేషన్‌లో నిలుపుదల సదుపాయాన్ని కల్పించింది.

పెరిగిన రైలు చార్జీలు అర్ధరాత్రి నుంచి అమల్లోకి...

రైల్వేశాఖ పెంచిన టిక్కెట్ చార్జీల ధరలు గురువారం అర్ధరాత్రి దాటాక(శుక్రవారం) ఈ నెల 26వ తేదీ నుంచి అమలులోకి వచ్చినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఏ శ్రీధర్ తెలిపారు. సబర్బన్(సింగిల్ జర్నీ), సీజన్ టిక్కెట్స్(సబర్బన్ అండ్ నాన్ సబర్బన్)కు టిక్కెట్ ఛార్జీలో ఎలాంటి పెంపుదల లేదు. ఆర్డినరీ నాన్-ఏసీ(నాన్-సబర్బన్) కేటిగిరీలో సెకండ క్లాస్ ఆర్డినరీ రైళ్లకు కిలోమీటర్‌కు పైసా చొప్పున పెరిగింది. 215 కిలోమీటర్ల వరకు అయితే ఎలాంటి చార్జీ పెరగదు. ఆ తర్వాత 216 నుంచి 750 కిలోమీటర్ల వరకు రూ. 5, 751 నుంచి 1250 కిలోమీటర్ల వరకు రూ. 10, 1251 నుంచి 1750 కిలోమీటర్ల వరకు రూ. 15, 1751 నుంచి 2250 కిలోమీటర్ల వరకు రూ. 20 పెరిగింది. స్లీపర్ క్లాస్ ఆర్డినరీ, ఫస్టు క్లాస్ ఆర్డినరీకి కూడా కిలోమీటర్‌కు పైసా చొప్పున పెరిగింది. మెయిల్/ఎక్స్‌ప్రెస్(నాన్ఏసీ) కేటిగిరీలో సెకండ్‌క్లాస్/స్లీపర్‌క్లాస్, ఫస్టుక్లాస్‌కు కిలోమీటర్‌కు రూ. 2 పైసలు, ఏసీ తరగతుల్లో ఏసీ ఛైర్‌కార్/ఏసీ త్రీటైర్/3ఈ, ఏసీ టూటైర్, ఏసీ ఫస్టుక్లాస్/ఈసీ/ఈఏకు కిలోమీటర్‌కు రూ. 2 పైసల చొప్పున ఛార్జీలు పెరిగాయి. ఇప్పటికే బుకింగ్ అయిన టిక్కెట్‌పై పెరిగిన చార్జీలు అమలు చేయరు.

ఉన్నత విద్యాశాఖ పరిధిలోకి ఏపీఆర్‌డీసీ

విజయపురిసౌత్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపీఆర్‌ఈఐ డిగ్రీ కళాశాలను ఏపీఆర్‌ఈఐ సొసైటీ నుంచి ఉన్నత విద్యాశాఖ పరిధిలోకి మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు ఏపీఆర్‌ఈఐ స్కూల్ ఎడ్యుకేషన్ కింద ఉండడంతో అధ్యాపకుల నియామకాలతోపాటు కేంద్ర నిధులు పొందేందుకు అవాంతరాలు ఏర్పడ్డాయి. ఏపీఆర్‌ఈఐ సొసైటీలో డిగ్రీ కళాశాలలు లేకపోవడంతో విజయపురిసౌత్‌లోని ఏపీఆర్‌డీసీలో అధ్యాపకుల కొరత ఏర్పడింది. ప్రస్తుతం ఉన్నత విద్యాశాఖ పరిధిలోకి మారడంతో కళాశాలలో నూతన అధ్యాపకుల భర్తీ కానున్నారు. అలాగే పీఎం ఉష స్కీంకు అర్హత సాధించి కేంద్ర ప్రభుత్వ నిధులు కూడా కళాశాల అభివృద్ధికి రానున్నాయి. ఏపీఆర్‌డీసీలో మొత్తం 520 మంది విద్యార్థులు వివిధ కోర్సుల్లో విద్యనభ్యసిస్తున్నారు. ప్రస్తుతం కళాశాలలో 32 మంది అధ్యాపకులు, 26 మంది అధ్యాపకేతర సిబ్బంది పనిచేస్తున్నారు. ఏపీఆర్‌డీసీ ఉన్నత విద్యాశాఖ పరిధిలోకి మారడంతో కళాశాలలో పనిచేసే పలువురు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది ఏపీఆర్‌ఈఐ సొసైటీలో ఉన్న రాష్ట్రంలోని ఇతర ఏపీఆర్ జూనియర్ కళాశాలలకు బదిలీ కానున్నారు.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు

పొన్నూరు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో ఈనెల 27 నుంచి 29 వరకు మూడు రోజుల పాటు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పాత పొన్నూరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూత్ నిర్వాహకులు గురువారం తెలిపారు. పాత పొన్నూరు కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో జరిగే ఈ పోటీలకు ప్రథమ బహుమతిగా రూ. 40 వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 30 వేలు, తృతీయ బహుమతిగా రూ. 20 వేలు, నాలుగో బహుమతిగా రూ. 10 వేలు అందజేయనున్నట్లు చెప్పారు. కన్సోలేషన్ బహుమతులు కూడా ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇతర వివరాల కోసం 9494676758, 9949496421, 7396858508 నంబర్లలో సంప్రదించాల్సిందిగా నిర్వాహకులు సూచించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

క్రోసూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని 88 తాళ్లూరు సమీపంలో గురువారం సాయంత్రం జరిగింది. ఈ సంఘటనలో రాచమంటి వెన్నయ్య(45) అనే వ్యక్తి అక్కడికక్కడే మరణించాడు. మృతుని బంధువుల కథనం ప్రకారం క్రోసూరుకు చెందిన వెన్నయ్య కొంత కాలంగా తన భార్య, ఇద్దరు పిల్లలతో అత్తగారి గ్రామం వైన 88 తాళ్లూరులో నివాసం ఉంటున్నాడు. నిరు పేద కుటుంబానికి చెందిన వెన్నయ్య గొర్రెలు మేపుకుంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం పీసపాడు గ్రామం వైపు నుంచి గడ్డి మోపు మోసుకుంటూ 88 తాళ్లూరు వస్తుండగా కొల్లపాలెం వద్ద వేలాడుతున్న విద్యుత్ తీగలకు గడ్డి మోపు తగలడంతో వెన్నయ్య షాక్‌కు గురై అక్కడికక్కడే మరణించాడు. గతంలో కూడా ఇదే ప్రదేశంలో పలు సార్లు ప్రమాదం జరిగింది. జరిగిన సంఘటన గురించి క్రోసూరు పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు మృతుని బంధువులు తెలియజేశారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం గురువారం నాటికి 566.40 అడుగులు ఉంది. ఇది 247.54 టీఎంసీలకు సమానం. కుడి కాలవ ద్వారా 9500 వేల క్యూసెక్కులు, ఎడమ కాలవ ద్వారా 8629 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 30,597 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400 క్యూసెక్కులు, ఎల్‌ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 51,426 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 51,426 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

నేడు పెదనందిపాడుకు రానున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

పెదనందిపాడు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ శుక్రవారం గుంటూరు జిల్లా పెదనందిపాడు రానున్నారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి లావు నాగేశ్వరరావు గృహానికి ఆయన రానున్నారు. విజయవాడ నుండి నేరుగా ఆయన మధ్యాహ్నం 12 గంటలకు పెదనందిపాడులోని లావు నాగేశ్వరరావు స్వగృహానికి చేరుకుంటారు. అక్కడే భోజనం చేసి సాయంత్రం నాలుగు పదిహేను నిమిషాలకు అక్కడి నుంచి బయలు దేరుతారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి యువకుడు మృతి

అచ్చంపేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదపాలెం గ్రామానికి చెందిన కొజ్జా వెంకటరావు (25) ద్విచక్ర వాహనం అదుపు తప్పి మిట్టపాలెం సమీపంలోని కాలువలో పడి మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కే శ్రీనివాసరావు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.7.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	147, 156, 167
చికెన్ విత్ స్కిన్(కిలో)	284.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	294.00

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తులు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(2) & (12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, పరిపాలనా కార్యాలయం నం.24-బి, గాంధీ నగర్, కుంబకోణం -612 001 మరియు అందులో ఒక శాఖ కార్యాలయం కల్పతరు హౌస్, 6-9-24, 9/1, అరండల్‌పేట్, గుంటూరు-522002, గుంటూరు-అరండల్‌పేట్ శాఖ అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సదరు ప్రకటన స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా ప్రకటనలో తెలిపిన మొత్తం రూ.93,95,120/- (రూపాయలు తొంభై మూడు లక్షల తొంభై ఐదు వేల ఒక వంద ఇరవై మాత్రమే) లను మరియు నెలవారీ వాయిదాలతో 10.10.2025 నుండి దానిపై తదనంతర వడ్డీని తిరిగి చెల్లించమని రుణగ్రహీతలు నం.1) మెస్సర్స్ శ్రీ ఉమ చంద్రశేఖర ట్రేడర్స్, డి.నం.23-11-121/7, సాయి బిల్డింగ్స్, ఏలూరు బజార్, గుంటూరు-522003. నం.2) శ్రీ చెరుకూరి ఇందు శేఖర్, తండ్రి చెరుకూరి రంగయ్య, ఇ.నం.3-28-24116-సి, నన్నపనేని కల్యాణమండపం సమీపమున, ఎస్‌బిహెచ్ బ్యాంక్ వెనుక వైపు, బృందావన్ గార్డెన్స్, గుంటూరు. నం.3) శ్రీమతి చెరుకూరి పద్మజ, భర్త చెరుకూరి ఇందు శేఖర్, ఇ.నం. 3-28-24116-సి, నన్నపనేని కల్యాణమండపం సమీపమున, ఎస్‌బిహెచ్ బ్యాంక్ వెనుక వైపు, బృందావన్ గార్డెన్స్, గుంటూరు. నం.4) శ్రీ జెట్టి చాణక్య, తండ్రి జెట్టి శివరామ కృష్ణ, డి.నం.2-14-159/75, రెడ్డి గర్ల్స్ హాస్టల్ రోడ్, స్తంబాలగరువు, గుంటూరు వారిని కోరుతూ 14.10.2025 తేది గల డిమాండ్ ప్రకటనను జారీ చేశారు.

పైన తెలిపిన చట్టబద్ధమైన ప్రకటన తదుపరి కూడా సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో పైన తెలిపిన పేర్లు కలిగిన రుణగ్రహీతలు విఫలమైనందున, సదరు రూల్స్‌లోని రూల్ 8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ ఇందులో వివరించిన ఆస్తులను దిగువ సంతకందారు 23 డిసెంబర్ 2025న స్వాధీనం చేసుకున్నారని ఇందుమూలంగా పైన తెలిపిన పేర్లు కలిగిన రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజలకు తెలియజేయడమైనది.

సదరు ఆస్తులతో ఎటువంటి వ్యవహారాలు జరుపరాదని ముఖ్యంగా పైన తెలిపిన పేర్లు కలిగిన రుణగ్రహీతలను మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది మరియు సదరు ఆస్తులతో జరిపే ఏ వ్యవహారాలైనా రూ.96,60,062/- (రూపాయలు తొంభై ఆరు లక్షల అరవై వేల అరవై రెండు మాత్రమే) మరియు పూర్తి బకాయిలు చెల్లించే వరకు 23.12.2025 నుండి దానిపై వడ్డీని సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్‌కు చెల్లించుటకు లోబడియుంటాయి.

సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు సమయం ఉన్నందున చట్టంలోని సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (8) నిబంధనలను గమనించాల్సిందిగా రుణగ్రహీతలు కోరబడుతున్నారు.

మా బ్యాంకుకు తనఖా పెట్టబడిన స్థిరాస్తులు
షెడ్యూల్-ఎ

ఆస్తి-1 : (శ్రీమతి చెరుకూరి పద్మజ భర్త చెరుకూరి ఇందు శేఖర్‌కు చెందిన ఆస్తి) గుంటూరు సిటీ, న్యూ గుంటూరు నగర పాలక సంస్థ పరిధి వద్ద గల అంకిరెడ్డి పాలెం గ్రామ డి.నం.252/బి, తూర్పు వైపు 349.30 చ.గ.ల గల స్థలం. సరిహద్దులు: తూర్పు: 30 అ. వెడల్పు రోడ్ - 63 అ.లు. దక్షిణం: సుంకర వెంకటేశ్వర్లు వగైరాల భూమి - 50 అ.లు, పశ్చిమం: దాడి సాంబశివరావు స్థలం - 62.9 అ.లు, ఉత్తరం: లక్కాకుల తోమసయ్య స్థలం - 50 అ.లు.

ఆస్తి-2 : (శ్రీ జెట్టి చాణక్య తండ్రి జెట్టి శివరామకృష్ణకు చెందిన ఆస్తి) గుంటూరు సిటీ, గుంటూరు నగర పాలక సంస్థ పరిధి వద్ద గల ప్లాట్ నం.ఎ-33, ప్రస్తుత డి.నం.: 497/1, 498/1, డి.నం. 497, 498లో స్థలం యొక్క 200 చ.గ.ల (400 చ.గ.లలో) ఉత్తరం వైపున. సరిహద్దులు: తూర్పు: 30 అ.ల వెడల్పు రోడ్ - 22.6 అ.లు, దక్షిణం: ప్లాట్ నం.ఎ-33-80 అ.లు, పశ్చిమం: ఇతరులు భూమి - 22.6 అ.లు, ఉత్తరం: ప్లాట్ నం.ఎ-34-80 అ.లు.

ప్రదేశం:గుంటూరు , తేది: 23.12.2025 అధీకృత అధికారి

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

4న దివ్యాంగుల స్పెషల్ గ్రీవెన్స్

గుంటూరు(తూర్పు), డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో జనవరి 4వ తేదిన విభిన్న ప్రతిభా వంతుల స్పెషల్ గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు విభిన్న ప్రతిభా వంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఏడి దుర్గాబాయి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు, రేపు ఆర్వీఆర్‌జేసీలో కొలరిడో-2025

● యువతకు క్రీడా, సాంస్కృతిక రంగాల్లో పోటీలు

గుంటూరు (విద్య), డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలోని ఆర్వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్ర, శనివారాలు కొలరిడో-2025 జాతీయ స్థాయిలో క్రీడా, సాంస్కృతిక, కళా ఉత్సవాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి దేశంలోని వివిధ కళాశాలల నుంచి భారీ సంఖ్యలో విద్యార్థులు హాజరు కానున్నట్లు చెప్పారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు రూ. 5 లక్షల వరకు నగదు బహుమతులను అందించనున్నట్లు తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీసీఎస్ ప్రతినిధి రవిశంకర్, గౌరవ అతిథిగా ఉన్నత విద్యామండలి చైర్మన్ డాక్టర్ మధుమూర్తి, విశిష్ట అతిథులుగా తెలుగు సినీ చలనచిత్ర యువ నటీనటులు నందు, యామిని భాస్కర్ తదితరులు హాజరు కానున్నట్లు తెలిపారు.



క్రిస్మస్ పండుగ సందర్భంగా గురువారం హిందూ కాలేజీ సెంటర్లోని పశ్చిమ గురుమండలం (వెస్ట్ పారిస్) చర్చిలో క్రీస్తు సందేశం ఇస్తున్న పాస్టర్ గనుపల్లి సతీష్ బాబు, ప్రార్థనలో పాల్గొన్న మహిళలు



గుంటూరులోని డాన్ బోస్కోలో క్యాండిల్స్ వెలిగిస్తున్న యువతులు

ఇనుమడించిన అమరావతి గౌరవం

● ఎమ్మెల్యే గళ్ళా మాధవి
● అమరావతికి భారీగా తమ్ముళ్లు

గుంటూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ ప్రధాని, రాజకీయ అజాత శత్రువు అటల్ బిహారీ వాజపేయ్ విగ్రహావిష్కరణ ద్వారా రాజధాని అమరావతి గౌరవం మరింత ఇనుమడించిందని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. అమరావతిలో వాజ్‌పేయి కాంస్య విగ్రహావిష్కరణకు గురువారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే మాధవి ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో కూటమి నేతలు, కార్యకర్తలు తరలి వెళ్లారు. గుంటూరు లాడ్జి సెంటర్లోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, ఎన్డీయే కూటమి నేతలతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అమరావతికి బయలుదేరిన బస్సులు, ద్విచక్ర వాహనాలు, ఆటోలకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ అటల్ బిహారీ వాజ్‌పేయి దేశానికి 'గుడ్ గవర్నెన్స్' అనే భావనను అందించిన గొప్ప దార్శనిక నాయకుడని తెలిపారు. ప్రధానిగా మాత్రమే కాకుండా సామాజిక సంస్కర్తగా, రచయితగా, భారతరత్నగా భారతదేశానికి ఆయన అందించిన సేవలు ఎప్పటికీ మరచిపోలేనివని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.



జెండా ఊపి ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి



రాఫ్ట్ ఫౌండేషన్ వద్ద పూజ చేస్తున్న మంత్రి నారాయణ

ఐకానిక్ హైకోర్టు నిర్మాణం ప్రారంభం

● రాఫ్ట్ ఫౌండేషన్‌కు సిమెంటు వేసిన మంత్రి నారాయణ

తుళ్లూరు/గుంటూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాజధాని నిర్మాణంలో మరో ముందడుగు పడింది. రాజధానికే తలమానికమైన, ఐకానిక్ భవన సముదాయాల్లో అత్యంత కీలకమైన శాశ్వత హైకోర్టు నిర్మాణ పనులను గురువారం సాయంత్రం మంత్రి నారాయణ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మాణ సంస్థ ప్రతినిధులతో కలిసి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. హైకోర్టు నిర్మాణాన్ని జీ+7 అంతస్థుల్లో చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. మొత్తం 21 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 52 కోర్టు హాళ్లు ఉండేలా నార్మన్ ఫోస్టర్స్ అండ్ పార్టనర్స్ ఇచ్చిన డిజైన్‌తో హైకోర్టు నిర్మాణం జరుగుతోందని తెలిపారు. 2, 4, 6 అంతస్థుల్లో కోర్టు హాళ్లు ఉంటాయని, 8వ అంతస్తుల్లో ప్రధాన న్యాయమూర్తి కోర్టు ఉంటుందని చెప్పారు. హైకోర్టు నిర్మాణానికి 45వేల టన్నుల స్టీల్‌ను వాడుతున్నామని, 2027 చివరి నాటికి నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వం చేసిన అవకతవకల కారణంగా అమరావతి పనులు ఆలస్యమయ్యాయని, ఇకపై ఎలాంటి ఆటంకాలు లేకుండా పనులు జరుగుతాయని నారాయణ స్పష్టం చేశారు.

రామునిగా వేంకటేశ్వరస్వామి కనువిందు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక గోరంట్ల అన్నపూర్ణ నగర్‌లో పద్మావతి, అండాళ్ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో దశావతార కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం రామవతారంలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణోత్సవాన్ని ఆలయ అర్చకులు వైభవంగా జరిపారు. ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమాల్ని ఆలయ కమిటీ చైర్మన్ కంచర్ల ఆంజనేయులు, ప్రెసిడెంట్ ఎర్రంశెట్టి వేణుగోపాల్ తదితరులు పర్యవేక్షించారు.

రాజనీతిజ్ఞుడు వాజ్‌పేయి...

గుంటూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): భారతదేశ రాజకీయ యవనికపై తనదైన ముద్ర వేసుకున్న గొప్ప అరుదైన రాజనీతిజ్ఞుడు అటల్ బిహారి వాజ్‌పేయి అని సీనియర్ అధ్యాపకుడు సుబ్బారెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం భారతరత్న వాజ్‌పేయి జయంతి కార్యక్రమం జరిగింది. వాజ్‌పేయి అధికారం కంటే నైతికత మిన్నగా భావించిన అరుదైన రాజకీయ నాయకుడని, అంతకంటే గొప్ప దేశ భక్తుడన్నారు. కార్యక్రమంలో అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, విద్యావేత్త చంద్రయ్య, న్యాయవాది హరి, జయకుమార్ తదితరులున్నారు.



వాజ్‌పేయి విగ్రహానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ తదితరులు

దార్శనిక నేత వాజ్‌పేయి

● డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్

గుంటూరు (తూర్పు), డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాజకీయల్లో విలువలు, సిద్ధాంతాలకు ప్రాణం పోసిన మహానాయకుడు వాజ్‌పేయి అని బీజేపీ నాయకుడు డాక్టర్ శనక్కాయాల ఉమాశంకర్ అన్నారు. గురువారం నగరంలో జరిగిన మాజీ ప్రధాని వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వాజ్‌పేయి విగ్రహానికి నివాళులర్పించి, ప్రజలకు ఆల్పాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉమాశంకర్ మాట్లాడుతూ, వాజ్‌పేయి దేశ రాజకీయాల్లో ఒక యుగపురుషుడిగా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. ఆయన ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. తొలుత వెంకటపాలెంలో జరిగిన వాజ్‌పేయి విగ్రహావిష్కరణకు కార్యకర్తలు ఏర్పాటు చేసిన బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం రాజధానిలో జరిగిన సభలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

క్రీస్తు సందేశం అనుసరణీయం



కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలి, నాయకులు

గుంటూరు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఏసు క్రీస్తు జీవితం మానవజాతికి గొప్ప మార్గమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా వసంతరాయపురంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీస్తు మానవజాతికి గొప్ప సందేశాన్ని అందించారని చెప్పారు. శత్రువులను సైతం ప్రేమతో చూడాలని క్రీస్తు బోధించారని గుర్తు చేశారు. ఏసుక్రీస్తు బోధనలు సర్వమానవాళికి మార్గదర్శకమని అన్నారు. నేటి సమాజంలో ఆ విలువలు ఎంతో అవసరమని చెప్పారు. ప్రతి ఒక్కరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

● గుంటూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సమాజంలో తోటి వారి పట్ల కరుణ, దయ, జాలి, ప్రేమ చూపాలన్న ఏసు క్రీస్తు సందేశం ప్రపంచ మానవాళికి అనుసరణీయమని మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి పేర్కొన్నారు. క్రిస్మస్‌ను పురస్కరించుకొని పొన్నూరు రోడ్డులోని కార్యాలయంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మానవాళికి శాంతి కావాలంటే క్రీస్తు చూపిన బాటలో పయనించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మోషే, బుజ్జి, భాగ్యరాజు, రత్తయ్య, జానీ, రెహమాన్ తదితరులున్నారు.



క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

రెండోరోజు టీటీడీ భజన బృందాల నైపుణ్య పరిశీలన



శ్రీ హరి సంకీర్తనలను ఆలపిస్తున్న భజన బృందాల సభ్యులు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరుమల, తిరుపతి దేవస్థానం (టీటీడీ), హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న భజన బృందాల నైపుణ్య పరిశీలన కార్యక్రమం గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా టీటీడీ జిల్లా సమన్వయ కర్త అమ్మడు మాట్లాడుతూ, తిరుమల స్వామి వారి సన్నిధానంలో అఖండ హరి నామ సంకీర్తన చేసేందుకు ఈ పరిశీలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్ట్‌గా గుంటూరులో జిల్లాలో ప్రారంభించారని అన్నారు. అందులో భాగంగా బుధవారం 32, గురువారం 30 భజన బృందాల నైపుణ్య పరిశీలన చేసి తగు సూచనలు అందించినట్టు పేర్కొన్నారు. 24న ప్రారంభమైన ఈ కార్యక్రమం ఈ నెల 27వ తేదీ వరకు జరుగుతుందన్నారు. గుంటూరు జిల్లా నుంచి దాదాపు 126 భజన బృందాలకు సంబంధించిన 600 మంది సభ్యులు పాల్గొంటున్నట్టు చెప్పారు. వారికి ఉచిత భోజన సదుపాయం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పరిశీలనలో విజేతలు, పరాజితులు ఉండరని, కీర్తనల ఆలాపనలో జరిగే లోటుపాట్లను న్యాయనిర్ణేతలు తగు సూచనలిస్తారని తెలిపారు. గుంటూరు, కృష్ణ, తూర్పు, పశ్చిమ గోదావరి, వైజాగ్, విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం ఉమ్మడి జిల్లాల హిందూ ధర్మ ప్రచార పర్యవేక్షకులు క్రాంతికుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పరిశీలనలకు న్యాయ నిర్ణేతలుగా ప్రభాకరరావు, సుబ్బరాయమ్మ, నాగభూషణం వ్యవహరిస్తున్నారని అమ్మడు తెలిపారు.

రామునిగా వేంకటేశ్వరస్వామి కనువిందు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక గోరంట్ల అన్నపూర్ణ నగర్‌లో పద్మావతి, అండాళ్ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో దశావతార కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం రామవతారంలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణోత్సవాన్ని ఆలయ అర్చకులు వైభవంగా జరిపారు. ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమాల్ని ఆలయ కమిటీ చైర్మన్ కంచర్ల ఆంజనేయులు, ప్రెసిడెంట్ ఎర్రంశెట్టి వేణుగోపాల్ తదితరులు పర్యవేక్షించారు.

రాజనీతిజ్ఞుడు వాజ్‌పేయి

● అధ్యాపకుడు సుబ్బారెడ్డి

గుంటూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): భారత దేశ రాజకీయ యవనికపై తనదైన ముద్ర వేసుకున్న గొప్ప అరుదైన రాజనీతిజ్ఞుడు అటల్ బిహారి వాజ్‌పేయి అని సీనియర్ అధ్యాపకుడు సుబ్బారెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం భారతరత్న వాజ్‌పేయి జయంతి కార్యక్రమం జరిగింది. వాజ్‌పేయి అధికారం కంటే నైతికత మిన్నగా భావించిన అరుదైన రాజకీయ నాయకుడని, అంతకంటే గొప్ప దేశభక్తుడన్నారు. కార్యక్రమంలో అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, విద్యావేత్త చంద్రయ్య, న్యాయవాది హరి, జయకుమార్ తదితరులున్నారు.

ప్రతి గురువారం అన్నగారికి నివాళులు

● దివంగత ఎన్టీఆర్‌కు బృహత్తర కార్యక్రమం
● 25 ఏళ్లుగా నిర్విఘ్నంగా నిర్వహిస్తున్న ఎన్టీఆర్ కల్చరల్ అసోసియేషన్



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పిస్తున్న ఎన్టీఆర్ కల్చరల్ అసోసియేషన్-రైలుపేట సభ్యులు

గుంటూరు (తూర్పు), డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ కల్చరల్ అసోసియేషన్ రైలుపేట వారు 25 ఏళ్ల నుంచి ఈ ఓ బృహత్తర కార్యక్రమాన్ని నేటికి కొనసాగిస్తున్నారు. ఎన్టీఆర్‌పై అభిమానంతో గుంటూరులో 1969లో కొంత మంది అభిమానులు ఈ సంస్థను స్థాపించారు. అప్పట్లో దీనిని ఎన్టీఆరే స్వయంగా ప్రారంభించడం విశేషం. ఆయన పేరుతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అయితే 1996లో ఆయన మరణాన్ని ఆ సంస్థ సభ్యులు తట్టుకోలేకపోయారు. నేటికి ఆ బాధలో నుంచి తేరుకోలేకపోయారు. ఎన్టీఆర్ జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆయన చనిపోయిన గురువారం రోజును మర్చిపోకుండా ప్రతి వారం ఆ రోజున మహనీయునికి ఘనంగా నివాళులర్పిస్తున్నారు. ఈ మహత్తర కార్యక్రమం 25 ఏళ్లు పూర్తిచేసుకుంది. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు ఎన్టీఆర్‌కు పూల వర్షాన్ని కురిపించే కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఆర్ సత్యనారాయణ మాట్లాడుతూ, ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి సభ్యులు ప్రతి గురువారం నివాళులర్పిస్తారని చెప్పారు. 1300 వారాల నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కరోనా సమయంలోనూ దీనిని కొనసాగించామని చెప్పారు. అనంతరం అధ్యక్షుడు మల్లికార్జునరావు మాట్లాడుతూ, శంకర్‌విలాస్ బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా ఏసీ కళాశాల ఎదురుగా ఉన్న ఎన్టీఆర్ బస్టాండ్‌ను కూల్చివేశారని, బ్రిడ్జి నిర్మాణం పూర్తయిన తర్వాత దానిని పునర్నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఆంజనేయులు, కె.సాంబయ్య, చెరువూరి సాంబయ్య, డి శివప్రసాదు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ వద్దు బ్రో....

● అవగాహన కార్యక్రమంలో డీఎస్పీ భానోదయ



అడవితక్కెళ్ళపాడు టిడ్కో ఇళ్ళ వద్ద క్యాండిల్స్ ర్యాలీలో పాల్గొన్న సౌత్ డీఎస్పీ భానోదయ

గుంటూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సౌత్ డీఎస్పీ భానోదయ గంజాయి, డ్రగ్స్‌కు హాట్ స్పాట్ అయిన అడవితక్కెళ్ళపాడు టిడ్కో ఇళ్ళపై గురిపెట్టారు. దీనిలో భాగంగా గురువారం డీఎస్పీ ఆధ్వర్యంలో టిడ్కో ఇళ్ళ వద్ద అవగాహన సదస్సు నిర్వహించారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల ఎదురయ్యే దుష్పరిణామాల గురించి వివరించారు. అనంతరం వారితో కలసి క్యాండిల్స్ ర్యాలీ నిర్వహించారు. ఎవరైనా ఇక్కడ గంజాయి, డ్రగ్స్ వినియోగిస్తున్నా, విక్రయిస్తున్నా, డ్రగ్స్‌కు బానిసలైన తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, నల్లపాడు పోలీసులు పాల్గొన్నారు.

అంజుమనే ఆస్తుల పరిరక్షణకు కార్యాచరణ

● ముస్లిం మైనార్టీ నాయకులతో త్వరలో జేఏసీ

గుంటూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలో అంజుమన్ ఇ ఇస్లామియా సంస్థ ఆస్తుల పరిరక్షణకు కార్యాచరణను సిద్ధం చేస్తున్నట్లు వైసీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ నూరిఫాతిమా, రాష్ట్ర కార్యదర్శి గులాం రసూల్ తెలిపారు. బస్టాండ్ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో గురువారం ముస్లిం మైనార్టీ సంఘాల నాయకులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. అంజుమన్ ఆస్తులను అన్యాక్రాంతం చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ముస్లింలకు సంబంధించిన అంజుమన్ ఆస్తుల పరిరక్షణ కోసం త్వరలో జేఏసీగా ఏర్పడేందుకు నిర్ణయించినట్లు గులాం రసూల్ ప్రకటించారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందించటంతో పాటు, అవసరమైతే న్యాయపోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, ముస్లిం మైనార్టీ నాయకులు, న్యాయవాదులు ఉన్నారు.



ముస్లిం మైనార్టీ నాయకులతో సమావేశమైన నూరిఫాతిమా, గులాం రసూల్ తదితరులు

గుర్తు తెలియని మహిళ అనుమానాస్పద మృతి

గుంటూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. మృతురాలి వివరాలు తెలిస్తే నగరంపాలెం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌కు 86888 31336 నంబరులో తెలియపరచాలని పోలీసులు కోరారు.



గుర్తు తెలియని మహిళ మృతదేహం

బీ ఫార్మసీ విద్యార్థి అదృశ్యం

గుంటూరు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లాకు చెందిన వింజం వరుణ్ సాయి (24) అనే యువకుడు అదృశ్యమయ్యాడు. నగరంలోని వసంతరాయపురంలో తన తల్లితో అద్దె ఇంటిలో నివాసం ఉంటూ లాం గ్రామంలోని చలపతి కాలేజీలో బీ ఫార్మసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కొన్ని రోజులుగా కాలేజీకి సక్రమంగా వెళ్ళటం లేదని అతని తల్లి మందలించింది. దీంతో గురువారం ఇంటి నుంచి ఎవరికి చెప్పకుండా వెళ్ళిపోయాడు. అతని తల్లి ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అదృశ్యమైన వరుణ్‌సాయి

యువతిని వేధిస్తున్న కానిస్టేబుల్‌పై కేసు

గుంటూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఓ యువతిని వేధింపులకు గురిచేస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై గురువారం అరండల్‌పేట పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలానికి చెందిన ఓ యువతి బ్రాడిపేటలోని ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ ఓ చిరుద్యోగం చేస్తోంది. పల్నాడు జిల్లా నాదెండ్ల మండలానికి చెందిన కత్తి శ్రీను గుంటూరు ఈస్ట్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. తనకు పెళ్లి కాలేదని మాయ మాటలు చెప్పి మూడేళ్లుగా యువతితో పరిచయం పెంచుకున్నాడు. కాని అతనికి ఇప్పటికే పెళ్లయి పిల్లలున్నట్లు తెలుసుకున్న సదరు యువతి అతనికి దూరంగా ఉండటానికి ప్రయత్నించింది. అయితే శ్రీను తనతో ఉండమని ఆమె వెంట పడుతూ, హాస్టల్ వద్దకొచ్చి గొడవపడుతూ శారీరకంగా వేధిస్తున్నాడు. గురువారం హాస్టల్ వద్దకు వచ్చి యువతితో గొడవ పడి, దాడి చేసి కొట్టి గాయపరిచి చంపుతానని బెదిరించాడు. యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అరండల్‌పేట పోలీసులు తెలిపారు.



30న వైకుంఠ ఏకాదశి

ఆ దర్శనం... ఒక విజ్ఞాన విశేషం

ఎన్నో కోట్ల విలువైన భవనాలు, ఎంతో వ్యయం చేసి చదువుకొన్న ఉద్యోగులు, ఎన్నెన్నో లక్షల ఖరీదైన పరికరాలు, ఇతర సర్వ సౌకర్యాలు ఏర్పాటయ్యాక మాత్రమే పరిశోధనలు జరుగుతున్నాయి. ఇవన్నీ భౌతిక పరిశోధనలు మాత్రమే. ఇవన్నీ పాశ్చాత్య దేశాల పద్ధతుల ప్రకారం జరిగేవే. మన భారతీయ ఋషులు కేవలం చెట్ల కింద కూర్చొని... చలిని, వానను, ఎండను లెక్క చేయకుండా, ఏ సౌకర్యాలను ఆపేక్షించకుండా... కేవలం మౌన ధ్యానం (తపస్సు) ద్వారా ఖగోళాన్నీ, అక్కడి సర్వ రహస్యాలను గ్రహించగలిగారు. దాన్నంతటినీ దైవానుగ్రహంగానే భావించారు. అలా కనుక్కున్న యదార్థ విజ్ఞాన విశేషాల్లో ఒకటి... ఉత్తర (వైకుంఠ) ద్వార దర్శనం.

ఒక్క మాట చెప్పకపోతే నాటికీ, నేటికీ భేదం అర్థం కాదు. ఇప్పుడు ఎక్స్‌రే యంత్రం ముందు నిలబడి ఫొటో తీయించుకుంటే ఎముకలు, కండరాలు లాంటి భౌతికమైనవే కనిపిస్తాయి. అదే మహర్షుల దృష్టితో చూస్తే... శరీరంలో దాగి ఉన్న 72 వేల నాడులు, షట్ (ఆరు) చక్రాలు, చక్రాలకు ఉన్న ముడులు (గ్రంథులు)... ఇలా ఎన్నెన్నో కనిపిస్తాయి. అలా పైకి కనిపించడానికి వీల్లేని, కనిపించని రెండు రంధ్రాలు మన శరీరంలో దాగి ఉన్నాయి. ఒకటి... కనుబొమల మధ్య దాగి ఉన్న ఆజ్ఞాచక్రం, రెండోది... శిరస్సు మధ్య భాగంలో దాగి ఉన్న బ్రహ్మరంధ్రం. ఈ సంగతి ఎలాంటి చదువూ లేని అమ్మమ్మలకు స్పష్టంగా తెలుసు. అందుకే ప్రతి పండుగ రోజునా అమ్మ ద్వారా బ్రహ్మరంధ్రానికి నువ్వుల నూనె పెట్టించి, మర్దన చేయించి, అక్షతలు వేసి ఆశీర్వదించేవారు. అంతేకాదు, వివాహకాలంలో జీలకర్ర బెల్లపు మిశ్రమాన్ని పెట్టే గొప్ప స్థానంగా కూడా దాన్ని మన సంస్కృతి పరిచయం చేసింది. అదే తీరులో వివాహ సమయంలో నూతన వధూవరులు దర్శించుకోవలసిన స్థానం కూడా పరస్పర భ్రూమధ్యాలు (కనుబొమల మధ్య ప్రదేశాలు) అని కూడా తెలియజేసింది. మన శరీరంలో కనిపించని రెండు ప్రదేశాల్లో ఒకటైన బ్రహ్మరంధ్రాన్ని గురించి తెలియజేసే ఏకాదశే... ఉత్తర ద్వార దర్శన ముక్కోటి (వైకుంఠ) ఏకాదశి.

ఆ ద్వారం తెరిస్తే...

'ఉత్'... ఎత్తులో, 'తర'... మరింతది... ఉత్తరం. శరీరంలో ఎత్తుగా ఉన్నది, గట్టితనంతో ఉండేది శిరస్సు. ఆ ఉత్తరంలో ఉన్న శిరస్సులో మరో కనిపించనిది కూడా ఉంది. అదే ద్వారం. 'ద్వి'... రెండైన, 'అర'... తలుపులు ఉన్న ప్రదేశం. ఒకప్పటి రోజుల్లో ఒక రెక్క (తలుపు) ఉన్న ద్వారాలు ఉండేవి కావు. మనలో రెండు రెక్కలు ఉన్న ద్వారం ఒకటి ఉంది... శిరస్సులోని బ్రహ్మరంధ్రంలో. ఎక్కడైనా అతి ముఖ్యము, ప్రధానము అయిన వస్తువు ఉన్నప్పుడే కదా... ద్వారాన్ని ఏర్పరిచి భద్రత కల్పిస్తాం. ఆలయంలో రెండు అరలనూ (తలుపులను) తెరిచి చూస్తే దానిలో మనకు ఇష్టమైన దైవం కనిపిస్తాడు. అలాగే ఈ శరీరపు ఉత్తర భాగమైన బ్రహ్మరంధ్రంలోని తలుపులను తెరిచి ఏ దైవాన్ని దర్శించే వీలు పొందగలమో... ఆ విశేషాన్ని చెప్పేది, చెప్పి ప్రతి వ్యక్తికీ అనుభవైకంగా అర్థమయ్యేలా వివరించేది ఉత్తర ద్వార దర్శనం.

ఆ దిగులు అవసరం లేదు...

దేవాలయాల్లో ఉత్తరం వైపు నుంచి దైవాన్ని చూపిస్తూ ఆ దర్శనాన్ని 'ఉత్తర ద్వార దర్శనం' అని చెప్పారు. దీనికి కారణం... అంతకన్నా వివరించే మార్గం మరొకటి లేదు కాబట్టి. ఆ రోజున దైవాన్ని అలా దర్శించలేనివారు దిగులు పడనక్కరలేదని భగవద్గీత సవివరంగా చెప్పింది.

సమకాయ శిరోగ్రీవం ధారయన్నచలం స్థిరః
సంప్రేక్ష నాసికాగ్రం స్వం దిశశ్చానవలోకయన్

ఎవరి ఇంట్లో వాళ్ళు తూర్పు దిక్కుగా నేల మీద బాసింపట్టు వేసుకొని కూర్చోవాలి. శరీరపు వెన్నెముకను, మెడను, తలను ఒకే లంబాకారంలో ఉంచి నిటారుగా కూర్చోవాలి. శరీరం కదలకుండా, మనసు ఎటూ పోకుండా కట్టడి చేసుకోవాలి. దృష్టిని పైకి నిలిపి, ఆ దైవం మన శిరస్సులోనే ఉన్నాడని విశ్వసిస్తూ, మెల్లగా బ్రహ్మరంధ్రాన్ని, దాని రెండు తలుపులను తెరుస్తున్నట్టు భావించుకోవాలి. ఆ లోపల ఎవరికి ఇష్టమైన దైవాన్ని వారు అంతరంగంలో నిలుపుకొని, ఆయనకు చెందిన స్తోత్రాలను, మంత్రాలను, పద్యాలను, పాటలను, కీర్తలను... ఇలా ఎవరికి ఏది వస్తే వాటిని మౌనంగా పఠించుకుంటూ, మనస్సు నిలబడినంతసేపు అంతరాల్లో దైవాన్ని దర్శించుకోవాలి. దేవాలయాల్లో రద్దీ, అరుపులు, కేకల మధ్య ఏకాగ్రత కుదరడం కష్టం. కాబట్టి మన ఇంట్లోనే మనం ఇలా చేసుకోగలిగితే ఎంతో ఆనందంగా ఉంటుంది. నిర్మలంగా, ఏకాంతంగా, ప్రశాంతంగా... ఇలా ఉత్తర ద్వార దర్శన అనుభవాన్ని పొందండి. ఆలయంలో ఏడాదికి పది రోజులు మాత్రమే ఈ దర్శనం. కానీ ఇంట్లో మనం ఎన్నిసార్లు కావాలంటే అన్నిసార్లు దర్శించుకోవచ్చు.

• డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు
9866700425

అన్ని ధర్మాలలో శ్రేష్ఠం

కృతయుగంలో తపస్సును, త్రేతాయుగంలో జ్ఞానాన్ని, ద్వాపరయుగంలో యజ్ఞాన్ని, కలియుగంలో దానాన్ని పరమధర్మాలుగా పూర్వులు నిర్ణయించారు. కలియుగంలో ఎల్లప్పుడూ దానధర్మాలు చేస్తూ ఉండవలసిందే. అందులోనూ ఆకలిని తీర్చడం, నిత్యనియమంగా అన్నదానం చేయడం కర్మలలో ముఖ్యమైన కర్మ. మధ్యాహ్నం పన్నెండు కాగానే... అన్నం తినకపోతే ప్రాణం ఆందోళన పడుతుంది. మనలాగే ఇతరులు కూడా అని తెలుసుకొనేవారు గొప్పవారు.



దానితోనే పరిపూర్ణం

ధర్మాలన్నిటిలో అన్నదానం ప్రథమ స్థానంలో ఉంటుంది. దానికన్నా శ్రేష్ఠమైనది మరొకటి లేదని శాస్త్రాలు చెబుతున్నాయి. అన్నం పరబ్రహ్మ స్వరూపం. అన్నం నుంచే ప్రాణులు ఉత్పన్నమవుతాయి. ప్రాణులను జీవింపజేసేది అన్నమే. అతిథులు ఏ సమయంలో వచ్చినా అన్నం పెట్టాలి. అతిథుల్ని సంతృప్తిపరచడం మన సంప్రదాయం, మన సంస్కృతి, మన ఆచారం. అతిథులను, అభ్యాగతులను ఆకలితో వెనక్కు పంపిస్తే దుర్గతిని ఆహ్వానించినట్టే. దుస్తులు, వస్తువుల దానంలో యోగ్యతను చూడవచ్చు కానీ... అన్నదానంలో పాత్రతను ఎంచవలసిన అవసరం లేదు. ఎవరు ఎప్పుడు గుమ్మంలోకి వచ్చినా.... వారికి అన్నం పెట్టకుండా నిరాదరణ చేయడం మంచిది కాదు. ఎన్ని దానాలు చేసినా అన్నదానం చేయకపోతే అది పరిపూర్ణం కాదన్నారు పూర్వులు. అలాగే ఎవరి ఆకలి ముందుగా తీర్చాలనేది కూడా నిర్దేశించారు. అనారోగ్యంతో, వైకల్యంతో, బలహీనంగా ఉన్నవారికి, అభ్యాగతులకు ముందుగా ఆహారం అందించాలి. ఆ తరువాతే ఆప్తులకు, బంధుమిత్రులకు భోజనాలు వడ్డించాలి. అందరికీ తృప్తిగా భోజనం పెట్టి పంపించడం మన సంప్రదాయంలో ప్రధానమైన అంశం. ఆలయాలలో నిర్వహించే అన్నప్రసాద వితరణ లక్ష్యం కూడా అదే. అన్నదానానికి విశిష్టతలు ఉన్నాయి. వాటిలో ఆధ్యాత్మిక చింతన కూడా ప్రబలంగా ఉంది.

• ఈతకోట సుబ్బారావు,
9440529785

కొత్తగా చిగురిద్దాం

మనసులో మార్పే కొత్తదనానికి ఊపిరి. కాలానికి అధిపతి ఆ ప్రభువే. అనంతమైన కాలాన్ని నియంత్రించే ఆయనను మన ఆలోచనల్లో... ముందు నిలుపుకొని, ఆయన అడుగుజాడల్లో బతుకు ప్రయాణం మొదలుపెడితే... అది శాంతంగా, ప్రశాంతంగా మనం అనుకున్న గమ్యానికి చేర్చుతుంది. దేవుణ్ణి ప్రేమించేవారు అందరినీ ప్రేమించగలుగుతారు. మానవుడికన్నా దేవుడు అత్యున్నతుడు. కానీ ఆయనకు మానవుడు అంటేనే ఇష్టం. అందుకే... తనకన్నా ఎక్కువగా మానవులను ప్రేమించేవారి చుట్టూ ఆయన తిరుగుతూ ఉంటాడు.

రోజుకో సద్గుణం

త్వరలో కొత్త ఏడాదిలో అడుగు పెడుతున్నాం. మనలో నూతన భావాలు కార్యరూపం దాలిస్తే తప్ప... కొత్త సంవత్సరం వాస్తవంగా మొదలైనట్టు కాదు. మన చిన్నప్పుడు మన తల్లిదండ్రులు తమ ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నప్పటికీ... పండుగ సమయాల్లో తమ కష్టార్జితంతో కొత్త దుస్తులు కుట్టించేవారు. వాటిని చూసి తెగ మురిసిపోయేవాళ్ళం. పాత దుస్తులను, మాసిన వస్త్రాలను ససేమిరా ఇష్టపడేవాళ్ళం



కాదు. తల్లిదండ్రుల మాదిరిగానే దేవుడు కూడా కొత్త వరాలు, కొత్త వెలుగులు, నూతనమైన ఆలోచనలు, నూతన అవకాశాలు ప్రతి మనిషికీ అందిస్తున్నాడు. కానీ వాటిని మనం పట్టించుకోవడం లేదు. 365 రోజులు గడిచినంతమాత్రాన... కొత్తదనాన్ని ఆహ్వానించకపోతే... కొత్త ఏడాదిలో మార్పు తనంతట తానే మన జీవితాలలోకి వచ్చేస్తుందా? సర్వ సద్గుణ నిలయుడైన దేవుణ్ణి కేంద్రంగా నిలుపుకొని... రోజుకు ఒక సద్గుణాన్ని అలవరచుకోవాలి. కొత్త ఆలోచన, కొత్త ప్రవర్తన కలిగినప్పుడే జీవితం అర్థవంతంగా మారుతుంది.

సేవలో ప్రతిఫలించాలి


మనలో మార్పు లేనప్పుడు కొత్త సంవత్సరం జీవంలేని శరీరంలాంటిదే అవుతుంది. "అరణ్యాల్లో దేవుడు కొత్త దారులు చూపి నడిపిస్తున్నాడు. ఎడారిలో నదులను పుట్టించి ప్రవహింపజేస్తున్నాడు. వృక్షాలను కొత్తగా మొలకెత్తిస్తున్నాడు. ఇది గమనించగలరో, లేదో?" అని బైబిల్ ప్రశ్నిస్తోంది. గడచిన రోజుల్లో తప్పులు చేసి ఉండవచ్చు. కానీ దానికి కుంగిపోవడం వల్ల సమస్య తీరిపోదు. కోలుకోవాలి, మేలుకోవాలి. తప్పులు సరిదిద్దుకోవాలి. కొత్తగా చిగురించాలని పరితపించాలి. కొత్తగా జీవించడానికి ప్రయత్నించాలి. దేవుణ్ణి ఆరాధించాలి. ఆ ఆరాధన సాటి మనిషికి చేసే సేవలో ప్రతిఫలించాలి. బైబిల్‌లో ఎన్నో నీతులు కనిపిస్తాయి. వాటిలో ఒక్కటైనా పాటించలేమా? మన ప్రవర్తన బైబిల్ వాక్యానికి నిర్వచనంలా, వ్యాఖ్యానంలా సాగాలి. లేకపోతే ఎండమావుల దగ్గర తడిఆరిపోయిన గొంతుతో అరవడానికి కూడా శక్తిలేనివారిలా అయిపోతాం. కాబట్టి రాబోయే సంవత్సరమంతా ఏసుతో కలిసి పయనించాలని సంకల్పించుకుందాం.

• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్, 9866755024

సైన్స్, ఆధ్యాత్మికత

సైన్స్- ఆధ్యాత్మికత ఈ రెండింటి మధ్య ఎలాంటి సంబంధం ఉంది? కొన్ని శతాబ్దాలుగా ఈ ప్రశ్నపై చర్చ జరుగుతూనే ఉంది. చాలామంది ఈ రెండూ పూర్తి విరుద్ధమైన భావనలని అనుకుంటూ ఉంటారు. ఈ భావనలకు మద్దతు ఇచ్చే వారి మధ్య వాడి వేడి చర్చలు జరగడం కూడా మనం అప్పుడప్పుడు చూస్తూ ఉంటాం. ఒక కార్డియాలజిస్ట్‌గా- గుండె పనితీరు, శరీరంలోని వివిధ భాగాలతో దానికి ఉన్న సంక్లిష్టమైన సంబంధం గురించి నాకు తెలుసు. అదే సమయంలో 'హార్ట్‌ఫుల్‌నెస్' అభ్యాసిగా మానవ గమనంలో ఆధ్యాత్మిక ప్రయాణం ఎలా సాగుతుందో కూడా తెలుసు.

మన చుట్టూ ఉన్న ప్రకృతి గురించి, దాని వెనకున్న లాజిక్ గురించి తెలుసుకోవడానికి సైన్స్ ప్రయత్నిస్తుంది. ఆ లాజిక్ ఆధారంగా కొన్ని సిద్ధాంతాలను ప్రతిపాదిస్తుంది. ఆ సిద్ధాంతాలు అందరి విషయంలోనూ నిజమైనప్పుడే మాత్రమే వాటిని సైన్స్ గుర్తిస్తుంది. అయితే ప్రముఖ శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ అన్నట్లు- "లాజిక్ మనల్ని 'ఏ' నుంచి 'బి' వరకూ తీసుకువెళుతుంది. కానీ మనలోని ఊహ... ప్రపంచంలో ఎక్కడికైనా తీసుకువెళ్తుంది". ఆకాశంలో పక్షులు ఎగురుతున్నప్పుడు- అవి ఎలా ఎగురుతున్నాయో తెలుసుకోవడం ద్వారా మానవుడు విమానాలు కనిపెట్టగలిగాడు. అంటే పక్షులు ఎలా ఎగరగలుగుతున్నాయో తెలుసుకోవడం సైన్స్. దీని వెనుక పరిశీలన ఉంది. ఊహ శక్తి ఉంది.. ఆ పనిని పక్షులు పదే పదే చేస్తున్నాయి కాబట్టి మనం కూడా చేయవచ్చనే ఆశావాహ థక్పథం ఉంది.



ప్రధాన వైరుధ్యం అదే...

వీటన్నింటిలోను ముఖ్యమైనది పరిశీలన. సైన్స్ ఈ పరిశీలన నుంచే పుడుతుంది. అక్కడే ఆగిపోతుంది. ఈ పరిశీలన మన ఇంద్రియాల వల్ల జరుగుతుంది. ఇప్పుడు ఆధ్యాత్మికతను కూడా ఈ దృష్టి నుంచే పరిశీలిద్దాం. మనమందరం ఏదో ఒక మతంలో పుట్టి ఉంటాం. ఆ మతానికి చెందిన ఆచార వ్యవహారాలను పాటిస్తూ ఉంటాం. అయితే సైన్స్ కోణం నుంచి చూసినప్పుడు - చాలా ఆచార వ్యవహారాలను పాటించడానికి వెనుక ఉన్న కారణాలు మనకు తెలీదు. వాటి వల్ల ఎలాంటి ఫలితాలు వస్తాయో కూడా తెలీదు. సైన్స్‌కు, ఆధ్యాత్మికతకు వచ్చే ప్రధానమైన వైరుధ్యం ఇదే! దీని వల్లే చాలామంది సైన్స్, ఆధ్యాత్మికతల మధ్య తేడా ఉందనుకుంటారు. అవి వేరు వేరనే భావన కలుగుతుంది.

రెండూ ముఖ్యమే...

నాకు కూడా గతంలో ఈ తరహా ఆలోచనలే ఉండేవి. నేను మా మాస్టర్, 'హార్ట్‌ఫుల్‌నెస్' గ్లోబల్ గైడ్ కమలేష్ జి. పాటిల్‌ను కలిసినప్పుడు- ధ్యానం ద్వారా ఆధ్యాత్మికత అనేది ఒక సైన్స్ ప్రయోగం లాంటిదని ఆయన చెప్పారు. సైన్స్ ప్రయోగాలు ల్యాబ్‌లలో జరుగుతాయి. ఈ ఆధ్యాత్మిక ప్రయోగాలు మన హృదయం మీద మనకు మనం చేసుకొనేవి... అదే తేడా! ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. సైన్స్‌కు సంబంధించిన పరిశీలన పద్ధతులు, విశ్లేషణలు, పరిశోధనలను ఆధ్యాత్మికత మార్గంలో ప్రయోగించడం వల్ల ఫలితం ఉండదు. ఎందుకంటే బాహ్య ప్రపంచంలో మన చుట్టూ జరిగే క్రియలను మన ఇంద్రియాలు పసిగడుతూ ఉంటాయి. అదే ఒక వ్యక్తి అంతర్ముఖుడైనప్పుడు జరిగే ప్రయాణం వేరుగా ఉంటుంది. ఈ ప్రయాణాన్ని మన ఇంద్రియాలు పూర్తిగా పసిగట్టలేవు. అది కేవలం అనుభవైకవేద్యం మాత్రమే. ఈ అంతర్ముఖ ప్రయాణం ప్రారంభమై, అది కొనసాగుతున్నప్పుడు- మనలోని సందేహాలు, అపోహలు, అనుమానాలు... అన్నీ తొలగిపోతాయి. స్పష్టత వస్తుంది. అంటే ఆధ్యాత్మికతలో ఆలోచన వల్ల పరిశీలన ప్రారంభమవుతుంది. సైన్స్‌లో పరిశీలన వల్ల లాజిక్ ఉత్తేజితమవుతుంది. ఒక వ్యక్తికి ఈ రెండూ తప్పనిసరిగా ఉండాలి. లేకపోతే తీవ్రమైన పరిణామాలు ఏర్పడతాయి. ఉదాహరణకు గ్లిజరిల్ ట్రైనైట్రేట్ (జీటీఎన్)ని హృద్రోగుల్లో నొప్పిని తగ్గించడానికి వాడతాం. కానీ దాన్ని పేలుడు పదార్థాలలో కూడా వాడతారు. దేనికి వాడాలో నిర్ధారించాల్సి వచ్చినప్పుడు లాజిక్ కన్నా అంతర్ముఖులమైనప్పుడు కలిగే స్పష్టత ముఖ్యం. అప్పుడే మానవాళికి మేలు చేసే విషయాలలో మాత్రమే దాన్ని వాడగలుగుతాం. మనకు సైన్స్, ఆధ్యాత్మికత- రెండూ ముఖ్యమే! ఆధ్యాత్మికంగా ఎదిగిన వ్యక్తి దగ్గర సైన్స్ ఉంటే... అది మానవాళికి ఎంతో ఉపయోగపడుతుంది.



డాక్టర్ శరత్‌రెడ్డి, కార్డియాలజిస్ట్, ట్రైనర్, హార్ట్‌ఫుల్‌నెస్. 9440087532

జన్మజన్మల మాతృమూర్తి

సమస్త విశ్వానికి సృష్టికర్తలు సదాశివుడు, ఆదిశక్తి. వారు ఆది దంపతులు. వారు చేపట్టిన సృష్టిలో భాగంగా మానవ ఆవిర్భావం జరిగింది. పరమాత్మ తనకు ప్రతిబింబంగా మనిషిని తయారు చేశాడు. మానవ శరీరంలో ఆత్మను, కుండలినిని అమర్చాడు. సదాశివుని చిహ్నంగా ఆత్మ హృదయ స్థానంలో, ఆదిశక్తి చిహ్నంగా కుండలిని వెన్నెముక కింది భాగంలోని త్రికోణాకారం అస్థికలో స్థిరపడ్డాయి. దాన్నే 'మూలాధారం' అన్నారు. ఆదిశంకరులు 'సౌందర్యలహరి'లో దీని గురించి ప్రస్తావించారు. ఆదిశక్తి అంశ అయిన కుండలినీ శక్తిలోనే మన గత జన్మల స్మృతులు, అనుభవాలు... నిగూఢంగా భద్రపరిచి ఉన్నాయి.



ఆత్మసాక్షాత్కారం ద్వారా...

భౌతికపరంగా చెప్పాలంటే... తల్లి గర్భంలో శిశువు రెండుమూడు నెలల పిండ దశలో ఉన్నప్పుడే... తల మాడు భాగంలో ఉన్న బ్రహ్మరంధ్రం ద్వారా పరమాత్మ శక్తి ఆ శిశువు శరీరంలోకి ప్రవేశిస్తుంది. పట్టిక ఆకారంలో ఉన్న శిరస్సులో అది పరావర్తనం చెందుతుంది. మూడు నాడులుగా, ఏడు చక్రాలుగా ఏర్పడుతుంది. మన శరీరంలో ఉన్న ప్రతి అవయవం వాటితో అనుసంధానమై ఉంటుంది. అలా ఏర్పడగా మిగిలిన శక్తి మన వెన్నెముక కింది భాగంలో... మూలాధారంగా పిలిచే త్రికోణాకార అస్థికలో నిద్రాణ స్థితిలో స్థిరపడి ఉంటుంది. అదే 'కుండలినీ శక్తి' అని వేల ఏళ్ళ క్రితమే మన శాస్త్రాలు చెప్పాయి. సదాశివుడి ఇచ్ఛాశక్తి ఆదిశక్తి. ఆదిశక్తి ఇచ్ఛాశక్తి కుండలినీ శక్తి. కుండలినిని ఉత్థానం చేయడం వల్ల హాని కలుగుతుందని కొందరు అపోహపడతారు. కానీ ఆమె జన్మజన్మలుగా మనతోనే ఉన్న మన మాతృమూర్తి. మన ఆధ్యాత్మిక ఎదుగుదల చూసి ఆమె ఆనందిస్తుంది. పరమాత్మతో మనల్ని కలపడానికి ప్రయత్నిస్తుంది. శ్రీమాతాజీ నిర్మలాదేవి ఆవిష్కరించిన సహజయోగంలో ఆత్మసాక్షాత్కారం ద్వారా... మనలో నిద్రాణంగా ఉన్న కుండలినీ శక్తి ఉత్థానం సునాయాసంగా జరుగుతుంది. అది జరిగినప్పుడు మన ఆత్మ ప్రకాశవంతమౌతుంది. ఆ కాంతిలో మనం కేవలం 'ఆత్మ స్వరూపులం' అనే సత్యాన్ని గ్రహిస్తాం. మనల్ని మనం సరిదిద్దుకోవడంతో పాటు అన్నివిధాలుగానూ పరివర్తన చెందుతాం.



మనలోని భగవంతుని సూక్ష్మ కుండలినీ శక్తిని తిరిగి జాగృతం చేసి, తద్వారా సహస్రార చక్రం ఛేదించి, బాహ్యపరంగా ఉన్న పరమాత్మ ప్రేమ శక్తి అయిన పరమ చైతన్యానికి అనుసంధానం చేయడమే ఆత్మసాక్షాత్కారం. అది పూర్వం వందల ఏళ్ళ తపస్సు చేసిన తరువాత మాత్రమే లభించేది. కానీ సహజయోగ ఆవిష్కరణతో సునాయాసంగా సాధించడం సాధ్యమవుతోంది. దీనికి కావలసిందల్లా ఆత్మసాక్షాత్కారం పొందాలనే దృఢ సంకల్పం, అచంచల విశ్వాసం, భగవంతునితో ఏకీకృతం కావాలనే పవిత్రమైన, లోతైన ఇచ్ఛ మీ హృదయంలో ఉండడమే.




డాక్టర్ పి. రాకేష్, 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ

ముత్యాల ముగ్గు



డాక్టర్ రుచిత,
బుధవారపేట, కర్నూలు

9 చుక్కలు
ఒకటి వచ్చే వరకు



మీరు ముగ్గులు బాగా వేస్తారా? అయితే చక్కటి చుక్కల ముగ్గులను కాగితంపై గీసి, రంగులు వేసి మాకు పంపండి! ఎన్ని చుక్కలు, ఎన్ని వరుసలు లాంటి వివరాలను కూడా రాయండి. మీ పేరు, మీ పూర్తి అడ్రస్, పాస్‌పోర్టు సైజు ఫొటో పంపడం తప్పనిసరి. అందమైన ముగ్గులను 'నవ్య'లో ప్రచురిస్తాం.

మా చిరునామా...
నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం, రోడ్ నం. 70, హుడా హైట్స్, జూబ్లీహిల్స్, హైదరాబాద్-33
ఈ-మెయిల్ : features@andhrajyothy.com

అర్జునుడి అసలు భయం

'భగవద్గీతలో శ్రీకృష్ణుడు ఏం చెప్పాడు?' అనే అంశానికే మనమందరం సాధారణంగా ప్రాధాన్యాన్ని ఇస్తాం. నిజానికి అర్జునుడి వేదన, అర్జునుడు వేసిన ప్రశ్నలు... ఇవి ఇంకా ముఖ్యమైనవి. రెండు సేనల మధ్య అర్జునుడు రథాన్ని ఆపేసి, శోకసముద్రుడై వేదాంతంలోకి దిగిపోవడం... చాలా సహజమైన విషయం. మనమందరం అలాంటి విషమ ఘడియలను ఎదుర్కొంటూనే ఉంటాం. అలాంటి సమయంలో ఎవరైనా సుమారుగా అలాగే ప్రతిస్పందిస్తారు.

"ధర్మం మనవైపే అనుకున్నాం. సాక్షాత్తూ కృష్ణ పరమాత్మ కూడా మనవైపే నిలబడ్డాడు. ఎప్పుడూ ఎవరి సొమ్మూ ఆశించలేదు. అడవిలోకి పొమ్మంటే పోయాం. ఎక్కడున్నామో ఎవరికీ తెలియకుండా ఏడాదిపాటు దాక్కున్నాం. అయినా జూదం షరతుల ప్రకారం వెనక్కి ఇచ్చేయవలసిన రాజ్యాన్ని "ఇవ్వం. మీకు దిక్కున్న చోట చెప్పుకోండి" అన్నారు. ద్రౌపదికి వస్త్రాలు ఊడదీసి అవమానించినా, అడవుల్లో ఉన్నప్పుడు కూడా అక్కడికి వచ్చి అవమానించే ప్రయత్నాలు చేసినా భరించి, సహించి, నోరు మూసుకొని పడి ఉన్నాం. మా మంచితనం, మా గొప్పతనం. మా శౌర్యం, ధైర్యం ప్రపంచం అంతటికీ తెలుసు. అయినా భూమి మీద ఉన్న రాజుల్లో ఎక్కువమంది దుర్యోధనుడివైపు ఉన్నారేమిటి? జరగబోయేది ప్రాణాంతకమైన మహా భీకర యుద్ధం అని తెలిసీ... ఇంతమంది దుర్యోధనుడి కోసం మామీద తలపడి ప్రాణాలు ఇవ్వడానికి సిద్ధపడ్డారా? ఏమిటా సేన... ఎవ్వరా సేనాధిపతులు... భీష్ముడు, ద్రోణుడు, కృపుడు వీళ్ళందరూ చావడానికి సిద్ధపడి యుద్ధంలోకి దిగిపోయారే!? మనవైపు కచ్చితంగా ఉండాల్సిన బలరాముడు లాంటి మహాయోధుడు "నేను యుద్ధంలో పాల్గొనను" అని కృష్ణుడంతటివాడికి చెప్పేసి తప్పుకుంటే... మమ్మల్ని ప్రాణాధికంగా ప్రేమించే భీష్మద్రోణులు మాత్రం కవచాలు తొడుక్కొని, అస్త్రశస్త్రాలతో మమ్మల్ని చంపేయడానికి సిద్ధమైపోయారే? కౌరవ సేన.ఆకాశం పగిలిందా, నేల ఈనిందా?'



అన్నట్టు సైన్య సముద్రంలా ఉంది. మనవైపు చూస్తే పిల్లనిచ్చిన ద్రుపదుడి సేన, వియ్యమందిన విరాటుని సేన, కృష్ణుడి రాజలౌక్యంలో భాగంగా మిత్రులైన జరాసంధుడి కొడుకు, శిశుపాలుడి కొడుకుల (శిశుపాల, జరాసంధులిద్దరూ కృష్ణుడివల్లే హతులైనా... ఆయన వారి కొడుకులకే పట్టం కట్టి తనవాళ్ళను చేసుకున్నాడు) సేనలూ..." అరివీర భయంకరుడైన అర్జునుడికి మొదటిసారిగా అనుమానం వచ్చింది.

"యద్వా జయేమ యది వానో జయేయుః... వారిని మనం జయిస్తామా? లేదంటే వారే మనల్ని జయిస్తారా? అని.

ఆఖరిదాకా వేదాంతం చెప్పిన అర్జునుడు ఆఖర్లో బయటపడిపోయాడు. "ఏమిటిది కృష్ణా! భీష్ముణ్ణి, ద్రోణుణ్ణి నేను చంపగలనా? అడుక్కుతింటాను కానీ ఈ నెత్తుటి కూడు వద్దు" అంటూనే.... "ఇంతకీ ఎవరు గెలుస్తారో?" అనే అసలు భయాన్నీ బయటపెట్టాడు. దుఃఖభరితుడై... శోకంతో సుమారు పాతిక శ్లోకాలు చెప్పిన అర్జునుడికి కృష్ణపరమాత్మ ఇచ్చిన ప్రతిస్పందన... ఆ హృషీకేశుడు ఫక్కున నవ్వాడు.

తమువాచ హృషీకేశ ప్రహసన్నివ భారత
సేనయోరుభయోర్మధ్యే విషీదంత మిదం వచః

ఉభయ సేనల మధ్య శోకితుడైన అర్జునుణ్ణి చూసి చిరునవ్వుతో గీతోపదేశాన్ని కృష్ణుడు మొదలుపెట్టాడు.



ఉండవల్లి అరుణ్‌కుమార్

4 రోడ్ ప్రాజెక్టులకు కేఎన్ఆర్ గుడ్‌బై

కొనుగోలు చేసిన ఇండస్ ఇన్‌ఫ్రా ట్రస్ట్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్. కేరళ, తమిళనాడుల్లోని నాలుగు రహదారి ప్రాజెక్టుల నుంచి తప్పుకుంది. కేఎన్ఆర్ పళని ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్, కేఎన్ఆర్ రామగిరి ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్, కేఎన్ఆర్ గురువాయుర్ ఇన్‌ఫ్రా లిమిటెడ్, కేఎన్ఆర్ రామనట్టుకర ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ అనే ఈ నాలుగు స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్‌పీవీ) సంస్థలను ఇండస్ ఇన్‌ఫ్రా ట్రస్ట్‌కు రూ.1,543.19 కోట్లకు విక్రయించినట్టు తెలిపింది. దీనికి సంబంధించిన ఒప్పందాలపై సంతకాలు చేసినట్లు కేఎన్ఆర్ తెలిపింది. ఈ నాలుగు ఎస్‌పీవీలకు ఉన్న రుణాలు కూడా ఇండస్ ఇన్‌ఫ్రా ట్రస్ట్‌కు బదిలీ అవుతాయి. వచ్చే ఏడాది సెప్టెంబరు నెలాఖరుకల్లా ఈ ఒప్పందం పూర్తవుతుందని కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్ పేర్కొంది.

పెట్రోల్ పంపులు @ లక్ష

అమెరికా, చైనా తర్వాత మూడో స్థానం

న్యూఢిల్లీ: దేశంలో పెట్రోల్ పంపుల సంఖ్య లక్ష దాటింది. వాహన యజమానుల సంఖ్య పెరుగుదలకు దీటుగా ఆయిల్ రిటైలింగ్ కంపెనీలు పెట్రోల్ పంపులను భారీగా విస్తరించుకుంటూ వచ్చాయి. ఫలితంగా 2015 నుంచి పంపుల సంఖ్య రెట్టింపైంది. అప్పట్లో పంపుల సంఖ్య 50,451గా ఉంది. కాగా ఈ ఏడాది నవంబరు చివరి నాటికి ఈ సంఖ్య ఏకంగా 1,00,266కి పెరిగింది. రిటైలర్లు.. గ్రామీణ, హైవే కారిడార్లపై పంపుల విస్తరణకు ప్రాధాన్యం ఇచ్చారు. దీంతో పెట్రోల్ పంపుల సంఖ్యలో అమెరికా, చైనా తర్వాత భారత్ మూడో పెద్ద దేశంగా అవతరించింది. ఆయిల్ మంత్రిత్వ శాఖకు చెందిన పెట్రోలియం ప్లానింగ్, విశ్లేషణ విభాగం గణాంకాలు ఈ విషయాలను వెల్లడించాయి. 90 శాతం ఔట్‌లెట్లు ప్రభుత్వ రంగంలోని ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ కంపెనీల యాజమాన్యంలో ఉన్నాయి. ప్రైవేటు కంపెనీల విషయానికి వస్తే 6,921 ఔట్‌లెట్లతో రష్యాకు చెందిన రాస్‌నెఫ్ట్ సంస్థ నయారా ఎనర్జీ అగ్రస్థానంలో ఉంది. 2,114 పంపులతో రిలయన్స్-బీపీ, 346 పంపులతో షెల్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

26వ తేదీ			
హైదరాబాద్	675	విజయవాడ	700
వరంగల్	677	గోదావరి	665
చిత్తూరు	703	విశాఖపట్నం	670
		డజను గుడ్లు రూ.	96

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	142	విజయవాడ	135
వరంగల్	142	గుంటూరు	140
కరీంనగర్	142	ఒంగోలు	140
మహబూబ్‌నగర్	142	చిత్తూరు	142
కర్నూలు	142	నెల్లూరు	147
విశాఖపట్నం	126	అనంతపురం	147
గోదావరి	135		

ఎలక్ట్రిక్ త్రీ వీలర్లకు భలే డిమాండ్



- అమ్మకాల్లో ఏటా 30 శాతానికి పైగా వృద్ధి
- కీలకంగా ఏపీ, తెలంగాణ
- మహీంద్రా లాస్ట్ మైల్ మొబిలిటీ ఎండీ సుమన్ మిశ్రా

ప్రస్తుతం ఆటో రిక్షాల మార్కెట్లోనూ విద్యుత్ వాహనాల (ఈవీ) హవా నడుస్తోంది. దీంతో అనేక స్టార్టప్స్‌తో పాటు ఇప్పటికే ఈ రంగంలో ఉన్న ప్రధాన కంపెనీలూ ఈవీల బాటపట్టాయి. ఈ విభాగంలో మహీంద్రా గ్రూప్ కంపెనీ మహీంద్రా లాస్ట్ మైల్ మొబిలిటీ (ఎంఎల్ఎంఎం) ఇప్పటికే 38 శాతం వాటాతో తన హవాను కొనసాగిస్తోంది. ఈవీ త్రీ వీలర్ మార్కెట్లో వస్తున్న మార్పులు ఇతరత్రా అంశాలపై సంస్థ ఎండీ, సీఈఓ సుమన్ మిశ్రా 'ఆంధ్రజ్యోతి బిజినెస్'తో ఇష్టాగోష్ఠిగా ముచ్చటించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..

భారత్ వాటా 57 శాతం

ఎలక్ట్రిక్ ఆటోల విక్రయాల్లో ప్రస్తుతం మన దేశం అగ్రస్థానంలో ఉంది. గత ఏడాది ప్రపంచవ్యాప్తంగా అమ్ముడైన విద్యుత్ ఆటోల్లో భారత్ వాటా 57 శాతం వరకు ఉంది. 2023లో దేశంలో అమ్ముడైన ఆటోల్లో 7.6 శాతం మాత్రమే ఈవీ ఆటోలది. ఈ ఏడాది ఇప్పటికే 32.8 శాతానికి చేరింది. ఏటా 30 శాతానికి పైగా వృద్ధి నమోదవుతూ వస్తోంది. 2030 నాటికి ఇది 50 శాతానికి చేరుతుందని అంచనా. సానుకూల ఆర్థిక పరిస్థితులు, తగ్గుతున్న నిర్వహణ ఖర్చులు, ఫేమ్-2, పీఎం ఈ-డ్రైవ్ వంటి ప్రభుత్వ విధానాలు దేశంలో విద్యుత్ ఆటోల అమ్మకాల వృద్ధికి తోడ్పడుతున్నాయి.

తెలుగు రాష్ట్రాల్లో ..

మహీంద్రా లాస్ట్ మైల్ మొబిలిటీకి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు మాకు అత్యంత కీలకమైన మార్కెట్లు. ఈ రెండు రాష్ట్రాల్లో ఎలక్ట్రిక్ త్రీ వీలర్ల అమ్మకాలు శరవేగంగా పెరుగుతున్నాయి. తెలంగాణలోని జహీరాబాద్ వద్ద ఈవీల తయారీ కోసం ఇప్పటికే రూ.1,000 కోట్లతో కొత్త ప్లాంటు ఏర్పాటు చేశాం. సానుకూల ప్రభుత్వ విధానాలు, పట్టణ ప్రాంత రవాణా అవసరాలతో ఏపీలోనూ ఈవీ త్రీ వీలర్ల అమ్మకాలు జోరందుకుంటున్నాయి. ప్రస్తుతం రెండు రాష్ట్రాల్లో అన్ని కంపెనీలు కలిపి నెలకు 800కు పైగా త్రీ వీలర్లు విక్రయిస్తున్నాయి. ఇరు రాష్ట్రాల్లో సంస్థకు మొత్తం 17 డీలర్‌షిప్ కేంద్రాలున్నాయి.

మాదే అగ్రస్థానం

2018 నుంచే మేం ఈ మార్కెట్లో ఉన్నాం. ఇప్పటి వరకు మూడు లక్షలకు పైగా ఈవీ త్రీ వీలర్స్‌ను విక్రయించాం. త్రీ వీలర్స్ మార్కెట్లో ఈవీల వాటా 33 శాతానికి చేరడంలో మాది కీలక పాత్ర. ప్రస్తుతం స్టార్టప్స్‌తో పాటు అనేక కంపెనీలు ఈ మార్కెట్లో ఉన్నాయి. గట్టి పోటీ ఉన్నప్పటికీ 37.6 శాతం వాటాతో మార్కెట్లో మహీంద్రా లాస్ట్ మైల్ అగ్రస్థానంలో ఉంది. గత ఏడాది సంస్థ అమ్మకాలు 47 శాతం పెరిగాయి. వచ్చే ఐదేళ్లలో ఈవీ త్రీ వీలర్ విక్రయాలు ఆరు రెట్లకు పైగా పెరుగుతాయని అంచనా వేస్తున్నాం.

ఏడుకు పైగా మోడళ్లు

ప్రస్తుతం మహీంద్రా లాస్ట్ మైల్ పోర్టుఫోలియోలో ఏడుకు పైగా సరుకు (కార్గో) రవాణాతో పాటు ప్యాసింజర్ ఆటో మోడళ్లు ఉన్నాయి. ప్యాసింజర్ ఈవీకి సంబంధించి ట్రియో, ట్రియో ప్లస్ మోడల్స్ ఉండగా కార్గో ఈవీ కోసం ట్రియో జోర్, జోర్ గ్రాండ్ పేరుతో ఆటోలను విక్రయిస్తున్నాం. ఈ-రిక్షా విభాగంలో ట్రియో యారీ, ట్రియో యారీ కార్గో, ఈ-ఆల్ఫా ప్లస్ ప్యాసింజర్, ఈ-ఆల్ఫా కార్గో వెర్షన్స్ ఉన్నాయి. రెండు టన్నుల కంటే తక్కువ బరువు రవాణా చేసేందుకు గత ఏడాది మహీంద్రా జియో పేరుతో ప్రత్యేక ఫోర్ వీలర్‌ను మార్కెట్లోకి విడుదల చేశాం. త్వరలోనే మార్కెట్లోకి కొత్త మోడల్స్‌ను విడుదల చేసేందుకు కసరత్తు చేస్తున్నాం. అంతేకాకుండా ఇప్పటికే ఉన్న మోడల్స్‌ను ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ చేసేందుకు భారీగానే పెట్టుబడులు పెడుతున్నాం. దీనివల్ల మా ఈవీల సామర్థ్యం పెరుగుతుంది.

ఈవీలే ఎందుకంటే..

విద్యుత్ త్రీ వీలర్ మార్కెట్లో అధిక స్పేస్, కంఫర్ట్, ఖర్చు లపరంగా మహీంద్రా ఈవీలకు మంచి పేరుంది. వాహన కొనుగోలుదారులకు అత్యాధునిక టెక్నాలజీతో పాటు విశ్వసనీమైన, నాణ్యమైన సేవలు, బెస్ట్ వారెంటీ, దేశవ్యాప్తంగా 800కు పైగా సర్వీస్ టచ్ పాయింట్లు అందుబాటులో ఉన్నాయి. వీటికి తోడు ఉదయ్ నెక్స్ట్ పథకం కింద ప్రతి ఈవీ ఈవీ కొనుగోలుదారుడికి రూ.20 లక్షల ప్రమాద బీమా అందిస్తున్నాం.

10,000పైగా చార్జింగ్ పాయింట్స్

మహీంద్రాకు ఇప్పటికే దేశవ్యాప్తంగా 10,000కు పైగా చార్జింగ్ పాయింట్లు ఉన్నాయి. 'మహీంద్రా నేమో' యాప్ ద్వారా ఈ చార్జింగ్ పాయింట్లను గుర్తించవచ్చు. వీటికి తోడు మహీంద్రా త్రీ వీలర్ ఈవీలను ఇంటి వద్దే 16ఏ సాకెట్ సాయంతో మొబైల్ ఫోన్‌ను చార్జింగ్ చేసుకున్నట్టు చార్జ్ చేసుకోవచ్చు. దీనికి తోడు ప్రధాన పట్టణాలు, నగరాల్లో పార్కింగ్, చార్జింగ్ సమస్యలను అధిగమించేందుకు వివిధ చార్జింగ్ సంస్థలతో చర్చలు జరుపుతున్నాం.

అడ్డంకులున్నాయ్..

చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు పరిమిత స్థలాలు మాత్రమే అందుబాటులో ఉండడం, పెట్రోల్, డీజిల్ వాహనాలతో పోలిస్తే అధిక ధర, నియంత్రణల గందరగోళం, ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి అవసరమైన విడిభాగాలు దేశీయంగా లభించకపోవటం ప్రధాన సమస్యలు. అయితే బ్యాటరీ సెల్స్‌ను దేశీయంగా ఉత్పత్తి చేయడాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పీఎం ఈ డ్రైవ్ పథకం ద్వారా కృషి చేస్తుండటం సానుకూల అంశం.

2030 నాటికి 10కి పైగా దేశాలకు ఎగుమతులు

ప్రస్తుతం మహీంద్రా.. జపాన్, గ్వాటెమాలా, యూకే, నేపాల్, బ్రెజిల్, శ్రీలంక దేశాలకు ఎగుమతులు చేస్తోంది. ప్రస్తుతం ఎగుమతుల వాటా ఓ మోస్తరుగా ఉంది. 2030 నాటికి ఎగుమతులను 10కి పైగా దేశాలకు విస్తరించటం ద్వారా ఈ వాటా పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

ఐకేపీ నాలెడ్జ్ పార్క్ సీఈఓగా సత్య ప్రకాశ్

హైదరాబాద్: ఐకేపీ నాలెడ్జ్ పార్క్‌కు కొత్త సీఈఓ నియమితులయ్యారు. సత్య ప్రకాశ్ డాష్‌ను ఈ పదవిలో నియమించినట్టు ఐకేపీ నాలెడ్జ్ పార్క్ తెలిపింది. సైన్స్, ఇన్నోవేషన్, స్ట్రాటజీ రంగాల్లో సత్య ప్రకాశ్‌కు 28 ఏళ్లకు పైగా అనుభవం ఉంది. దీంతో ఈ పార్కులో సైన్స్ పరిశోధనలు, ఆవిష్కరణల వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని భావిస్తున్నారు.

రూ.15,000 కోట్లతో స్వామిహ్-2 ఫండ్

న్యూఢిల్లీ: వివిధ కారణాలతో ఆగిపోయిన గృహ నిర్మాణ ప్రాజెక్టులకు ఆర్థిక చేయూత ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందుకోసం రూ.15,000 కోట్ల నిధులతో 'స్వామిహ్-2' పేరుతో ప్రత్యేక నిధి ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ఇందుకోసం ఇప్పటికే రూ.1,500 కోట్లు ప్రారంభ మూలధనంగా కేటాయించింది. ఈ ప్రత్యేక నిధి నుంచి దాదాపు లక్ష నివాస గృహ యూనిట్ల పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు సమకూరుస్తారు. అయితే ఈ ప్రాజెక్టులు మధ్య తరగతి ప్రజలకు అందుబాటు ధరల్లో ఉండే రెరా అనుమతి ఉన్న గృహ ప్రాజెక్టులకు మాత్రమే లభిస్తాయి.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,39,250 ▲	1,27,650 ▲	2,45,000 ▲
విజయవాడ	1,42,000 ▲	1,32,000 ▲	2,24,000 ▲
విశాఖపట్నం	1,38,470 ▼	1,27,000 ▼	2,45,000 ▲
రాజమండ్రి	1,39,250 ▲	1,27,650 ▲	2,22,000 ▲
ప్రొద్దుటూరు	1,40,450 ▼	1,29,210 ▼	2,26,000 ▲
ముంబై	1,36,630 ▲	1,25,150 ▲	2,18,980 ▲

నవీ ముంబై విమానాశ్రయం షురూ

ముంబై: నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం (ఎన్ఎంఐఏ) గురువారం లాంఛనంగా వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించింది. బెంగళూరు నుంచి వచ్చిన ఇండిగో ఎయిర్‌బస్ ఏ320 విమానానికి వాటర్ క్యానన్స్‌తో స్వాగతం పలకటం ద్వారా ఈ విమానాశ్రయ కార్యకలాపాలను ప్రారంభమయ్యాయని అదానీ గ్రూప్ సారథ్యంలోని ఎన్ఎంఐఏ వెల్లడించింది. అలాగే ఇక్కడి నుంచి తొలి విమాన సర్వీసు హైదరాబాద్‌కు బయలుదేరిందని తెలిపింది. తొలుత ఈ విమానాశ్రయం నుంచి 9 ప్రధాన నగరాలకు కనెక్టివిటీని అందుబాటులోకి తీసకువచ్చారు. ఇండిగో, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, ఆకాశ ఎయిర్, స్టార్ ఎయిర్ వంటి విమాన కంపెనీలను ఇక్కడి నుంచి సర్వీసులను నిర్వహించనున్నాయి.

భారత వ్యాపారాల లిస్టింగ్ యోచన లేదు

సామ్‌సంగ్ సీఈఓ జేబీ పార్క్

న్యూఢిల్లీ: దక్షిణ కొరియా ఎలక్ట్రానిక్స్ దిగ్గజం సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ తమ భారతీయ వ్యాపార విభాగాన్ని లిస్టింగ్ చేసే యోచన ఏదీ ప్రస్తుతానికి లేదని స్పష్టం చేసింది. దానికి బదులుగా తమ ఉత్పత్తులన్నింటిలోనూ కృత్రిమ మేధ (ఏఐ)ను ప్రవేశపెడతామని, దేశీయ మార్కెట్లో విక్రయాలను పెంచుకునేందుకు కన్స్యూమర్ ఫైనాన్స్ విభాగాన్ని విస్తరిస్తామని తెలిపింది. సామ్‌సంగ్ ఆగ్నేయాసియా విభాగం ప్రెసిడెంట్, సీఈఓ జేబీ పార్క్ వెల్లడించారు. కాగా దేశంలో తయారీని మరింతగా విస్తరించేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. మొబైల్ ఫోన్ డిస్‌ప్లేలు దేశంలోనే తయారు చేసేందుకు వీలుగా ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహకాలకు (పీఎల్ఐ) దరఖాస్తు చేసినట్టు పార్క్ తెలిపారు. దక్షిణ కొరియాకు చెందిన కంపెనీలు హ్యుండయ్ మోటార్, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇటీవల పబ్లిక్ ఇష్యూల (ఐపీఓ)కు వచ్చినప్పటికీ తమకు మాత్రం ప్రస్తుతానికి అలాంటి ఆలోచన ఏదీ లేదని పార్క్ స్పష్టం చేశారు.

స్పోర్ట్స్

వైభవ్‌ను జట్టులోకి తీసుకోండి

● కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్





న్యూఢిల్లీ: యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీని టీమిండియా సీనియర్ జట్టులోకి తీసుకోవాలని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ 'ఎక్స్' వేదికగా బీసీసీఐకి విజ్ఞప్తి చేశారు. 'కొంతకాలం కిందట క్రికెట్‌లో 14 ఏళ్ల వయసులో అరంగేట్రం చేసిన సచిన్ టెండూల్కర్ ఎన్ని అద్భుతాలు చేశాడో చూశాం. అతనేంటో మనందరికీ తెలుసు. మరి ఇప్పుడు ఎందుకు ఆలస్యం చేస్తున్నారు? భారత్ కోసం వైభవ్ సూర్యవంశీని జట్టులోకి తీసుకోండి' అని పోస్టు చేశారు. బుధవారం విజయ్ హజారే ట్రోఫీలో సూర్యవంశీ 84 బంతుల్లోనే 190 పరుగులు చేయడం తెలిసిందే. లిస్ట్-ఎ క్రికెట్‌లో ఇదే వేగవంతమైన 150 కావడం విశేషం.

వెన్నెల జోడీ ముందంజ




విజయవాడ సిటీ (ఆంధ్రజ్యోతి): జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ డబుల్స్‌లో కె.వెన్నెల రెడ్డి (తెలంగాణ)-రిషిక (తమిళనాడు) జోడీ ప్రీక్వార్టర్స్‌లోకి ప్రవేశించింది. గురువారం జరిగిన రెండో రౌండ్ పోటీల్లో వెన్నెల-రిషిక ద్వయం 21-12, 21-19తో అనన్య-మనీషా (జార్ఖండ్) జోడీపై గెలిచింది. సింగిల్స్‌లో ఉన్నతి హూడా (హరియాణా) 21-11, 21-18తో అశ్వతి (కర్ణాటక)పై, తన్వీ శర్మ (పంజాబ్) 21-15, 9-21, 21-12తో మాన్సీ సింగ్ (ఉత్తరప్రదేశ్)పై, రోహన్ కుమార్ (తెలంగాణ) 13-21, 21-13, 21-14తో అన్ష్ నేగి (ఉత్తరాఖండ్) నెగ్గి క్వార్టర్స్‌కు చేరారు.. పురుషుల డబుల్స్‌లో విష్ణు కేదార్-వెంకట హర్షవర్ధన్ (ఆంధ్రప్రదేశ్), కార్తికేయ-హుజిత్ రెడ్డి (ఆంధ్రప్రదేశ్), భార్గవ్ రామ్-విశ్వతేజ (ఆంధ్రప్రదేశ్), వర్షిత్ శ్రీసాయి-తరుణ్ (తెలంగాణ), మహిళల డబుల్స్‌లో స్రవంతి-దీపిక జోడీ ముందంజ వేశాయి.

రావినూతలలో అంతర్ రాష్ట్ర టీ20 కప్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): అంతర్ రాష్ట్ర టీ20 సంక్రాంతి క్రికెట్ కప్‌నకు ఆతిథ్యం ఇచ్చేందుకు బాపట్ల జిల్లాలోని రావినూతల స్టేడియం ముస్తాబవుతోంది. వచ్చే నెల 9 నుంచి 16వ తేదీ వరకు ఈ పోటీలు జరగనున్నాయి. టోర్నీ మొత్తం ప్రైజ్ మనీ రూ.6 లక్షలు కాగా, విజేత జట్టుకు రూ.3 లక్షలు నగదు బహుమతిగా లభించనుంది. ఆసక్తి గల జట్లు ఈనెల 30వ తేదీ లోపు తమ వివరాలను నమోదు చేసుకోవాల్సిందిగా నిర్వాహకులు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9849533714, 9581022842 నెంబర్లను సంప్రదించి తెలుసుకోవచ్చు.

క్రీడల్లో బంధుప్రీతికి తెరదించాం

ప్రధాని నరేంద్ర మోదీ




న్యూఢిల్లీ: క్రీడల్లో బంధుప్రీతి, ఎంపికల్లో అక్రమాలకు దశాబ్దం కిందట చరమగీతం పాడామని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. 2014కు ముందు క్రీడల్లో ఇవి బాగా ఉండేవని, తమ ప్రభుత్వం వాటికి తెరదించడంతో పేద కుటుంబాలకు చెందిన ప్రతిభావంతులు కూడా తమ కష్టంతో ఉన్నత స్థానాలకు చేరుకోగలుగుతున్నారని చెప్పారు. గురువారం సన్సద్ ఖేల్ మహోత్సవ్‌లో ఆయన మాట్లాడుతూ.. యువతలో క్రీడలపై ఆసక్తి కలిగించడంతో పాటు నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. 'ఈ కార్యక్రమంతో వేలాది మంది ప్రతిభావంతులు ఉనికిలోకి వస్తారు. ఈ ఖేలో ఉత్సవ్ క్రమంగా జాతి నిర్మాణంలో కీలక పాత్ర పోషించనుంది. అలానే సమాజం ఆలోచన విధానంలో కూడా మార్పు తీసుకువస్తుంది. 2014కు ముందు క్రీడల బడ్జెట్ రూ.1200 కోట్ల కంటే తక్కువ ఉండేది. ఇప్పుడు రూ.3 వేల కోట్లకు పైగా ఉంది. ప్రతిభావంతులైన క్రీడాకారులకు వారి శిక్షణ ఖర్చుల నిమిత్తం నెలకు రూ.25 నుంచి 50 వేలు ఆర్థిక సాయం అందిస్తున్నాం' అని చెప్పారు. క్రీడాకారులు తమ గెలుపు కోసం మాత్రమే ఆడరని, దేశం కోసం, జాతి ప్రతిష్ట కోసం, మువ్వన్నెల జెండాను రెపరెపలాడించేందుకు కష్టపడతారని ప్రశంసించారు.

రోహిత్.. వడాపావ్ తింటావా?

హిట్‌మ్యాన్‌తో ఫ్యాన్స్ సరదా





న్యూఢిల్లీ: విజయ్ హజారే ట్రోఫీలో ముంబై బ్యాటర్ రోహిత్ శర్మ (155) ఆడిన తొలి మ్యాచ్‌లోనే అదరగొట్టాడు. జైపూర్‌లో సిక్కింతో జరిగిన ఈ మ్యాచ్ వీక్షణకు భారీగా అభిమానులు హాజరయ్యారు. అయితే, రోహిత్ ఫీల్డింగ్ చేస్తున్నప్పుడు ఆసక్తికరమైన సంఘటనలు చోటు చేసుకొన్నాయి. 'ముంబై రాజా' అంటూ హిట్‌మ్యాన్‌ను ఉద్దేశించి ఫ్యాన్స్ నినాదాలు చేశారు. ఈ క్రమంలో ఓ అభిమాని ఒక అడుగు ముందుకేసి.. 'రోహిత్ భాయ్.. వడాపావ్ తింటావా?' అంటూ ఆటపట్టించాడు. దీనికి రోహిత్.. తినను అన్నట్టుగా చేయి చూపిస్తూ సరదాగా స్పందించాడు. దీంతో ఫ్యాన్స్ బిగ్గరగా అరిచారు. ఈ వీడియో ఇప్పుడు నెట్‌లో చక్కర్లు కొడుతోంది.

సిరీస్‌పై గురి!

జోష్‌లో భారత్ | **మహిళల మూడో టీ20 నేడు** | **ఒత్తిడిలో లంక** | **రాత్రి 7 గం. నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..**



కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్

తిరువనంతపురం: వరుస విజయాలతో జోరుమీదున్న భారత మహిళల జట్టు.. సిరీస్‌పై గురి పెట్టింది. శుక్రవారం శ్రీలంకతో జరిగే మూడో టీ20లో భారత్ గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగనుంది. 2-0తో ఆధిక్యంలో ఉన్న హర్మన్‌ప్రీత్ సేన .. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో రెండు మిగిలుండగానే పట్టేయాలనుకొంటోంది. భారత బ్యాటింగ్ బలంగా కనిపిస్తోంది. రెండో మ్యాచ్‌లో షఫాలీ వర్మ అదరగొడితే.. తొలి టీ20లో జెమీమా ఆదుకొంది. అయితే, డాషింగ్ ఓపెనర్ స్మృతి మంధాన బ్యాట్ నుంచి ఆశించిన రీతిలో పరుగులు రావడం లేదు. కెప్టెన్ హర్మన్‌కు కూడా పెద్దగా ఆడే అవకాశాలు రాలేదు. అయితే, గడచిన రెండు మ్యాచ్‌ల్లో మన బౌలర్లు ప్రత్యర్థిని 121/6, 128/9 స్కోర్లకే పరిమితం చేశారు. యువ స్పిన్నర్లు శ్రీచరణి, వైష్ణవి శర్మ, క్రాంతి గౌడ్ కట్టుదిట్టంగా బంతులేస్తూ ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేస్తున్నారు. ఆల్‌రౌండర్ దీప్తి శర్మ గైర్హాజరీలో జట్టులోకి వచ్చిన స్నేహ్ రాణా కూడా పొదుపుగా బౌలింగ్ చేసి లంక బ్యాటర్లను ఒత్తిడిలోకి నెట్టింది. తొలి మ్యాచ్‌తో పోల్చితే మనోళ్ల ఫీల్డింగ్ మెరుగుపడుతోంది. మొదటి మ్యాచ్‌లో ఐదు క్యాచ్‌లు చేజార్చిన భారత ప్లేయర్లు.. రెండో టీ20లో మూడు రనౌట్లు చేయడం విశేషం. సిరీస్‌లో మిగిలిన మూడు మ్యాచ్‌లు ఇక్కడే జరగనుండడం భారత్‌కు సానుకూలాంశమే. ఇక దీప్తిశర్మ ఫిట్‌నెస్‌పై ఎలాంటి సమాచారం లేదు.

గెలిచి నిలవాలని..

మరోవైపు తీవ్ర ఒత్తిడిలో ఉన్న లంక.. ఈ మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను సజీవంగా ఉంచాలనుకుంటోంది. అయితే, టీమ్ బ్యాటింగ్ ఘోరంగా విఫలమవుతోంది. రెండు మ్యాచ్‌ల్లోనూ తొలుత బ్యాటింగ్ చేసిన లంక పోరాడగలిగే స్కోరునైతే సాధించలేకపోయింది. ఆరంభంలో పర్వాలేదనిపించినా.. ఒకట్రెండు వికెట్లు కోల్పోయిన తర్వాత ఒక్కసారిగా కుప్పకూలుతోంది. కెప్టెన్ చమరి ఆటపట్టు ఉన్నంత వరకు దూకుడుగా ఆడుతున్నా.. విష్మి గుణరత్నే, హాసిని పెరీరా, హర్షిత స్కోరు బోర్డును పరుగులు పెట్టించలేక పోతున్నారు. వికెట్ల మధ్య పరిగెత్తుతున్న తీరు కూడా దారుణంగా ఉంది. ఇక, బౌలర్లు భారత బ్యాటర్లను ఏమాత్రం ఇబ్బందిపెట్టలేక పోతున్నారు.



లంక సారథి ఆటపట్టు

జట్లు (అంచనా)

భారత్: స్మృతి మంధాన, షఫాలీ వర్మ, జెమీమా, హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), రిచా ఘోష్ (వికెట్ కీపర్), స్నేహ్ రాణా/దీప్తి, అమన్‌జోత్ కౌర్, అరుంధతి రెడ్డి, క్రాంతి గౌడ్, వైష్ణవి శర్మ, శ్రీచరణి.

శ్రీలంక: చమరి ఆటపట్టు (కెప్టెన్), విష్మి గుణరత్నె, హాసిని పెరీరా, హర్షిత సమరవిక్రమ, నీలాక్షి, కౌషిని నుత్యాంగన (వికెట్ కీపర్), కవిష దిల్హారి, మాల్కి మదార, ఇనోక రణవీర, క్యావ కవింది, షాషిని గిమ్హాని.

పిచ్/వాతావరణం

వికెట్ బ్యాటింగ్‌కు అనుకూలం కావడంతో భారీ స్కోర్లు నమోదయ్యే అవకాశం ఉంది. గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో ఆడిన నాలుగు టీ20ల్లో మూడుసార్లు ఛేదన చేసిన జట్లే నెగ్గాయి. ఈ నేపథ్యంలో టాస్ గెలిచిన జట్టు బౌలింగ్ ఎంచుకోవచ్చు. ఆకాశం మేఘావృతమై ఉన్నా.. వర్షం కురిసే అవకాశాలు తక్కువ.


పరువు కోసం ఇంగ్లండ్ పోరాటం

ఉ. 5 గం.నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..



బెన్ స్టోక్స్

- క్లీన్‌స్వీప్‌పై ఆసీస్ కన్ను
- బాక్సింగ్ డే టెస్ట్ నేటి నుంచి



స్మిత్

మెల్‌బోర్న్: యాషెస్ సిరీస్‌ను 3-0తో ఇప్పటికే సొంతం చేసుకొన్న ఆస్ట్రేలియా అదే జోరును కొనసాగించాలనుకొంటోంది. మరోవైపు ఐదు టెస్ట్‌ల సిరీస్‌లో మిగిలిన రెండు మ్యాచ్‌లు నెగ్గి పరువు దక్కించుకోవాలని ఇంగ్లండ్ పట్టుదలతో ఉంది. ఈ క్రమంలో శుక్రవారం నుంచి జరిగే బాక్సింగ్ డే టెస్ట్‌లో బెన్ స్టోక్స్ సేన అద్భుతం చేయాలనుకొంటోంది.

జట్టు కూర్పుపై సందేహాలున్నా..: ఆసీస్ జట్టు నాలుగో టెస్ట్‌లో కూడా ఇదే జోష్‌తో బరిలోకి దిగనుంది. గాయపడిన స్పిన్నర్ నాథన్ లియాన్ స్థానంలో మర్ఫీని తీసుకొన్నా.. పిచ్‌పై పచ్చదనం కనిపిస్తుండడంతో మొత్తం పేసర్లతో బరిలోకి దిగనుంది. పేసర్ జే రిచర్డ్‌సన్‌కు తుది జట్టులో చోటుదక్కింది. ఉస్మాన్ ఖవాజా, కామెరూన్ గ్రీన్ బ్యాటింగ్ స్థానాల్లో మార్పులు చేసే అవకాశం ఉంది. ఫామ్‌లో ఉన్న అలెక్స్ క్యారీ అదే జోరు కొనసాగించాలని జట్టు కోరుకొంటోంది. మరోవైపు తీవ్ర ఒత్తిడిలో ఉన్న ఇంగ్లండ్.. సిరీస్‌లో ఎలాగైనా బోణీ కొట్టాలనుకొంటోంది. టీమ్ బ్యాటింగ్ ఘోరంగా ఉన్న నేపథ్యంలో పోప్‌పై వేటేసింది. గాయంతో పేసర్ జోఫ్రా ఆర్చర్ సిరీస్‌కు దూరమవడం పెద్ద దెబ్బే.

చోప్రా జట్టులో కూడా గిల్‌కు చోటు లేదు..



న్యూఢిల్లీ: ప్రముఖ విశ్లేషకుడు, టీమిండియా మాజీ ఆటగాడు ఆకాశ్ చోప్రా తన టీ20 వరల్డ్‌కప్ జట్టును ప్రకటించాడు. బీసీసీఐ సెలెక్టర్లు వదిలేసిన వారితోపాటు జాతీయ జట్టులోకి వచ్చే పరిస్థితులు కూడా లేని ఆటగాళ్లను కూడా తన టీమ్‌లో చేర్చడం ఆశ్చర్యకరం. అయితే, టీ20 జట్టులో చోటు కోల్పోయిన శుభ్‌మన్ గిల్‌కు తన డ్రీమ్ టీమ్‌లో స్థానం కల్పించలేదు. ఐపీఎల్‌లో మాత్రమే ఆడుతున్న దీపక్ చాహర్, క్రునాల్ పాండ్యా, యజ్వేంద్ర చాహల్, భువనేశ్వర్ కుమార్‌కు తన జట్టులో చోటివ్వడం కొసమెరుపు. తెలుగు ఆటగాళ్లు సిరాజ్, నితీశ్‌కుమార్‌లకు చోటు దక్కింది.

చోప్రా టీ20 వరల్డ్‌కప్ బృందం: యశస్వి జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్, శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), రిషభ్ పంత్, జితేశ్ శర్మ, నితీశ్ కుమార్ రెడ్డి, క్రునాల్ పాండ్యా, దీపక్ చాహర్, చాహల్, సిరాజ్, భువనేశ్వర్ కుమార్.

బెంచ్: మహ్మద్ షమి, కేఎల్ రాహుల్, విప్రజ్ నిగమ్, శశాంక్ సింగ్.

ఖేల్‌రత్న రేసులో క్రికెటర్లకు మళ్లీ నిరాశే!

న్యూఢిల్లీ: వరుసగా రెండో ఏడాది జాతీయ క్రీడా పురస్కారాల్లో క్రికెటర్లకు చోటు లభించకపోవడం చర్చనీయాంశంగా మారింది. బుధవారం జాతీయ ఒలింపిక్ సంఘం ఉపాధ్యక్షుడు గగన్ నారంగ్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ 24 మందితో కూడిన జాబితాను క్రీడా మంత్రిత్వశాఖకు పంపడం తెలిసిందే. ఒకప్పుడు సచిన్, మిథాలీ, సెహ్వాగ్, విరాట్, హర్మన్‌ప్రీత్ వంటి స్టార్ క్రికెటర్లకు లభించిన ఈ అవార్డులు గత రెండేళ్లుగా ఎవరికీ దక్కకపోవడం ఆశ్చర్యంగా ఉందని విశ్లేషకులు అంటున్నారు. ఈ ఏడాది టీమిండియా చాంపియన్స్ ట్రోఫీతో పాటు ఆసియా కప్ సాధించగా, మహిళల జట్టు తొలిసారి వన్డే వరల్డ్‌కప్‌ను దేశానికి అందించినా ఎవరినీ పరిగణనలోకి తీసుకోకపోవడం క్రికెట్ అభిమానులను నిరాశపర్చింది.





క్లైమాక్స్‌లో ఉస్తాద్

పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా హరీశ్ శంకర్ తెరకెక్కిస్తున్న చిత్రం 'ఉస్తాద్ భగత్‌సింగ్'. మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. పవన్ ఇందులో శక్తిమంతమైన పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. రాశీ ఖన్నా, శ్రీలీల కథానాయికలు. ప్రస్తుతం ఈ సినిమా ఫైనల్ షెడ్యూల్ షూటింగ్ జరుగుతున్నట్లు మేకర్స్ అప్డేట్ ఇచ్చారు. మరోవైపు ఈ సినిమాలో తన షూటింగ్ పార్ట్ కంప్లీట్ అయినట్లు రాశీ ఖన్నా తెలిపారు. ఈ చిత్రంలో నటించినందుకు ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు వర్కింగ్ స్టిల్స్‌ను షేర్ చేశారు. ఇందులో ఆమె శ్లోక అనే ఫొటోగ్రాఫర్ పాత్రలో కనిపించనున్నారు. ఇటీవలె విడుదలైన ఈ సినిమాలోని తొలి గీతం 'దేఖ్‌లేంగా సాలా' అందర్నీ ఆకట్టుకుంటోంది. వచ్చే ఏడాది సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

వీడ్కోలు 2025

ఆరంభంలో 'ఛావా'.... చివర్లో 'దురంధర్'

బాలీవుడ్‌కు ఊపిరి పోసిన 2025

అగ్ర హీరోలు నటించిన సినిమాలే మొదటి, రెండు వారాల్లోనే వసూళ్ల రాబట్టలేక బాక్సాఫీసు దగ్గర చతికిల పడుతుంటే, బాలీవుడ్ చిత్రం 'దురంధర్' వసూళ్ల హవా కొనసాగుతోంది. 'వార్ వన్ సైడే' అన్నట్లు మూడు వారాల తర్వాత కూడా దూసుకుపోతోంది. ప్రపంచ వ్యాప్తంగా చూసుకుంటే రూ.800 కోట్ల బెంచ్ మార్క్‌ను 'దురంధర్' దాటేసింది. రూ. 852.27 కోట్లు ప్రపంచవ్యాప్తంగా వసూలు చేసి కాంతార చాప్టర్ వన్ చిత్రం ముందు వరుసలో ఉంది. ఆ రికార్డ్‌ను 'దురంధర్' అధిగమించడానికి ఎక్కువ రోజులు పట్టకపోవచ్చని ట్రేడ్ పండితులు చెబుతున్నారు. 'ఓటీటీల ప్రభావం పెరిగింది.. జనం థియేటర్లకు రావడం మానుకున్నారు' అని ఇటీవల కాలంలో ఎక్కువగా వినిపిస్తున్న కామెంట్లు తప్పేమో అనిపిస్తుంది 'దురంధర్'ను చూడడానికి థియేటర్లకు తండోపతండాలుగా వస్తున్న జనాన్ని చూస్తుంటే. 'అవతార్ 3' ను మించి ఈ సినిమాకు కలెక్షన్లు ఉండడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఇదే జోరు మరో రెండు వారాలు కొనసాగితే, రూ. 1000 కోట్లు సంపాదించడం పెద్ద కష్టమేమీ కాదు.



ఆ ఐదు చిత్రాల్లో ఒకటి

కొన్నేళ్లుగా సరైన హిట్ లేక, దక్షిణాది చిత్రాల పోటీని తట్టుకోలేక ఆపసోపాలు పడుతున్న హిందీ చిత్ర పరిశ్రమకు 2025 ఆరంభంలో వచ్చిన 'ఛావా' చిత్రం కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. మరాఠా యోధుడు శంభాజీ కథతో రూపుదిద్దుకున్న ఈ సినిమా ఈ సంవత్సరంలో తొలి సూపర్‌హిట్‌ను అందించింది. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'ఛావా' చిత్రం ఈ ఏడాది ఫిబ్రవరి 14న విడుదలైంది. ఇందులో హీరోగా నటించిన విక్కీ కౌశల్ పేరు ఈ సూపర్ హిట్‌తో దేశమంతా మారుమోగిపోయింది.

ఇప్పుడు సంవత్సరం చివరిలో వచ్చిన 'దురంధర్' చిత్రం కూడా ఘన విజయం సాధించడంలో 2025కు ఉత్సాహంతో వీడ్కోలు పలకడానికి బాలీవుడ్ సిద్ధమవుతోంది. ఈ ఏడాదిలో రూ. 500 కోట్ల క్లబ్‌లో చేరిన చిత్రాలు ఐదు మాత్రమే ఉన్నాయి. వాటిల్లో 'దురంధర్' చిత్రం మొదటి వరుసలో నిలిచింది. మిగిలిన నాలుగు సినిమాలు .. 'కాంతారా చాప్టర్ 1' (రూ. 850 కోట్లు), ఛావా (రూ 797 కోట్లు), సయారా (రూ. 579 కోట్లు), రజనీకాంత్ 'కూలీ' (రూ. 514 కోట్లు).

రూ. వెయ్యి కోట్ల క్లబ్‌లో చేరుతుందా?

భారతీయ సినిమా చరిత్రలో ఇప్పటివరకూ రూ. వెయ్యి కోట్లు వసూలు చేసిన చిత్రాలు ఎనిమిదే ఎనిమిది ఉన్నాయి. వాటిల్లో తెలుగు చిత్రపరిశ్రమ నుంచి నాలుగు సినిమాలు ఉండడం మనం కాలర్ ఎగరేయాల్సిన విషయం. ఆ చిత్రాలు.. 'బాహుబలి 2', 'పుష్ప 2', 'ఆర్ఆర్ఆర్', 'కల్కి'. బాలీవుడ్ నుంచి మూడు సినిమాలు .. దంగల్, పఠాన్, జవాన్ ఉన్నాయి. ఇక కన్నడ నుంచి ఒకే ఒక్క సినిమా 'కేజీఎఫ్ 2' ఉంది. ఇప్పుడు అందరి దృష్టి 'దురంధర్' మీదే ఉంది. ఈ చిత్రం కలెక్షన్ల జోరు చూస్తుంటే అతి త్వరలోనే రూ. 1000 కోట్లు వసూలు చేసే అవకాశం ఉంది. అప్పుడు పై లిస్టులో తొమ్మిదో సినిమాగా 'దురంధర్' చేరుతుంది. దాంతో టాలీవుడ్ నాలుగు చిత్రాలతో, బాలీవుడ్ కూడా నాలుగు చిత్రాలతో సమాన స్థాయిలో రూ. 1000 కోట్ల క్లబ్‌లో ఉన్నట్లు అవుతుంది. అలాగే అతి తక్కువ సమయంలోనే రూ. 1000 కోట్ల క్లబ్‌లో చేరిన తొలి భారతీయ హీరోగా రణవీర్‌సింగ్ చరిత్రలో నిలిచిపోతారు. పదిహేనేళ్ల నటజీవితంలో అతను సాధించిన గొప్ప రికార్డే అవుతుంది.

వర్మ ప్రశంసలు

దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ ఎక్స్ వేదికగా బాలీవుడ్ ప్రముఖులకు ఓ చురక అంటించారు. ఐటెమ్ సాంగ్స్, భారీ గ్రాఫిక్స్ మీద ఆధారపడుతూ సినిమాలు తీసే దర్శకనిర్మాతలను 'దురంధర్' చిత్రం ఓ పీడకలలా వెంటాడుతుందని తనదైన శైలిలో ట్వీట్ చేశారు.



ప్రభాస్ కథానాయకుడిగా మారుతి తెరకెక్కించిన 'రాజాసాబ్' సంక్రాంతి సందర్భంగా జనవరి 9న విడుదల అవుతున్న సంగతి తెలిసిందే. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. తాజాగా ఈ చిత్రం నుంచి 'రాజే యువరాజే' పాటను విడుదల చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు మేకర్స్.

క్రిస్మస్ బహుమతి

రవితేజ కథానాయకుడిగా కిశోర్ తిరుమల దర్శకత్వంలో 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' అనే చిత్రం రూపుదిద్దుకుంటున్న విషయం తెలిసిందే. ఎస్ఎల్వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రేక్షకులకు అద్భుతమైన వినోదాన్ని పంచేందుకు సిద్ధమవుతోంది. తాజాగా మేకర్స్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుతూ ప్రత్యేక పోస్టర్‌ని విడుదల చేశారు. రవితేజ సాంటా క్యాప్ ధరించి, చేతిలో బహుమతి పట్టుకుని పండుగ వాతావరణంలో కనిపించడం ఆకట్టుకుంది. ఈ సినిమాలో ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతి కథానాయికలుగా నటిస్తున్నారు. వచ్చే ఏడాది జనవరి 13న సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.







భారీ బడ్జెట్‌తో... ఫిబ్రవరిలో సెట్స్ పైకి?

అల్లు అర్జున్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కనుంది. అధికారికంగా ప్రకటించకపోయినా ఫిబ్రవరిలో ఈ సినిమా సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని ఇండస్ట్రీ వర్గాల సమాచారం. ఓ భారీ మైథలాజికల్ చిత్రంగా దీన్ని రూపొందించనున్నారట. ఇందులో అల్లు అర్జున్ కార్తికేయ స్వామి పాత్రలో కనిపించనున్నారని టాక్. రూ. వెయ్యి కోట్ల భారీ బడ్జెట్‌తో దీనిని నిర్మించనున్నారు. సాంకేతికంగా ఉన్నతంగా ఉంటూ ప్రేక్షకులను మరో లోకంలోకి తీసుకెళ్లేలా ఉంటుందట. అల్లు అర్జున్ త్రివిక్రమ్ కలయికలో తెరకెక్కిన 'జులాయి', 'సన్నాఫ్ సత్యమూర్తి', 'అల వైకుంఠపురంలో' చిత్రాలు మంచి విజయాలు అందుకున్నాయి. అల్లు అర్జున్ ప్రస్తుతం అట్లీతో ఓ భారీ యాక్షన్ చిత్రం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతోంది. మరోవైపు దర్శకుడు లోకేశ్ కనగరాజ్ బన్నీకి ఓ కథ వినిపించారని, మరికొన్ని చర్చల తర్వాత ఈ ప్రాజెక్ట్‌పై ఓ స్పష్టత వచ్చే అవకాశముందని సమాచారం.

మెప్పించే సుమతీ శతకం



అమర్‌దీప్ చౌదరి, శైలి చౌదరి జంటగా ఎమ్ ఎమ్ నాయుడు తెరకెక్కిస్తున్న చిత్రం 'సుమతీ శతకం'. సాయిసుధాకర్ కొమ్మాలపాటి నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం టీజర్‌ను ఆంధ్రప్రదేశ్ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు విడుదల చేసి టీమ్‌కు ఆల్ ద బెస్ట్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కొమ్మాలపాటి సుధాకర్ మాట్లాడుతూ 'అందర్నీ మెప్పించే సందేశాత్మక చిత్రమిది. సినిమా మంచి విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అని అన్నారు. 'మంచి విజువల్స్, ఆకట్టుకునే సన్నివేశాలు, అద్భుతమైన కథనం ఉండే ఈ సినిమా ప్రేక్షకుల మనసును దోచుకుంటుంది' అని ఎమ్ఎమ్ నాయుడు తెలిపారు.

చావే సచ్చిపోయేంత



కథానాయిక రష్మిక మందన్న లీడ్ రోల్‌లో నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మైసా'. భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతోంది. 'రిమెంబర్ ది నేమ్' అంటూ విడుదలైన టీజర్ చూస్తుంటే రష్మిక కెరీర్‌లో వైవిధ్యమైన చిత్రంగా నిలవబోతోందని తెలుస్తోంది. 'నా బిడ్డ ఊపిరి మోయలేక అగ్గే బూడిదైంది...నా బిడ్డను సంపలేక.. ఆఖరికి సావే సచ్చిపోయింది' అనే పవర్‌ఫుల్ వాయిస్ ఓవర్ రష్మిక పాత్ర తాలూకు పోరాట పటిమను తెలుపుతోంది. రక్తం మరకలతో, చింపిరి జుట్టు, తీక్షణమైన చూపుతో ఆమె కనిపించారు. అన్‌ఫార్ములా ఫిల్మ్స్ పతాకంపై రవీంద్ర పుల్లె దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జేక్స్ బిజోయ్, సినిమాటోగ్రఫీ: శ్రేయాస్ పి కృష్ణ



చిన్న సినిమాలను చంపకండి



దయచేసి చిన్న సినిమాలను చంపకండి, సినిమానే నమ్ముకున్న వందలాది కుటుంబాలను రోడ్డున పడేయకండి అని విజ్ఞప్తి చేశారు 'ఈషా' చిత్ర నిర్మాతలు. ఈ చిత్రాన్ని మన్నె శ్రీనివాస్ తెరకెక్కించారు. కె.ఎల్.దామోదర ప్రసాద్ సమర్పణలో హేమ వెంకటేశ్వరరావు నిర్మించారు. వంశీ నందిపాటి, బన్నీ వాసు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వంశీ నందిపాటి మాట్లాడుతూ 'విడుదలకు ముందు రోజు చాలా చోట్ల ప్రీమియర్ షోలు వేశాం. ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోంది. ఆన్‌లైన్‌లో టికెట్ల బుకింగ్ కూడా ఆశాజనకంగానే ఉంది. అయితే సోషల్ మీడియాలో 'ఈషా' సినిమాపై జరుగుతోన్న వ్యతిరేక ప్రచారం మమ్మల్ని అసంతృప్తికి గురిచేస్తోంది. కొంత మంది కావాలని ఆన్‌లైన్ టికెటింగ్ ప్లాట్ ఫామ్‌లో ఫేక్ క్యాంపెయిన్ చేస్తున్నారు. ఇలా చేయడం సరికాదు. సినిమా బాగుంటే ప్రేక్షకులు చూస్తారు, లేదంటే వదిలేస్తారు' అని అన్నారు. కె.ఎల్.దామోదర ప్రసాద్ మాట్లాడుతూ ' 'ఈషా'తో పాటు మరికొన్ని సినిమాలు రిలీజ్ అయ్యాయి. మా సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోంది. అయినా మా సినిమాపై సోషల్ మీడియాలో నెగెటివ్ ప్రచారం చేస్తున్నారు. ఇది మంచి పద్ధతి కాదు. దీని వెనుక ఎవరున్నా కనిపెడతాను' అని హెచ్చరించారు. బన్నీ వాసు మాట్లాడుతూ ' సినిమాలకు రివ్యూలు రాయడం, విశ్లేషించడం సాధారణ విషయమే. కానీ, ఆన్‌లైన్ టికెటింగ్ ప్లాట్‌ఫామ్‌లో రేటింగ్‌లను తగ్గిస్తున్నారు. కొన్ని వెబ్‌సైట్స్‌లలో బూతులతో రివ్యూలు రాస్తున్నారు. 'ఈషా' సినిమాకు ప్రేక్షకాదరణ లభిస్తోంది. ఈ సమయంలో ఇలాంటి నెగెటివ్ ప్రచారం సినిమాకు నష్టమే. సినిమాలను చంపేస్తున్న సోషల్ మీడియా నెగెటివ్ ప్రచారాలను నమ్మొద్దని ప్రేక్షకులను కోరుతున్నాం' అని అన్నారు.



పోలవరం తొలి దశకు మరో 5,800 కోట్లివ్వండి

▸ కేంద్రాన్ని కోరనున్న రాష్ట్ర ప్రభుత్వం

అమరావతి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు తొలి దశ నిర్మాణం పూర్తికి ఇంకో రూ.5,800 కోట్లు ఇవ్వాల్సిందిగా కేంద్ర జలశక్తి శాఖను కోరాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ప్రధాన డ్యాం పనులతోపాటు తొలిదశ సహాయ పునరావాస కార్యక్రమాల కోసం ఈ ఏడాది బడ్జెట్‌లో కేంద్రం రూ.5,800 కోట్లు విడుదల చేసింది. ఇందులో దాదాపు రూ.4,800 కోట్ల దాకా రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసింది. తొలిదశలో ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.30,436.95 కోట్లుగా కేంద్ర జల సంఘం ఖరారు చేసింది. ఇందులో ఇప్పటిదాకా రూ.23,658 కోట్లు మంజూరు చేసింది. మరో రూ.6,778.95 కోట్లు విడుదల చేయాల్సి ఉంది. ఇందులో నుంచి రూ.5,800 కోట్లు ఇవ్వాలని జలవనరుల శాఖ కేంద్రాన్ని కోరనుంది. 29న ఈ మేరకు అభ్యర్థన లేఖ పంపనుంది. నిధుల మంజూరుకు సిద్ధంగా ఉన్నామని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ ఇటీవల ఢిల్లీలో సీఎం చంద్రబాబుకు స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.

29న తుంగభద్ర బోర్డు సమావేశం

ఈ నెల 29వ తేదీన తుంగభద్ర బోర్డు సమావేశం జరగనుంది. తుంగభద్ర గేట్ల తయారీ, బిగింపు ప్రక్రియ, నీటి వినియోగంపైనా చర్చించనున్నారు. మరోవైపు.. కృష్ణా జలాల కేటాయింపులు, వాడకంపై వచ్చే నెల మొదటివారంలో కృష్ణా బోర్డు సమావేశం జరిగే అవకాశం ఉందని జల వనరుల శాఖ అధికారులు వెల్లడించారు.

పెట్టుబడిదారులను భయపెట్టే కుట్ర

▸ జన్మదినం రోజున వేటకొడవళ్ల ప్రదర్శనేమిటి?: పల్లా

అమరావతి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): జగన్ పుట్టిన రోజున వేట కొడవళ్లతో వైసీపీ శ్రేణులు ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేయడం శోచనీయమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'మారణాయుధాలు పట్టి ప్రదర్శనలు చేసే వారిపై ఆయుధ చట్టం కింద కేసులు నమోదు చేయాలి. పెట్టుబడిదారులను భయభ్రాంతులకు గురి చేసే కుట్రలో ఇదీ ఒక భాగం. జగన్‌కు నేర చరిత్ర ఉండటంతో ఆయన అనుచరులూ అదే తరహా పోకడలు పోతున్నారు. జగన్ కూడా వారిని ప్రోత్సహిస్తున్నారు' అని పల్లా ఆరోపించారు.

ఐఎస్ ఉగ్రవాదుల్లా వైసీపీ సైకోలు: అశోక్‌బాబు

అమరావతి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వేట కత్తులతో జగన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు చేస్తూ వైసీపీ సైకోలు రెచ్చిపోతున్నారని మాజీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ఎవరైనా పుట్టిన రోజు వేడుకలను రక్తదానాలు లేదా సేవా కార్యక్రమాలతో నిర్వహిస్తారు. కానీ వైసీపీ సైకోలు వేటకత్తులు, తల్వార్లతో పుట్టిన రోజు వేడుకను చేస్తున్నారు. ఐఎస్ ఉగ్రవాదుల్లానే వైసీపీ సైకోలు వ్యవహరిస్తున్నారు' అని అశోక్‌బాబు మండిపడ్డారు.

సంక్రాంతికి గుంతల రహిత రోడ్లు: జనార్దన్‌రెడ్డి

అమరావతి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రహదారులపై గుంతలు పూడ్చే పనులను జనవరి నాటికి పూర్తిచేయాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సంక్రాంతి నాటికి గుంతల రహిత రహదారులుగా మార్చాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, ఇంజనీర్లు ఈ దిశగా వర్కుల పర్యవేక్షణ చేయాలని మంత్రి ఆదేశించారు. గురువారం బనగానపల్లె నుంచి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఉమ్మడి కృష్ణా, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల ఆర్అండ్‌బీ ఇంజనీర్లు, ఉన్నతాధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. మూడు ఉమ్మడి జిల్లాలో పరిధిలో 7,575 కిమీ రహదారులున్నాయి. వాటిల్లో ప్యాచ్‌వర్కుల పురోగతిపై మంత్రి ఆరా తీశారు. సంక్రాంతి నాటికి రాష్ట్రంలోని రహదారులపై వాహనాల కదలికలు బాగుండాలని, గుంతలు కనిపించడానికి వీల్లేకుండా నిర్దిష్ట గడువులోగా ప్యాచ్‌వర్కులు పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.

గంజాయి కేసుల్లో పటాన్ అలీ అరెస్టు

▸ అదుపులోకి తీసుకొన్న విజయనగరం పోలీసులు

▸ విజయనగరం, బాపట్ల జిల్లాల్లో నాలుగు కేసులు

విజయనగరం క్రైం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణాతో పాటు విక్రయాల్లో కీలకంగా వ్యవహరిస్తున్న విజయనగరానికి చెందిన పటాన్ బాషా ఆలీని గురువారం పోలీసులు పక్కా ప్లాన్‌తో అరెస్టు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గంజాయి అక్రమ రవాణాపై కొరడా ఝళిపించడంతో పాటు అత్యంత కఠినమైన పీటీఎన్‌డీపీఎస్ చట్టాన్ని ప్రయోగిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో జిల్లా పోలీసులు పటాన్ బాషా ఆలీపై నిఘా పెట్టారు. ఈ క్రమంలో ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాలతో నగరంలోని ముస్లిం వీధిలోని నివాసం ఉంటున్న ఆలీని అదుపులోకి తీసుకున్నారు. సులభంగా డబ్బులు సంపాదించాలన్న దురాశతో గంజాయి రవాణా చేస్తున్న పటాన్‌బాషా ఆలీని పోలీసులు ఇప్పటికే వ్యవస్థీకృత నేరస్థుడిగా గుర్తించారు. ప్రభుత్వ ఆదేశాలతో తాజాగా అరెస్టు చేశారు. ఆలీపై ఇప్పటి వరకు నాలుగు కీలక కేసులు నమోదయ్యాయి. 2021లో విజయనగరం జిల్లా గంట్యాడ పోలీస్‌స్టేషన్‌లో, 2023లో బాపట్ల జిల్లా నిజాంపట్నం పోలీస్టేషన్లలో నమోదైన గంజాయి రవాణా కేసుల్లో అలీ నిందితుడిగా ఉన్నాడు. 2024లో విజయనగరం టూటౌన్ స్టేషన్‌లో గంజాయి విక్రయాల కేసు, ఇదే ఏడాది మరో గంజాయి రవాణా కేసు కూడా నమోదైంది. కాగా, అరెస్టు అనంతరం నిందితుడు పటాన్ బాషా ఆలీని విశాఖ సెంట్రల్ జైలుకు తరలించారు. విజయనగరం టూటౌన్ సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ గంజాయి రవాణా, విక్రయాలకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

ప్రతి దరఖాస్తుకూ జవాబుదారీ

(మొదటి పేజీ తరువాయి)

నియమిస్తారు. ప్రతి సోమవారం వచ్చే అర్జీలతోపాటు, సాధారణంగా కలెక్టరేట్‌కు వచ్చే విన్నపాలను కూడా ఈ డెస్క్ పర్యవేక్షిస్తుంది. ప్రతి అర్జీకీ ఓ ఆన్‌లైన్ నంబర్ కేటాయిస్తారు. ఆ అర్జీపై దరఖాస్తుదారు ఆధార్, ఫోన్ నంబర్ ఉండేలా ఏర్పాట్లు చేయనున్నారు. పౌరుల నుంచి వచ్చే అర్జీలు డెస్క్ తీసుకున్నాక దాని పరిష్కారం ఎలా ఉంటుందో తెలిపే కార్యాచరణకు సంబంధించిన సర్టిఫైడ్ కాపీని దరఖాస్తు దారుకు అందించనున్నారు. దీని వల్ల తన సమస్య తీవ్రత ఏమిటి....ఎప్పటిలోగా పరిష్కారం అవుతుంది... అది ఏ స్థాయిలో నిర్ణయాలు తీసుకుంటే పరిష్కారం అవుతుంది....ఇందుకు పట్టే సమయం ఎంతన్నది ఆ కాపీలో ఉంటుంది. దానిపై డిప్యూటీ కలెక్టరు సంతకం చేస్తారు. దీంతో పౌరులు ఇచ్చే పిటిషన్లకు జవాబుదారీ ఉంటుందని, దాని పరిష్కారం కూడా పారదర్శకంగా, జవాబుదారీ విధానంలో ఉంటుందని అధికారవర్గాలు చెబుతున్నాయి. డెస్క్‌లో కీలకంగా చెక్‌లిస్టు విధానం ప్రతిపాదించారు. అంటే, ఒక పిటిషన్ ఎప్పుడు వచ్చింది? దానిపై ఇచ్చిన కార్యాచరణ ఏమిటి? అది ఇప్పుడు ఏ స్థాయిలో ఉంది? అంతిమంగా దాని పరిష్కారం ఏ స్థాయిలో ఉంటుంది? ఇంకా పిటిషన్ ఇచ్చిన పౌరుడికి సర్టిఫైడ్ కాపీ ఇచ్చారా.. వంటి అంశాలు అందులో ఉంటాయి. పిటిషన్ స్వీకరించినప్పటి నుంచి పరిష్కారం వరకు దశలవారీగా చెక్‌లిస్టులోని అంశాలను ఎంపిక చేస్తారు. దీని వల్ల ఒక పిటిషన్ ఎప్పుడు వచ్చింది...అది ఇప్పుడు ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చని చెబుతున్నారు.

ప్రత్యేక సాఫ్ట్‌వేర్.. రెవెన్యూ డెస్క్‌కు పౌరులు ఇచ్చే పిటిషన్లు తీసుకోవడం, వాటి పరిష్కారం, ఇంకా అవి తిరిగే మార్గాలను ప్రభుత్వ స్థాయిలో తెలుసుకునేలా ప్రత్యేకంగా ఓ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించాలని రెవెన్యూశాఖ భావిస్తోంది. దీనివల్ల పౌరుల పిటిషన్లకు పారదర్శకత, జవాబుదారీతనం ఉంటాయని చెబుతోంది. ఒకే అంశంపై పౌరులు పిటిషన్‌లు ఇస్తున్నారా? గతంలో ఇచ్చిన దానిపై తీసుకున్న నిర్ణయాలు ఏమిటి? వాటి కార్యాచరణ ఎలా ఉందనేది కూడా ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా తెలుసుకునే ఏర్పాట్లు చేయాలనుకుంటున్నారు. ప్రజల నుంచి తీసుకునే పిటిషన్లపై మండల, జిల్లా స్థాయిలో కేవలం ఈ-ఆఫీస్ ఫైల్స్‌నే నడిపించనున్నారు. ఈ దిశగా సాఫ్ట్‌వేర్‌ను డెవలప్ చేయలనుకుంటున్నారు.



మాజీ ప్రధాని వాజపేయి జీవిత విశేషాలకు సంబంధించిన ఫొటో ఎగ్జిబిషన్‌ను చూస్తున్న సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి చౌహాన్



శివరాజ్ సింగ్ చౌహాన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న సీఎం చంద్రబాబు



అమరావతిలో నిర్వహించిన సుపరిపాలన దినోత్సవం సభలో కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర మంత్రులు నారాయణ, సత్యకుమార్ యాదవ్, దుర్గేశ్, బీజేపీ, టీడీపీ నేతలు

పీపీపీతోనే ప్రగతి!

(మొదటి పేజీ తరువాయి)

మండిపడ్డారు. వాజపేయి జయంతి (డిసెంబరు 25) సందర్భంగా అటల్-మోదీ సుపరిపాలన యాత్రను రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆధ్వర్యంలో ప్రతి జిల్లా కేంద్రంలోనూ మాజీ ప్రధాని విగ్రహాలు ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అంతిమంగా గురువారం అమరావతిలోని వెంకటపాలెంలో సీఎం చంద్రబాబు, కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ 13 అడుగుల వాజపేయి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సుపరిపాలన సభలో చంద్రబాబు మాట్లాడారు. భారత రాజకీయాల్లో రాజనీతిజ్ఞుడిగా అరుదైన గౌరవం దక్కించుకున్న వాజపేయి దేశ ప్రగతికి తీవ్రంగా కృషి చేశారని కొనియాడారు. 'ఆయన చేపట్టిన పనులు శాశ్వతం.. ఈ దేశం ఉన్నంత వరకూ ఆయన ప్రజల గుండెల్లో ఉంటారు. ఆర్థిక సంస్కరణలు ప్రారంభించింది మన తెలుగు బిడ్డ పీవీ నరసింహరావు అయితే వాటిని కొనసాగించి దేశ భవిష్యత్‌కు బాటలు వేసిన మహనీయుడు వాజపేయి. దేశ నిర్మాణంలో దార్శనికత.. అచంచల సంకల్పం ఉన్న గొప్ప నేత. పాలనకు కొత్తరూపం ఇచ్చి.. దేశ భద్రతను బలోపేతం చేసిన అసలైన దేశభక్తుడు. ఆయన జ్ఞానం, వినయం, విలువలు, కల్మషం లేని మనస్తత్వం తరతరాలకూ ఆదర్శం. కొందరు నేతలు స్వార్థంతో ఉంటారు. మహానుభావులు దేశం కోసమే ఆలోచిస్తారు. పోఖ్రాన్‌లో అణుపరీక్షలతో దేశాన్ని ప్రపంచంలో గొప్ప శక్తిగా తీర్చిదిద్దిన ప్రఖ్యాత క్షిపణి శాస్త్రవేత్త, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం, వాజపేయి వంటి గొప్పవారితో కలిసి పనిచేసే అవకాశం దక్కడం నా అదృష్టం. అమరావతిలో వాజపేయి కాంస్య విగ్ర హం, స్మృతివనం ఏర్పాటు ఆయనకు అసలైన నివాళి. కాంగ్రెసేతర ప్రభుత్వాలు ఏర్పాటు చేసినవారిలో ఎన్టీఆర్, వాజపేయి ఆద్యులు. ఆ ఇద్దరూ నాకు స్ఫూర్తి' అని స్పష్టంచేశారు.

రాజధాని కోసం యజ్ఞం

ఆంధ్రప్రదేశ్‌ను దేశంలో అగ్రభాగాన, అమరావతిని ప్రపంచం మెచ్చే రాజధానిగా తీర్చిదిద్దే యజ్ఞం చేస్తున్నామని సీఎం అన్నారు. 'అమరావతి నిర్మాణానికి 33 వేల ఎకరాలిచ్చిన 29 వేల మంది రైతులకు చేతులెత్తి మొక్కుతున్నా.. కేంద్రం సహకారంతో రాజధాని నిర్మాణం వేగంగా చేపడుతున్నాం.. కొత్త సంవత్సరంలో గేర్ మార్చి మరింత స్పీడ్ పెంచుతాం.. ప్రపంచ స్థాయి రాజధాని పూర్తి చేస్తాం..' అని ధీమా వ్యక్తం చేశారు. అప్పుడు సైబరాబాద్‌లో హైటెక్ సిటీతో.. ఇప్పుడు అమరావతిలో క్వాంటమ్ వ్యాలీతో.. రాష్ట్రం దూరదృష్టితో ముందుకు వెళ్తోందని చెప్పారు. 'రాజధాని, పోలవరం, విశాఖ స్టీల్ ప్లాంట్, జాతీయ రహదారులు ఇతర అభివృద్ధిలో ప్రధాని ఆంధ్రప్రదేశ్‌కు పూర్తిగా సహకరిస్తున్నారు. ఎప్పుడూ ప్రజల్లో ఉండే అరుదైన నాయకుల్లో కేంద్ర మంత్రి చౌహాన్ ఒకరు. అటువంటి నేతతో కలిసి వాజపేయి విగ్రహాన్ని ఆవిష్కరించడం ఆనందంగా ఉంది' అని తెలిపారు. అన్ని జిల్లాల్లో విగ్రహాల ఏర్పాటులో కూటమి పార్టీలు ఉమ్మడిగా పాల్గొనడం ఐక్యతకు చిహ్నమన్నారు. ఈ కార్యక్రమాన్ని చేపట్టి ఘనంగా పూర్తి చేసిన మాధవ్‌ను అభినందించారు.

సెల్ ఫోన్ అన్నం పెడుతుందా అన్నారు

ఒకప్పుడు తాను సెల్ ఫోన్ గురించి మాట్లాడితే, అన్నం పెడుతుందా అంటూ ఎద్దేవా చేశారని సీఎం గుర్తుచేశారు. టెలికాం రంగం నాలెడ్జ్ ఎకానమీకి వెన్నెముకని.. ఈ విషయాన్ని గుర్తించిన వాజపేయి ఈ రంగంలో సంస్కరణలు తీసుకొచ్చారని.. ఇప్పుడు మోదీ బీఎస్ఎన్ఎల్‌ను 4జీ వైపు తీసుకురావడం మొబైల్ రంగంలో విప్లవానికి దారి తీసిందన్నారు.



సభకు హాజరైన మహిళలు

దేశమే వాజపేయికి ప్రథమం!

▸ చివరి దాకా ఆ సిద్ధాంతానికే కట్టుబడ్డారు

▸ అప్పట్లో చంద్రబాబు ఐటీ మ్యాన్

▸ ఇప్పుడు ఏఐ వైపు దూసుకెళ్తున్నారు: చౌహాన్

రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు శాశ్వతం కాదు.. దేశమే ప్రథమం అంటూ చివరి దాకా అదే సిద్ధాంతానికి వాజపేయి కట్టుబడి ఉన్నారని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. అమెరికా లాంటి అగ్రదేశాల ఒత్తిళ్లను లెక్క చేయకుండా అణు పరీక్షలు నిర్వహించి భారత్‌ను బలమైన రాజ్యంగా తీర్చిదిద్దిన మహనీయుడన్నారు. 'దేశ భక్తుడైన వాజపేయి 1971లో భారత్-పాక్ యుద్ధ సమయంలో ఇందిర ప్రభుత్వానికి బలంగా మద్దతిచ్చారు. ఇప్పుడు అదే పాక్‌పై మోదీ 'ఆపరేషన్ సిందూర్' చేపడితే మద్దతుగా ఉండాల్సిన ఇందిర మనవడు, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ దానిని ప్రశ్నించడం దేశాన్ని బలహీనపరచడమే' అని వ్యాఖ్యానించారు. రాజనీతిజ్ఞుడిగా 'ఓటమిని ఒప్పుకోను.. పోరుకు వెనుకాడను.. కాలం నుదుటిపై పాతను చెరిపేస్తా.. కొత్త రాతను లిఖిస్తా.. నూతన గీతాన్ని ఆలపిస్తా..' అంటూ తన చిన్నప్పుడు వాజపేయి చేసిన ప్రసంగం స్ఫూర్తి నింపిందన్నారు. ఆయన ప్రసంగం విన్న నెహ్రూ సైతం ఏదో ఒక రోజు ప్రధాని అవుతావంటూ చేసిన వ్యాఖ్యలు నిజమయ్యాయని చెప్పారు. అటల్-చంద్రబాబు భాగస్వామ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం దేశంలో అద్భుతాలు సృష్టించిందని, ఇప్పుడు మోదీ-చంద్రబాబు కూటమి వికసిత్ భారత్ వైపు వేగంగా అడుగులు వేస్తోందన్నారు. అప్పట్లో చంద్రబాబును అందరూ ఐటీ మ్యాన్ అనేవారని.. ఇప్పుడు క్వాంటమ్ వ్యాలీతో ఏఐ వైపు దూసుకెళ్తున్నారని ప్రశంసించారు. వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రిగా రాష్ట్ర రైతులు, గ్రామీణుల కోసం తోడుగా ఉంటానని మాటిచ్చారు. రాష్ట్ర ప్రజలన్నా, చంద్రబాబన్నా తనకెంతో ప్రేమ అంటూ 'ఆంధ్రప్రదేశ్ ప్రజలకు నా నమస్కారాలు' అని తెలుగులో మాట్లాడారు.

వ్యక్తిత్వం.. సాహసం.. వాజపేయి సొంతం: పెమ్మసాని



వ్యక్తిత్వానికి, సాహసానికి వాజపేయి ప్రతిరూపమని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అభివర్ణించారు. అహంకారం లేని నాయకుడని.. శాంతి కోసం పాకిస్థాన్‌కు బస్సులో వెళ్లారని.. ఆ దేశం వక్రబుద్ధి చూపితే కార్గిల్ యుద్ధంతో తగిన బుద్ధి చెప్పారని గుర్తు చేశారు.

పేదల ఆకలి తీర్చే అంత్యోదయ: మంత్రులు..

దేశ భద్రతపై రాజీ పడకుండా అణుపరీక్షలు నిర్వహించిన వాజపేయి పేద ప్రజల ఆకలి తీర్చేందుకు అంత్యోదయ పథకానికి అంకురార్పణ చేశారని రాష్ట్ర మంత్రులు కొనియాడారు. విలువలతో కూడిన రాజకీయాలకు, సుపరిపాలనకు బ్రాండ్ అయిన వాజపేయి ఒక్క ఓటుతో ఓడిపోయినప్పుడు పార్లమెంటులో చేసిన ప్రసంగం ప్రపంచ చరిత్రలో ఇప్పటికీ గొప్పగానే ఉందని పర్యాటక మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఒక్క మరక కూడా లేని ఆయన.. సమస్యలపై పోరాడడమే కాదు పరిష్కారాన్ని కూడా చూపిన జ్ఞాని అని వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ అన్నారు.

అందరికీ ఆదర్శప్రాయుడు: మాధవ్

విలువలతో కూడిన రాజకీయాలు చేసి అందరికీ ఆదర్శప్రాయుడిగా వాజపేయి నిలిచారని పీవీఎన్ మాధవ్ వ్యాఖ్యానించారు. రాజకీయ ప్రత్యర్థులు తప్ప శత్రువులు, మచ్చలు లేని స్వచ్ఛమైన నాయకుడి విగ్రహం అమరావతిలో మొదటిది కావడం సంతోషంగా ఉందన్నారు. సీఎం చంద్రబాబు చొరవతో అటల్ విగ్రహ ఏర్పాటు, స్మృతివనం సాకారవుతున్నాయని అన్నారు. ఆయన ఆశయాలను మోదీ ముందుకు నడిపిస్తున్నారని, భారత్ బలమైన శక్తిగా ఎదిగి తీరుతుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ గుర్తు కమలంలోని ఐదు రెక్కలను పంచ నిష్ఠలుగా వాజపేయి భావించారని, దేశంలోని ప్రతి బీజేపీ కార్యకర్తా అదే స్ఫూర్తితో సాగుతున్నారని అన్నారు. కార్యక్రమంలో మంత్రి పి.నారాయణ, ఎంపీలు సీఎం రమేశ్, పాకా సత్యనారాయణ, ఎమ్మెల్యేలు శ్రవణ్ కుమార్, రామాంజనేయులు, ఆదినారాయణరెడ్డి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, కూటమి పార్టీల నేతలు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు భారతరత్న రప్పించండి

చంద్రబాబు ప్రసంగిస్తుండగా.. జనంలో నుంచి ఓ వ్యక్తి లేచి.. ఎన్టీఆర్‌కు భారతరత్న వచ్చేలా చూడాలని కోరాడు. వస్తుందని సీఎం హామీ ఇచ్చారు.



జయసూర్య



రఘువీర్

భీమవరం డీఎస్పీ జయసూర్యపై బదిలీ వేటు

▸ హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని ఆదేశం

▸ వివాదాల్లో తలదూరుస్తున్నారని ఆరోపణలు

▸ పవన్ కల్యాణ్‌కు బాధితుల ఫిర్యాదులు

▸ వాటిపై ఎస్పీతో మాట్లాడిన ఉపముఖ్యమంత్రి

▸ ప్రభుత్వ ఆదేశాలతో ఎస్పీ విచారణ

▸ కొత్త డీఎస్పీగా రఘువీర్ విష్ణు నియామకం

భీమవరం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్యపై బదిలీ వేటు పడింది. ఆయనకు ప్రభుత్వం ఎక్కడా పోస్టింగ్ కూడా ఇవ్వలేదు. మంగళగిరిలోని పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా ఆదేశాలు జారీచేశారు. జయసూర్య స్థానంలో భీమవరం డీఎస్పీగా రఘువీర్ విష్ణును నియమించారు. జయసూర్యను ప్రత్యేకంగా బదిలీ చేసి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకపోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. వాస్తవానికి ఆయన వ్యవహార శైలి వివాదాస్పదమైంది. సెటిల్‌మెంట్లలో తలదూర్చారన్న ఆరోపణలు వచ్చాయి. దీంతో కొందరు బాధితులు నేరుగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఫిర్యాదు చేశారు. వాటిపై ఆయన తక్షణమే స్పందించారు. పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ నయీమ్‌తో ఫోన్లో మాట్లాడారు. ఫిర్యాదులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సూచించారు. హోం మంత్రి అనిత, డీజీపీ దృష్టికి కూడా తీసుకెళ్లడంతో ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఎస్పీని ఆదేశించింది. ఆయన బాధితులను రప్పించి విచారించారు. ఇదే సమయంలో.. జయసూర్య డీఎస్పీ విధుల్లో ఉండగానే ఫిర్యాదులపై విచారణ చేస్తే వాస్తవాలు ఎలా చెప్పగలరన్న వాదన వినిపించింది. ఇటీవల జయసూర్య కాలికి గాయమైంది. కొద్ది రోజుల క్రితం సెలవు పెట్టారు. గడచిన 20 రోజుల నుంచి సెలవులోనే ఉన్నారు.

సెటిల్‌మెంట్లే ముంచాయా?

సివిల్ తగాదాల్లో తలదూర్చడం, పేకాటలో తలెత్తిన వివాదంలోనూ సెటిల్‌మెంట్లు నిర్వహించారన్న ఫిర్యాదులు డీఎస్పీ జయసూర్యపై అధికమయ్యాయి. పవన్ కల్యాణ్‌కు వీటిపైనే ఫిర్యాదులు అందాయి. ప్రభుత్వం విచారణకు ఆదేశించిన తరుణంలోనే డీఎస్పీకి డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు మద్దతు పలికారు. మంచి వ్యక్తి అని కితాబిచ్చారు. పవన్ కల్యాణ్ అన్ని శాఖల్లోనూ జోక్యం చేసుకుంటున్నారని పరోక్ష వ్యాఖ్యలు చేశారు. అయితే విచారణ నివేదిక ఆధారంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఇవన్నీ అప్పట్లో జిల్లాలో సంచలనం రేకెత్తించాయి. అయితే విచారణ వివరాలు బయటకు పొక్కకుండా పోలీసు అధికారులు గోప్యత పాటించారు. జయసూర్యపై ఫిర్యాదులు, విచారణ అంతా సద్దుమణిగిపోయిందనుకున్న తరుణంలో ప్రభుత్వం ఆకస్మికంగా ఆయనపై బదిలీ వేటు వేయడం గమనార్హం.

వ్యవసాయాభివృద్ధికి సహకరించండి

కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్‌కు సీఎం చంద్రబాబు విజ్ఞప్తి



శివరాజ్ సింగ్ చౌహాన్‌కు తన నివాసం వద్ద స్వాగతం పలుకుతున్న సీఎం చంద్రబాబు



రాష్ట్రంలో వ్యవసాయ అభివృద్ధికి సహకరించాలని కోరుతూ శివరాజ్ సింగ్ చౌహాన్‌కు వినతి పత్రం అందిస్తున్న సీఎం

అమరావతి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతుల ఆదాయాన్ని పెంపొందించేలా వ్యవసాయ-అనుబంధ రంగాలను సమగ్రంగా అభివృద్ధి చేయడానికి కేంద్రం మరింత సహకరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కొబ్బరి పార్క్, ఆక్వా ల్యాబ్, మామిడి బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ గురువారం ఉండవల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయానికి మర్యాదపూర్వకంగా విచ్చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వ్యవసాయ రంగ సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పలు విజ్ఞప్తులతో కూడిన వినతిపత్రాన్ని సీఎం అందించారు. ఏపీ పునర్విభజన చట్టం-2014లోని షెడ్యూల్ 13లో పేర్కొన్నట్టుగా రాష్ట్రంలో కేంద్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు సంబంధించి రూ.2,585 కోట్ల అంచనాతో డీపీఆర్‌ను వ్యవసాయ పరిశోధన, విద్య విభాగానికి సమర్పించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగ అభివృద్ధికి, రైతు సంక్షేమానికి తీసుకున్న చర్యలను కేంద్రమంత్రికి వివరించారు. వ్యవసాయ-అనుబంధ రంగాల్లో 10.70 శాతం వృద్ధి నమోదు చేశామని, ఇందుకోసం పంచ సూత్రాల ప్రణాళికను అమలు చేస్తున్నామని తెలిపారు.

సీఎం విజ్ఞప్తులివీ..

- పీఎం ఆర్కేవీవై-పీడీఎంసీ పథకం కింద సూక్ష్మ సాగునీటి విస్తరణకు అదనంగా రూ.695 కోట్లు కేటాయించాలి.
- అరటి పంట రవాణాలో నష్టాలు తగ్గించేందుకు, మార్కెట్ యాక్సెస్ పెంచేందుకు రైల్వే వ్యాగన్ల ద్వారా అరటి రవాణాకు సబ్సిడీ కల్పించాలి.
- కొబ్బరి ఆధారిత పరిశ్రమల అభివృద్ధికి రూ.200 కోట్ల అంచనా వ్యయంతో కొబ్బరి పార్క్ ఏర్పాటుకు అనుమతివ్వాలి.
- పట్టు పురుగుల పెంపకం షెడ్లకు వీబీ జీరామ్‌జీ కింద సాయం చేయాలి.
- ప్రకృతి సాగులో శాస్త్రీయ పరిశోధనలకు ప్రాధాన్యం కల్పించాలి.
- పీఎం-ప్రణాం కింద నిధుల విడుదలను వేగవంతం చేయాలి.
- ఎన్ఎంఎన్ఎఫ్(ప్రకృతి సాగు జాతీయ మిషన్) కింద 2026-27 సంవత్సరానికి 10వేల ప్రకృతి సాగు కస్టర్లకు అనుమతివ్వాలి.
- 2025-26లో మంజూరైన 5వేల కస్టర్ల నిర్వహణ ఖర్చులు కేంద్రం భరించాలి.
- రాష్ట్రంలో 40 లక్షల మంది రైతులు ప్రకృతి సాగు అమలు చేస్తున్న నేపథ్యంలో వచ్చే ఐదేళ్లలో 20వేల అదనపు క్లస్టర్లను కేటాయించాలి.
- ప్రకృతి సాగుకు జాతీయ వనరుల రాష్ట్రంగా ఏపీని ప్రకటించాలి.
- విజయవాడ, అమరావతిలో అత్యాధునిక ఆక్వా ల్యాబ్ ఏర్పాటు చేయాలి.
- పులికాట్ సరస్సు అభివృద్ధికి నిధులివ్వాలి.
- ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా 20వేల మిలియన్ కిలోల హెచ్డీ బర్లీ పొగాకు సేకరణకు రూ.150 కోట్లు సాయం చేయాలి.
- రాష్ట్రంలో మామిడి బోర్డు, ఐసీఏఆర్ ప్రాంతీయ కార్యాలయాల ఏర్పాటుకు అనుమతివ్వాలి.
- ఎన్ఎఫ్‌డీబీ(జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు)ను అమరావతికి తరలించాలి.
- ప్రధానమంత్రి మత్స్య సంపద యోజనకింద సబ్సిడీని 60శాతానికి పెంచాలి.
- అమరావతిలో అఖిల భారత రొయ్యల సమాఖ్యను ఏర్పాటు చేయాలి.

పీపీపీ విధానమే భేష్!

మంత్రి సత్యకుమార్‌కు కేంద్ర మంత్రి నడ్డా లేఖ

అమరావతి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాల అభివృద్ధి, వివిధ రంగాల్లో మౌలిక సదుపాయాల విస్తృతికి భారీగా తోడ్పడిన పీపీపీ విధానానికి వైద్యారోగ్య రంగంలో కూడా భారీ అవకాశాలున్నాయని కేంద్రప్రభుత్వం తెలిపింది. వాటిని విరివిగా వాడుకునేందుకు మూడేళ్లలో చేపట్టే ప్రణాళికలను శీఘ్రంగా రూపొందించాలని రాష్ట్రప్రభుత్వానికి సూచించింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా.. రాష్ట్ర వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్‌కు రెండ్రోజుల కింద వివరణాత్మకంగా లేఖ రాశారు. ఇందులో 2000వ సంవత్సరం నుంచి రవాణా, రహదారులు, విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, ఇంధనం, పట్టణ మౌలిక సదుపాయాలు తదితర రంగాల్లో పీపీపీ ద్వారా సాధించిన విజయాలను, సత్ఫలితాలను వివరించారు. ఆరోగ్య రంగంలో పీపీపీ అమలుకు సంబంధించిన ఐదు పేజీల విధాన పత్రాన్ని పంపారు. ఈ రంగంలో పీపీపీని ప్రోత్సహించేందుకు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) కింద వైద్య కళాశాలల ఏర్పాటు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు మొత్తం ప్రాజెక్టు వ్యయంలో 60 శాతం సాయం అందుతుందని నడ్డా లేఖలో పేర్కొన్నారు. పైలట్ ప్రాజెక్టు ఖర్చులో 80 శాతం, మొదటి ఐదేళ్లకు నిర్వహణ వ్యయంలో 50 శాతం వీజీఎఫ్ లభిస్తుందని కూడా వివరించారు. వీజీఎఫ్‌లో కేంద్రం, రాష్ట్రాలు చెరి సగం భరిస్తాయన్నారు. 'పీపీపీ విధానంలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో అందే నైపుణ్యం, సృజనాత్మకత, నిధుల సమీకరణతో విస్తృత ప్రయోజనాలు కలుగుతాయి. బాధ్యతలు, రిస్కులను పంచుకోవడం ఈ విధానం ప్రధాన లక్ష్యం' అని వెల్లడించారు. పీపీపీతో కలిగే ఏడు ప్రయోజనాలను లేఖలో ప్రస్తావించారు. 'మౌలిక వసతులు భారీగా విస్తరిస్తాయి. సేవల నాణ్యత పెరుగుతుంది. సృజనాత్మకతకు లభించే తోడ్పాటుతో ప్రస్తుతమున్న సదుపాయాలను సమర్థంగా వినియోగించుకోవచ్చు. రిస్కును పంచుకోవడం ద్వారా ప్రాజెక్టుల స్థిరాభివృద్ధి జరుగుతుంది. జవాబుదారీతనంతో పాటు పారదర్శకతా మెరుగుపడుతుంది. అంతిమంగా నాణ్యతతో కూడిన, వేగవంతమైన సేవలు రోగులకు లభిస్తాయి' అని వివరించారు. కేంద్రం ఇప్పటికే రూ.2 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులను వీజీఎఫ్ కింద ఆమోదించిందన్నారు. 20 రాష్ట్రాల్లో 919 డయాలసిస్ సెంటర్లు పీపీపీ పద్ధతుల్లో నడుస్తున్నాయన్నారు. వైద్య రంగంలో విస్తృతంగా ఆవిష్కృతమవుతున్న పీపీపీ అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ప్రణాళికల రూపకల్పనకు, కేంద్రంతో సమన్వయానికి ప్రత్యేక పీపీపీ సెల్‌ను ఏర్పాటు చేయాలని సత్యకుమార్‌కు సూచించారు. లేఖలోని అంశాలను చదివిన సత్యకుమార్.. పీపీపీ ప్రయోజనాలను వివరించినందుకు నడ్డాకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో పీపీపీ విధానంలో 10 వైద్య కళాశాలలను అభివృద్ధి చేసే దిశగా కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను వివరిస్తూ తిరిగి లేఖ రాశారు. ఇందుకు కేంద్ర సహాయాన్ని కోరారు.



పులివెందుల సీఎస్ఐ చర్చిలో క్రిస్మస్ ప్రార్థనల్లో వైఎస్ జగన్

కుటుంబంతో క్రిస్మస్ వేడుకల్లో జగన్

పులివెందుల, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం వైఎస్ జగన్ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. గురువారం ఉదయం 9 గంటల ప్రాంతంలో పులివెందులలోని సీఎస్ఐ చర్చికి వచ్చారు. తల్లి విజయలక్ష్మి, సతీమణి భారతితో కలసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తల్లి విజయలక్ష్మి, జగన్‌కు కేక్ తినిపించి ముద్దాడారు. ఈ సందర్భంగా నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన చర్చిలో ఉన్న వారందరినీ పలకరిస్తూ బయటకు వచ్చారు. చర్చి బయట ప్రజలు, అభిమానులు పెద్దఎత్తున ఆయన్ను కలిసేందుకు ఎగబడ్డారు. కానీ అస్వస్థతతో ఉండడంతో ఎవ్వరినీ కలవకుండా అందరికీ అభివాదం చేస్తూ వాహనం ఎక్కి రోడ్డు మార్గాన బాకరాపురంలోని హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. 11.15 గంటల ప్రాంతంలో ప్రత్యేక హెలికాప్టర్‌లో బెంగళూరుకు వెళ్లిపోయారు. దీనితో మాజీ సీఎం జగన్ మూడు రోజుల పర్యటన ముగిసింది. ఈ కార్యక్రమంలో కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, వైఎస్ మదన్‌మోహన్ రెడ్డి, వైఎస్ ప్రకాశ్‌రెడ్డి, వైఎస్ ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థుల స్కాలర్‌షిప్పులు విడుదల

▸▸ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి వెల్లడి



అమరావతి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థులపోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల విషయంలో గత ప్రభుత్వ కాలంలో పెండింగ్ ఉన్న బకాయిలను కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని పరిష్కరించిందని గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరంలో గత ప్రభుత్వం కేవలం రూ.18.67 కోట్లు విడుదల చేయగా, పెండింగ్‌లో ఉన్న మూడు త్రైమాసికాలకు గాను రూ.71.67 కోట్లు కూటమి ప్రభుత్వ నేరుగా 69,227 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమచేసిందని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 విద్యా సంవత్సరం స్కాలర్‌షిప్పు నిధులు ఆర్‌టీఎఫ్ కింద రూ.85.67 కోట్లు కళాశాలల ఖాతాల్లోకి, ఎంటీఎఫ్ రూ.9.11 కోట్లు విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి మొత్తం 42,203 మందికి విడుదల చేసినట్టు తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి ప్రస్తుతం అర్హులైన విద్యార్థులకు నిధులను విడుదల చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు మొత్తం రూ.100.93 కోట్లు విడుదల చేసి, 59,297 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకున్నామన్నారు. తద్వారా గిరిజన విద్యార్థుల విద్య నిలకడగా, సానుకూలంగా కొనసాగుతుందని పేర్కొన్నారు.

టెండర్లలో పాల్గొనే అర్హత మాకుంది: విక్టరీ బజార్

అమరావతి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమశాఖ చేపట్టిన కాస్మెటిక్ టెండర్లలో పాల్గొనే అర్హత తమ సంస్థకు ఉందని అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలేనికి చెందిన విక్టరీ బజార్ సంస్థ సీఈవో ఒక ప్రకటనలో తెలిపారు. 'కాస్మెటిక్ కాంట్రాక్టులో కిరికిరి' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తపై గురువారం ఆయన స్పందించారు. "సాంఘిక సంక్షేమశాఖ పిలిచిన కాస్మెటిక్ కిట్ల సరఫరా టెండర్లలో గత అక్టోబరు 10న మేం పాల్గొన్నాం. టెండరు నిబంధనలకు అనుగుణంగానే డాక్యుమెంట్లు పొందుపరిచాం. మా సంస్థకు రూ.400 కోట్ల వార్షిక టర్నోవర్ ఉంది. కాస్మెటిక్ వస్తువులు సరఫరా చేసే అన్ని అర్హతలూ మాకు ఉన్నాయి" అని పేర్కొన్నారు.



సాగు భళా!

నరసరావుపేటకు చెందిన ఓ ప్రవాస రైతు టెక్సాస్- ఒక్లహోమా సరిహద్దుల్లో 17 ఎకరాల్లో సేంద్రీయ పద్ధతుల్లో పలు రకాల కూరగాయలు పండించి స్థానిక భారతీయ దుకాణాలకు సరఫరా చేస్తున్నారు.

(మొదటిపేజీ తరువాయి)

కనిపిస్తోంది. తక్కువ ధరకు పెద్దమొత్తంలో వ్యవసాయ భూములు సొంతం చేసుకొనే అవకాశం ఉండటం కూడా వారికి కలిసి వస్తోంది. రియల్ ఎస్టేట్ బూమ్‌తో సమీప భవిష్యత్తులో భూమి విలువ పెరుగుతుందనే అంచనాలతో వందలాది ఎకరాలు సేకరిస్తున్నారు. కొందరు పూర్తిస్థాయి రైతులుగా మారుతుంటే.. మరికొందరు దీన్ని ఒక అదనపు ఆదాయ వనరుగా భావిస్తున్నారు.

శిస్తు అంతంతే...

అమెరికాలో సాగు భూములకు పన్ను చాలా తక్కువ. వ్యవసాయం, పాడి పరిశ్రమకు సంబంధించిన కార్యకాలపాలు సాగించే భూములకే ఈ మినహాయింపు వర్తిస్తుంది. ఈ నేపథ్యంలో భూములు కొనుగోలు చేసినవారు వారాంతాల్లో పొలానికి వెళ్లడం, పంటల పెరుగుదలను స్వయంగా పర్యవేక్షించడంతో పాటు పశువుల పెంపకం ద్వారా గ్రామీణ జీవనాన్ని ఆస్వాదిస్తున్నారు. మరోవైపు పన్ను ప్రయోజనాలు కూడా పొందుతున్నారు. భూములు ఉన్న ప్రాంతంలో నివాసం ఉండని యజమానులు స్థానిక రైతులకు పొలం లీజుకు ఇస్తున్నారు. లేకుంటే తామే కూలీలను నియమించుకుని సొంతంగా సాగు చేసుకుంటున్నారు. వ్యవసాయ భూముల్లో తెలుగువారి పెట్టుబడులు గ్రామీణ ప్రాంతాలకు కొత్త మూలధనాన్ని, ఆధునిక పద్ధతులను, భిన్నమైన పంటలను పరిచయం చేస్తోంది.

అమెరికా మొత్తం వ్యవసాయ భూముల్లో విదేశీయుల వాటా చాలా తక్కువ. యునైటెడ్ స్టేట్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ (యూఎస్‌డీఏ) తాజా నివేదిక ప్రకారం, 2023లో అమెరికాలోని వ్యవసాయ భూముల్లో 4 కోట్ల 58 లక్షల ఎకరాలు విదేశీ పెట్టుబడిదారుల అధీనంలో ఉన్నాయి. ఇది ఆ దేశంలోని మొత్తం ప్రైవేట్ రైతు భూముల్లో 3.61 శాతానికి సమానం.

ఏజీ5 వర్గీకరణపై మక్కువ

అమెరికాలో వ్యవసాయ వర్గీకరణ పొందాలంటే భూమి కనీసం 5 ఎకరాల విస్తీర్ణంలో ఉండాలి. భూమిని చిన్న భాగాలుగా విభజించి అమ్మాలంటే కూడా, ప్రతి భాగం కనీసం ఐదెకరాలు ఉండాలి. దీనితోపాటు ఆ భూమిలో వ్యవసాయ సంబంధిత కార్యకలాపాలు కచ్చితంగా నిర్వహించాలి. ఏజీ5 భూములకు ప్రాథమిక మౌలిక వసతులు ఉండాలి. రోడ్లు, డ్రైనేజీ సదుపాయాలను అభివృద్ధి చేయాలి. ఈ వర్గీకరణలో అమ్మే భూములు మరింత భద్రతతో ఉండటంతో పాటు, వాటి ధర కూడా ఎక్కువే. ఇటువంటి వాటిని కొనుగోలు చేయడానికి ప్రవాసులు ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నారు. వీరిలో కొందరు వ్యవసాయం పట్ల నిజమైన ప్రేమతో పూర్తిస్థాయి రైతులుగా స్థిరపడుతున్నారు. పంటల సాగు, పశువుల పెంపకంపై ఆసక్తితో, అత్యాధునిక సాంకేతికతను ఉపయోగిస్తూ వ్యవసాయాన్ని జీవన విధానంగా స్వీకరిస్తున్నారు.



ఆరిజోనాలోని తమ పిస్తా ఫామ్‌లో కుటుంబసభ్యులతో గంగాధర్

250 ఎకరాల్లో పండ్ల సాగు



కృష్ణాజిల్లా మచిలీపట్నానికి చెందిన గొర్రెపాటి చందు, రాజమహేంద్రవరానికి చెందిన సుధీర్ దుగ్గిరాల అమెరికాలో స్థిరపడ్డారు. వీరు ఫ్లోరిడాలోని ఒకిచోబీలో 2023లో ఎకరం రూ.8 లక్షలు చొప్పున 400 ఎకరాల్లో విస్తరించి ఉన్న వందేళ్ల కిందటి డైరీఫాంను కొనుగోలు చేశారు. సిరి ఫామ్స్ పేరిట అందులో 250 ఎకరాల్లో గంగిరేగు పండ్లు, సీతాఫలం, ఏడు రకాల మామిడి, కొబ్బరి, జామ, రామాఫలం, నేరేడు, వేప, రావి, చింత, ఉసిరి, పనస, ఖర్జూరం సాగు చేస్తున్నారు. డ్రోన్ల సాయంతో వేపనూనె పిచికారీ చేస్తూ సాంకేతికతను అందిపుచ్చుకుంటున్నారు. పంట ఉత్పత్తులను వాట్సాప్ ఆర్డర్ల ద్వారా అమెరికా వ్యాప్తంగా రెండు రోజుల్లో సరఫరా చేస్తున్నామని, త్వరలో తమ పొలం వద్దనే ఒక దుకాణం తెరిచే ఆలోచనలో ఉందని వీరు చెబుతున్నారు. వైవిధ్యం, విస్తీర్ణం పరంగా ఫ్లోరిడాలో అతిపెద్ద సాగుభూముల్లో ఒకటిగా సిరి ఫామ్స్ పేరు పొందింది. ప్రస్తుతం ఇక్కడ ఎకరం రూ.28 లక్షలు పలుకుతోంది.



గోశాల వద్ద గోవులు, దూడలు. యంత్రాలతో పాలు పితుకుతున్న దృశ్యం

600 ఎకరాలు.. 3 వేల గోవులు!

తెలంగాణకు చెందిన కొందరు ప్రవాస తెలుగు రైతులు కలిసి న్యూమెక్సికో సమీపంలో 600 ఎకరాల్లో 3వేల జెర్సీ ఆవులతో భారీ గోశాల నిర్వహిస్తున్నారు. 40 మంది కూలీలను నియమించుకుని ఈ గోవుల నుంచి రోజుకి రెండుసార్లు చొప్పున మొత్తంగా 66 వేల లీటర్ల పాలను సేకరించి, విక్రయిస్తున్నారు. ట్రంప్ టారిఫ్‌ల కారణంగా లీటరు రూ.18 (20 సెంట్లు)కు అమ్ముతున్నారు. డీ-80 వ్యవస్థతో 160 గోవుల నుంచి 15నిమిషాల్లో పాలు సేకరించి ఉష్ణోగ్రత నియంత్రిత ట్యాంకర్లోకి ఎక్కించి రవాణా చేస్తున్నారు. 600 ఎకరాల్లో సగం గోశాలకు, ఇతర నిర్మాణాలకు పోగా మిగిలిన 300 ఎకరాల్లో దాణా గడ్డి సాగుచేస్తూ నీటి కోసం బావులు తవ్వారు. ఈ గడ్డి 2 నెలలకు సరిపోతుందని, మిగతా దాణాను కొనుగోలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ గోశాలలో పాడిసంపదను 12 వేలకు, విస్తీర్ణాన్ని వేల ఎకరాలకు పెంచడమే లక్ష్యమని చెబుతున్నారు.

పిస్తా పంటతో భారీ రాబడి



విజయవాడకు చెందిన దేశు గంగాధర్‌కు కృష్ణా జిల్లా గండేపల్లిలో అల్లం, చెరుకు సాగు చేసిన అనుభవం ఉంది. దీంతో ఆరిజోనాలోని బోవైలో 160 ఎకరాల్లో 2016 నుంచి పిస్తా పప్పు పండిస్తున్నారు. 8 నుంచి 12 ఏళ్ల మధ్య పిస్తా చెట్టు కాపుకు వస్తుంది. 8వ ఏట నుండి దిగుబడి రెండింతలు అవుతుంది. 13వ ఏట పతాక స్థాయిలో దిగుబడి వస్తుందని గంగాధర్ తెలిపారు. ఎకరానికి రూ.2.5 లక్షల పెట్టుబడికి 1,800 కిలోల పప్పు దిగుబడి ద్వారా రూ.6.5 లక్షల రాబడి ఉంటుందని చెప్పారు. నీటి సమస్య, చీడపీడలు, చలి వంటి సవాళ్లు అమెరికాలోనూ ఉంటాయని వివరించారు. బాదం, పిస్తా సాగులో అమెరికా ప్రపంచంలో మొదటి స్థానంలో ఉంది. టాప్ గ్రేడ్ పప్పును ఇజ్రాయెల్ కొనుగోలు చేస్తుంది. ఆ తర్వాత రకాలను మధ్యప్రాచ్య, యూరప్, చైనా దేశాలు కొనుగోలు చేస్తాయి.

రాంచ్‌ల్లో విస్తృతంగా పశువుల పెంపకం

భూమి పెట్టుబడుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని డాలస్‌కు చెందిన రియల్ ఎస్టేట్ నిపుణుడు అనంత్ మల్లవరపు సూచిస్తున్నారు. ఇటీవలి కాలంలో డాలస్ చుట్టుపక్కల తెలుగువారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనేక రాంచ్‌ల వార్షిక నిర్వహణ ఖర్చులు, ఆస్తి పన్నులను భర్తీ చేసుకోవడానికి ఆయా భూముల్లో ఈవెంట్ సెంటర్లు, ఎయిర్ బీఎన్‌బీ క్యాబిన్లు నిర్మించి అద్దెకు ఇస్తున్నారని తెలిపారు. పన్ను మినహాయింపుల కోసం... రాంచ్‌ల్లో వ్యవసాయం తక్కువగా, పశువుల పెంపకం ఎక్కువగా ఉంటోందని చెప్పారు. భూమిని కేవలం పెట్టుబడిగా చూస్తూ వ్యవసాయ కార్యకలాపాలు చేయకపోవడం వలన కొన్ని సందర్భాల్లో పన్ను ప్రయోజనాలు కోల్పోయి, నిర్వహణ ఖర్చులు పెరుగుతున్నాయని అనంత్ వివరించారు.

శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్-ఐఐసీ టెక్నాలజీస్‌కు నల్లమలసాగర్ డీపీఆర్ బాధ్యత

▸▸ ఖరారు చేసిన జల వనరుల శాఖ


▸▸ వచ్చే నెలాఖరుకల్లా నివేదిక రూపొందించాలి


▸▸ అది అందాక కేంద్ర జలసంఘం ఆమోదానికి పంపనున్న సర్కారు

అమరావతి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): పోలవరం-నల్లమలసాగర్ అనుసంధాన పథకం సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారు చేసే బాధ్యతను రాష్ట్రప్రభుత్వం 'శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్-ఐఐసీ టెక్నాలజీస్ జాయింట్ వెంచర్'కు ఖరారుచేసింది. గత నెలలో డీపీఆర్ తయారీకి ఆసక్తిగల సంస్థలను ఆహ్వానిస్తూ టెండర్లు పిలిచారు. ఈ టెండర్లలో పై జేవీ వేసిన బిడ్‌ను జల వనరుల శాఖ ఆమోదించింది. ఈ జేవీ వచ్చే నెలాఖరులోగా డీపీఆర్‌ను తయారుచేసి అందజేయాలి. ఈ నివేదిక అందాక.. ఆమోదం కోసం కేంద్ర జల సంఘానికి సమర్పిస్తారు. వాస్తవానికి ప్రభుత్వం తొలుత పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకానికి డీపీఆర్‌ను తయారు చేసేందుకు టెండర్లు పిలిచింది. ఈ పథకాన్ని తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ తీవ్రంగా వ్యతిరేకించాయి. గోదావరి జలాల్లో భారీగా వాటా కోరాయి. దీంతో ఈ ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. దానిని పోలవరం నుంచి నల్లమలసాగర్ వరకే పరిమితం చేస్తూ రూ.58,700 కోట్ల ప్రాథమిక అంచనాలతో చేపట్టాలని నిశ్చయించింది. డీపీఆర్ తయారీకి టెండర్లు ఖరారు చేయడంతో నల్లమలసాగర్ పథకంపై ముందడుగు వేస్తున్నట్లేనని జల వనరుల శాఖ పేర్కొంది.

'మన మిత్ర' మాకు తెలియదు

(మొదటి పేజీ తరువాయి)





లక్షల మంది 'మన మిత్ర' ద్వారా మార్పులు తెలుసుకున్నారు. అయితే ఆ తర్వాత దాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో విఫలమయ్యారు. 'మన మిత్ర'ను ప్రారంభించినప్పుడే ఇంటింటికీ వెళ్లి దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటి వరకు 24.72 లక్షల కుటుంబాలకు అవగాహన కల్పించారు. ఇంకా వెళ్లాల్సిన ఇళ్లు 1.4కోట్లు ఉన్నాయి. 89 వేల మంది ఉద్యోగులు ఈ కార్యక్రమాల్లో పాల్గొంటే, 30 వేల మంది అసలు పాలు పంచుకోలేదు. ఇంటింటికీ వెళ్లి అవగాహన కలిగించే కార్యక్రమం అనుకున్న పద్ధతిలో జరగలేదని తాజా సర్వే వల్ల తెలుస్తోంది.

మాకు తెలియదు..: మనమిత్రపై ఫీడ్‌బ్యాక్ కోసం ప్రభుత్వం 20 లక్షల మందికి ఐవీఆర్ఎస్ కాల్స్ చేసింది. అందులో 1.45లక్షల మంది స్పందించారు.

ఆ జిల్లాల్లోనూ తెలియదట!

పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు లాంటి జిల్లాల్లో వాట్సాప్ గవర్నెన్స్ అంటే తెలియకపోవచ్చులే అనుకోవచ్చు. కానీ స్మార్ట్ ఫోన్లు అత్యధికంగా వినియోగించే ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల ప్రజలకు కూడా వాట్సాప్ గవర్నెన్స్ తెలియకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. బాపట్ల జిల్లాలో 73.3 శాతం మందికి, కృష్ణాలో 73.1 శాతం మందికి, ఎన్టీఆర్ జిల్లాలో 72.5 శాతం మందికి, కోనసీమలో 72.5 శాతం మందికి, పల్నాడులో 72.1 శాతం మందికి, ఏలూరులో 71.8 శాతం మందికి వాట్సాప్ గవర్నెన్స్ గురించి తెలియదని సర్వేలో తేలింది. దాని వినియోగంలోనూ ఈ జిల్లాలే అట్టడుగున ఉన్నాయి. కోనసీమ, బాపట్ల, కృష్ణా, పశ్చిమగోదావరి, ఎన్టీఆర్, ఏలూరు, అనకాపల్లి, తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ జిల్లాల్లో 20శాతం కంటే తక్కువ మంది 'మనమిత్ర' వాడుతున్నారు.

సేవలపై శాఖలకు రేటింగ్: 'మన మిత్ర' అందిస్తున్న సేవలపై ప్రజల అభిప్రాయాల ఆధారంగా శాఖలకు ప్రభుత్వం రేటింగ్ ఇచ్చింది. దేవాదాయ శాఖకు 9, ఇంధన శాఖకు 9.5, వ్యవసాయ శాఖకు 9, పెన్షన్లకు 9, పరిశ్రమల శాఖకు 9, విద్యాశాఖకు 9.5, జీరో పావర్టీ (పీ4)కి 9, ఏపీఎస్ఎస్‌డీసీకి 9, మెప్మాకు 9.5 రేటింగ్ దక్కింది. రవాణా శాఖకు అత్యల్పంగా 5 రేటింగ్ వచ్చింది. జ్ఞాన భూమికి 7, తల్లికి వందనానికి 7, వైద్యశాఖకు 7.5, జైళ్ల శాఖకు 7.5 రేటింగ్ లభించింది. మొత్తంగా శాఖల సేవలకు కలిపి 8.4 రేటింగ్ వచ్చింది.

వివాహేతర సంబంధం.. భర్త మర్మాంగం కట్!

▸▸ వేరే మహిళతో ఉండగా.. రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొన్న భార్య

▸▸ కత్తితో మర్మాంగాన్ని కోసేసి, బయట పడేసిన వైనం

▸▸ తమిళనాడులోని కోయంబత్తూరులో ఘటన

చెన్నై, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): తనను పట్టించుకోకుండా వేరే మహిళతో వివాహేతర సంబంధం సాగిస్తున్న భర్తపై ఆగ్రహించిన మహిళ.. అతని మర్మాంగాన్ని కోసేసింది. తమిళనాడులోని కోయంబత్తూరులో బుధవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అసోంకు చెందిన బిదాన్ (33) కొన్నేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం కోయంబత్తూరు వచ్చాడు. అత్తిపాళయంలోని ఓ రెసిడెన్షియల్ భవన సముదాయంలో ప్లంబర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి భార్య జిండి (36), ఓ కుమార్తె ఉన్నారు. వారిద్దరూ అసోంలోనే నివసిస్తున్నారు. ఈ క్రమంలో తన భర్త బిదాన్ తమిళనాడులో ఓ యువతితో వివాహేతర సంబంధం సాగిస్తున్నట్లు జిండి అనుమానించింది. ఆమె ఇటీవల కోయంబత్తూరు వచ్చి, దీనిపై భర్తను నిలదీసింది. అయితే తనకు ఎలాంటి అక్రమ సంబంధాలు లేవని బిదాన్ బుకాయించాడు. అయినా అనుమానం తీరక జిండి.. కోయంబత్తూరులోనే ఉండి భర్తతో కలిసి పనికి వెళ్తోంది. నాలుగు రోజుల క్రితం భార్య జిండి పనికి వెళ్లగా, బిదాన్ తన ఇంటికి ఓ మహిళను తీసుకొచ్చాడు. ఆ సమయంలో వారిద్దరిని జిండి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుంది. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి బిదాన్ పూటుగా మద్యం తాగి ఇంట్లో నిద్రపోతున్న సమయంలో.. భార్య కత్తితో అతని మర్మాంగాన్ని కోసేసి, బయట పడేసింది. బిదాన్ తీవ్ర బాధతో కేకలు పెట్టగా, చుట్టుపక్కల వారు వచ్చి అతడిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం జిదాన్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి, జిండిని అరెస్టు చేశారు.

మరో మావోయిస్టు అగ్రనేత హతం

▸▸ ఎన్‌కౌంటర్‌లో పాకా హనుమంతు మృతి

చింతూరు, చర్ల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ నాయకత్వానికి మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఒడిశా రాష్ట్రంలోని కంధమాల్ ప్రాంతంలో గురువారం జరిగిన భారీ ఎన్‌కౌంటరులో పార్టీ కేంద్ర కమిటీ సీనియర్ నేత, ఒడిశా రాష్ట్ర కమిటీ చీఫ్ పాకా హనుమంతు అలియాస్ గణేశ్ ఉయికే మరణించారు. ఆయనతోపాటు మరో ముగ్గురు మరణించారు. ఇదే రాష్ట్రంలోని గంజాం జిల్లాలో జరిగిన మరో ఎన్‌కౌంటరులో ఇద్దరు మహిళా మావోయిస్టులు మరణించారు. తెలంగాణ రాష్ట్రం నల్లగొండ జిల్లా చండూరు మండలం పుల్లెంగు గ్రామానికి చెందిన పాక హనుమంతు(67) తలపై రూ. 1.10 కోట్ల రివార్డు ఉంది. మరణించే సమయానికి దక్షిణ మధ్య బ్యూరో చీఫ్ హోదాలో సెంట్రల్ రీజియన్ బ్యూరో సభ్యునిగా కొనసాగుతున్నారు. పోలీసుల కథనం ప్రకారం, కంధమాల్ జిల్లా రంభ రిజర్వు ఫారెస్టు అటవీప్రాంతంలో జవాన్లు రెండురోజులుగా కూంబింగ్ జరుపుతున్నారు. బుధవారం తెల్లవారుజామున వారికి పాక హనుమంతు బృందం తారసపడింది. ఆ వెంటనే ఇరుపక్షాల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో హనుమంతు, మరో ముగ్గురు చనిపోగా, మిగతావారు తప్పించుకున్నారు. ఘటనాస్థలంలో ఒక ఏకే 47, రెండు ఇన్సాస్ రైఫిళ్లను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఛత్తీస్‌గఢ్, ఒడిశాల్లో చోటుచేసుకున్న పలు విధ్వంస ఘటనల్లో హనుమంతు నిందితుడిగా ఉన్నారు. కాగా, గంజాం జిల్లా తారాసింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని నారిగుచ్చా గ్రామ పరిసర ప్రాంతంలో సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్ జవాన్లకు మావోయిస్టులకు జరిగిన మరో ఎన్‌కౌంటరులో ఇద్దరు మహిళా మావోయిస్టులు మృతి చెందారు. వీరి నుంచి ఒక రివాల్వర్, ఒక 303 తుపాకీ, వాకీటాకీని స్వాధీనం చేసుకున్నారు. వీరిపై రూ.24 లక్షల రివార్డు ఉన్నట్లు పోలీసులు చెప్తున్నారు. సివిల్ డ్రెస్‌లో ఉంటూ మావోయిస్టు దళాలకు అవసరమైన వస్తువులను ఈ మహిళలు చేరవేస్తున్నట్టు భావిస్తున్నారు.



హనుమంతు మృతదేహం

22 మంది లొంగుబాటు తరువాత..

ఒడిశా డీజీపీ ఎదుట 22మంది మావోయిస్టులు 3 రోజుల క్రితం లొంగిపోయారు. వీరిలో రాష్ట్ర కమిటీ సభ్యులూ ఉన్నారు. ఆ తర్వాత 3రోజులకే హనుమంతు ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఏడాది ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఏపీ, మహారాష్ట్ర, తెలంగాణలో జరిగిన ఎన్‌కౌంటర్లలో 430 మందికిపైగా మావోయిస్టులు మృతి చెందినట్టు గణాంకాలు చెబుతున్నాయి.

ఇక మిగిలింది ఐదుగురే..

మావోయిస్టు పార్టీ ఏర్పడినప్పుడు 16 రాష్ట్రాల్లో ప్రాబల్యం చాటింది. కేంద్ర కమిటీ సభ్యులుగా సుమారు 42మంది ఉండేవారు. హనుమంతు మరణంతో ఈ సంఖ్య ఐదుకు చేరింది. పొలిట్ బ్యూరో సభ్యులుగా తిప్పర్తి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి ఉండగా, అనల్‌దా, పసునూరి విశ్వనాథ్, మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్ కేంద్ర కమిటీ సభ్యులుగా కొనసాగుతున్నారు.

పెద్ద ముందడుగు: అమిత్‌షా

పాకా హనుమంతు ఎన్‌కౌంటరుతో మావోయిస్టు రహిత భారత్ నిర్మాణం దిశగా గట్టి ముందడుగు పడిందని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అన్నారు. మావోయిస్టు రహిత రాష్ట్రాల్లో ఒడిశా మొదటి వరుసలో నిలిచిందన్నారు. ఇదే బాటలో నడిచేందుకు మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందంటూ అభినందించారు. వచ్చే మార్చి 31నాటికి తమ లక్ష్యం ఛేదించి తీరుతామని ఆయన పునరుద్ఘాటించారు.

ఎవరీ హనుమంతు?

పాకా హనుమంతు మావోయిస్టు పార్టీలోని సీనియర్ నేతల్లో ఒకరు. నల్లగొండలో 1981లో డిగ్రీ చదువుతూ, ఆర్ఎస్‌యూలో చేరారు. ఏబీవీపీ నాయకుడు శ్రీనివాస్ హత్య కేసులో హనుమంతును పోలీసులు నిందితుడిగా చేర్చారు. తర్వాత ఆయన పీపుల్స్ వార్ పార్టీలో (ఇప్పుడు మావోయిస్టు పార్టీ) చేరి అజ్ఞాతంలోకి వెళ్లారు. అప్పటి నుంచి తిరిగి రాలేదు. పార్టీలో అంచెలంచెలుగా ఎదిగి కేంద్ర కమిటీ సభ్యుడు అయ్యారు. ఏవోబీలో మావోయిస్టుపార్టీ ఉద్యమాన్ని నడిపించిన వారిలో హనుమంతు ఒకరు. 2013లో ఛత్తీస్‌గఢ్‌లోని దర్బా లోయలో మహేంద్ర కర్మపై దాడిచేసి 23 మందిని చంపివేసిన కేసులో హనుమంతు ప్రధాన నిందితుడు. ఒడిశాలో మావోయిస్టు పార్టీ జరిపిన అనేక దాడులకు నాయకత్వం వహించాడని పోలీసులు చెబుతున్నారు. చమ్రుదాదా, రాజేష్ తివారీ తదితర పేర్లతోనూ హనుమంతు పనిచేశారు.

కంబోడియా సైబర్ మాఫియా ఆటకట్టు

▸▸ అంతర్జాతీయ సైబర్ నెట్‌వర్క్‌ను ఛేదించిన ఏపీ సీఐడీ

▸▸ వియత్నాం మోసగాడి అరెస్ట్.. 1400 సిమ్‌లు స్వాధీనం

▸▸ నేడు పూర్తి వివరాలు వెల్లడించే అవకాశం

అమరావతి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ సైబర్ క్రైమ్ నెట్‌వర్క్ గుట్టును ఏపీ సీఐడీ పోలీసులు రట్టు చేశారు. కంబోడియా దేశానికి చెందిన సైబర్ మోసగాడితో పాటు మరికొందరిని అరెస్టు చేశారు. ఇంటర్నేషనల్ ఫోన్ కాల్స్‌ను సిబ్ బాక్స్ ద్వారా రూటింగ్ చేసి లోకల్ కాల్స్‌గా చూపించి మోసాలకు పాల్పడుతున్న ముఠా ఆట కట్టించారు. దేశ వ్యాప్తంగా నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకుని భారతీయులకు ఫోన్లు చేసి దర్యాప్తు సంస్థల అధికారుల ముసుగులో బెదిరిస్తున్న గ్యాంగ్‌కు చెక్ పెట్టారు. ఒక వైపు టెలికమ్ సంస్థలకు ఆర్థికంగా నష్టం కలిగిస్తూ మరో వైపు సైబర్ మోసాలతో సామాన్యుల ఖాతాలను సైతం కొల్లగొడుతున్న వియత్నాంకు చెందిన హో హుడే అనే కింగ్ పిన్‌తో పాటు ఇతర ముఠా సభ్యులను ఏపీ సీఐడీ పోలీసులు జైలుకు తరలించబోతున్నారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో కొందరిని మోసగించి, బెదిరించి డబ్బులు గుంజిన కేసుల దర్యాప్తులో భాగంగా సీఐడీ అధికారులు కీలక మూలాలను పసిగట్టారు. కంబోడియా నుంచి సిమ్ బాక్స్ ద్వారా మొత్తం తతంగం నడుస్తోందని గుర్తించి దేశ వ్యాప్తంగా ఆ నెట్‌వర్క్ పరిధిలో నిర్వహిస్తున్న కాల్ సెంటర్లపై దాడులు చేశారు. విశాఖపట్నంలో దొరికిన తీగను పట్టుకుని లాగి.. ఒడిశా, పశ్చిమ బెంగాల్ ప్రాంతాల్లోని గ్యాంగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. డైరెక్టరేట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ సహకారంతో.. సైబర్ నేరగాళ్లతో పాటు వారికి సహకరిస్తున్న బ్యాంకర్లను సైతం గుర్తించారు. అంతర్జాతీయ సైబర్ నెట్‌వర్క్‌పై పెద్ద దెబ్బ కొట్టిన ఏపీ సీఐడీ పోలీసులు శుక్రవారం పూర్తి వివరాలు వెల్లడించనున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 ,
RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.